UNIVERSAL
LIBRARY
OU_206277
UNIVERSAL
LIBRARY

# ఫ్రెడరిక్ ఎంగెల్సు

"ఓ, ఎట్టి దివ్య విజ్ఞాన జ్యోతి వెలుగనాగె
ఎట్టి విశాల హృదయ స్పందన మాగిపోయె!"

(విఖ్యాత రాజకీయ వ్యాఖ్యానికర్త డోబ్రొలుబోవ్ మరణంపై నెక్రసోవ్ వ్రాసిన గీతభాగం.)

1875 వ సంవత్సరం, ఆగస్టు 5-వ తేదీన లండను మహానగరంలో ప్రఖ్యాత సామ్యవాద సిద్ధాంతకర్త ఫ్రెడరిక్ ఎంగెల్సు భౌతికంగా మనమునుండి నిష్క్రమించాడు. 1883 లో ఎంగెల్సు ప్రాణస్నేహితుడైన కారల్ మార్క్సు మరణానంతరం ఎంగెల్సే యావత్తు నాగరిక ప్రపంచములోని అశేష పీడిత శ్రామిక జనానీకపు శాస్త్రీయ సామ్యవాద సిద్ధాంత బోధకుడుగా పరిగణింపబడ్డాడు. అది విచిత్రమో, కలుసుకున్న వేళావిశేషమో గాని కారల్ మార్క్సు — ఫ్రెడరిక్ ఎంగెల్సులు కలుసుకున్న మరుక్షణము నుండి జీవితాంతం వరకు, ఏకాశయాలు, ఆశయ సాఫల్యానికై అవిశ్రాంత కార్యాచరణ దీక్షాపరులు అయినారు! అందుచేతనే కార్మిక జనసామాన్యానికి ఫ్రెడరిక్ ఎంగెల్సు చేసిన సేవను గుర్తించాలంటే సమకాలీన శాస్త్రోద్యమ మార్గదర్శనంలో మార్క్సు మహాశయుని ఉపదేశ, కార్యాచరణల ప్రాశస్త్యాన్ని విస్పష్టంగా గ్రహించవలసివుంటుంది. ఆధునిక ఆర్థిక విధానసంతతమే నేటి కార్మికవర్గమూ, దానిపోరాట్లూ కోరికలూ అనీ, పెట్టుబడిదారీ వ్యవస్థ నిర్మాణములతో బాటుగానే కార్మిక వర్గోత్పత్తి నిర్మాణాలు జరుగుతాయనీ ప్రథమ పర్యాయం ప్రపంచదృష్టికి తెచ్చినవారిలో మార్క్సు, ఎంగెల్సులే అగ్రగణ్యులు. మానవ సమాజాన్ని నేడు పట్టి పీడిస్తున్న చిక్కుల నుండి ఉద్ధరించుట, ఏ కొందరో మంచి ఉదార హృదయుల వ్యక్తిగత దయాపూరిత ప్రయత్నాల వల్లనో కాక సంఘటిత కార్మికవర్గ పోరాటంద్వారా మాత్రమే సాధ్యమని వారు ఎలుగెత్తి చాటారు.

సోషలిజం అంటే స్వాప్నికుల నిరాధారపు ఊహలు కావనీ, ఆధునిక సమాజంలోని ఉత్పత్తిశక్తుల అభివృద్ధి క్రమ అంతిమాశయమూ, అవశ్యఫలితమూ అని తమ శాస్త్రీయరచనల్లో సాహసంగా బోధించినవారిలో మార్క్సు, ఎంగెల్సులే ప్రథములు. నేటివరకు యావత్తులిఖిత చరిత్రయూ వర్గపోరాట చరిత్రయే, ఒకవర్గముపై మరొకవర్గం సాధించిన విజయమే, చలాయించిన పెత్తనమే. వర్గపోరాటానికి, వర్గపెత్తనానికీ పునాదులైన ప్రత్యేకపుటాస్తి, అరాజక సాంఘిక ఉత్పత్తులు అంతరించేదాకా యీపోరాటం కొనసాగుతూనే వుంటుంది. కార్మికవర్గ ప్రయోజనాలు యాజమానుల నిర్మూలనాన్ని కోరతాయి. కాబట్టి యీ చైతన్యవంతమైన కార్మికవర్గ పోరాటాన్ని నడిపించాలి. ప్రతివర్గపోరాటమూ రాజకీయపోరాటమే.

ఈ వాదంలో మార్క్సు, ఎంగెల్సుల సిద్ధాంతాలను, విముక్తికై పోరాడుతున్న యావత్ప్రపంచ కార్మికవర్గమూ స్వంతభావాలుగా అవలంబించి భక్తి ప్రపత్తులతో అనుసరిస్తున్నారు గాని, అనేకవిధాలుగా సామ్యవాద సిద్ధాంత రంగంలోను, సమకాలీన సాంఘిక ఉద్యమాలలోను సిద్ధాంతాలను ప్రథమపర్యాయము వెల్లడించిన 1840-50 కాలంలో అవి క్రొత్తగా, వింతగా భావించబడ్డాయి. ఆ కాలంలో రాజకీయ స్వాతంత్ర్యమునకై జరిగే పోరాటమును, రాజుల మతాధికారుల, పోలీసుల నిరంకుశత్వ నిర్మూలనానికి జరిగే పోరాటమును మాత్రమే చూచి పెట్టుబడిదారీ, కార్మిక వర్గముల ప్రయోజనముల మధ్యనున్న పరస్పర వైరుధ్యమును అవగాహనము చేసుకోలేకపోయిన సమగ్రులు, అసమగ్రులు, నీతిపరులు, అవినీతిపరులు [illegible]. కార్మికులు ఒక సామాజిక శక్తిగా అభివృద్ధిచెంది [illegible] రాగలరనీ, రావాలనే భావించలేదు వారికెవ్వరూ ముక్తిపథంలో ప్రవేశించలేదు. మరొకవంక అనేకమంది స్వాప్నికులు కొందరు మేధావులతో సహా పరిపాలకులకు, అధికార వర్గాలకు ఆధునిక సాంఘిక వ్యవస్థలోని లోపాలను, అన్యాయాలను యుక్తియుక్తముగా చూపించి, బోధించి, ఒప్పించినంతమాత్రాన ఆ లోపాలు సరిదిద్దబడి శాంతిభద్రతలు, ప్రజాసౌఖ్యము ఏర్పడుతాయని భావించేవారు. పోరాటంలేకుండా సోషలిజం సాధించవచ్చునని వారు కలలుగన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆనాటి యావన్మంది సోషలిస్టులు, కార్మికబాంధ

వులు కార్మిక వర్గాన్ని సమాజంలో ఒక 'రాచపుండు'గా పరిగణించారు. పారిశ్రామికాభివృద్ధితో పాటు యీ 'రాచపుండు' కూడ పెరుగుటమూలాన వారు భయకంపితులయ్యారు. అందుచేత వారంతా కార్మికవర్గముతో పాటు పారిశ్రామికాభివృద్ధిని—అంటే "చరిత్రగతిని"—అడ్డుకునేందుకు మార్గాలు వెతుక నారంభించారు. కార్మిక వర్గాభివృద్ధిపట్ల అధికారుల్లో సామాన్యంగా వ్యాపించియున్న భయానికి బదులుగా మార్క్స్, ఎంగెల్సులు దాని నిరంతరాభివృద్ధి మీదనే తమ ఆశలన్నిటినీ నిలిపారు. శ్రామికుల సంఖ్య పెరిగినకొలదీ విప్లవపక్షంగా వారిశక్తిసామర్థ్యాలు పెరుగుతాయి. సోషలిజం ఆగమనానికి అవస్యం తరిగి అవకాశాలు పెరుగుతాయి. శ్రామికవర్గానికి మార్క్స్, ఎంగెల్సులు చేసినసేవను, "కార్మికవర్గము తనశక్తిని తానుగుర్తించి చైతన్యం పొందునట్లు చేసి, వారికి ఊహాజనిత మార్గాలకు బదులు శాస్త్రీయ పద్ధతులను బోధించారు" అని సంక్షిప్తముగా చెప్పవచ్చును.

ఇందుచేతనే ఎంగెల్సు నామధేయము, జీవితమూ ప్రతి కార్మికుడూ తెలుసుకోవాలి. ఇందుచేతనే ఆధునిక కార్మికవర్గ ఉత్తమబోధకు లిద్దరిలో ఒకడైన ఫ్రెడరిక్ ఎంగెల్సు సంక్షిప్తజీవిత చిత్రాన్ని, కార్యకలాపాలను యీచిన్న పుస్తకంలో యిస్తున్నాము. మాయితర పుస్తకాలవలె యిదికూడ కార్మికులలో వర్గచైతన్యాన్ని రేకెత్తించుటలో సాఫల్యాన్ని పొందుతుందని ఆశిస్తున్నాము.

ఎంగెల్సు ప్రష్యన్ సామ్రాజ్యంలో రైన్ రాష్ట్రంలోని బార్మెన్‌లో 1820 లో జన్మించాడు. ఆయన తండ్రి ఒక వుత్పత్తిదారుడు. పురాణ కావ్యబోధనచేసే మాధ్యమిక పాఠశాలలో తన చదువుముగియక పూర్వమే కొన్ని కుటుంబచిక్కులవలన 1838 లో ఎంగెల్సు బ్రెమెన్‌లోని ఒక వ్యాపారగృహంలో ఉమ్మేదువారుగా చేరవలసివచ్చింది. వ్యాపారసంబంధమైన ఉద్యోగంలో వుంటూన్నప్పటికీ ఎంగెల్సు తనశాస్త్రీయ రాజకీయ జ్ఞానార్జనా ప్రయత్నాలను విడిచివేయలేదు. మాధ్యమిక పాఠశాలలో చదివేనాటికే ఆయనలో అధికారుల అహంకార నిరంకుశత్వం పట్ల అసహ్యం, ద్వేషం వేళ్ళు పాతుకున్నాయి. తత్వశాస్త్రపఠనం ఆయనలోని ద్వేషాన్ని మరింత రెచ్చగొట్టింది. ఆనాడు జర్మన్ తత్వశాస్త్రరంగంలో హెగెల్

బోధనలు చాల ప్రబలంగా వున్నాయి. ఎంగెల్సుకూడ ఆయన శిష్యవర్గంలో చేరాడు. హెగెల్ వ్యక్తిగతంగా నిరంకుశ ప్రష్యాసామ్రాజ్యాను రక్తడుగావుండి, బెర్లిన్ విశ్వవిద్యాలయంలో ఆచార్యుడుగా ప్రభుత్వోద్యోగమే చేస్తున్నప్పటికీ ఆయన బోధనమటుకు విప్లవాత్మకంగా వుండేది. మానవహేతు జ్ఞానంలోను, హక్కులలోను హెగెల్ పండితునికి విశేషమైన నమ్మకముంది. ఈవిశాలవిశ్వంలో నిరంతరాయంగా మార్పు, అభివృద్ధిజరుగుతున్నాయనేది ఆయనసిద్ధాంతానికి మూలసూత్రం. ఆనాటి ప్రత్యక్షపరిస్థితిలేక దుస్థితినిచూచి ఊరుకోలేక పోయిన అబెర్లిన్ విశ్వవిద్యాలయాచార్యుని శిష్యులలో కొందరు ఆనాటిప్రభుత్వ నిరంకుశత్వానికీ, అన్యాయాలకు వ్యతిరేకంగా జరిగేపోరాటం కూడ యీవిశాలవిశ్వంలో నిరంతరాయంగా జరిగేమార్పు, అభివృద్ధులలో భాగమేననే నిశ్చయానికి వచ్చారు. విశ్వంలోని సమస్తవస్తువులూ అభివృద్ధిచెందుతూంటే, పాతవ్యవస్థలస్థానాన్ని క్రొత్తవ్యవస్థలు ఆక్రమించుకుంటూంటే మరి—ప్రష్యన్ సామ్రాట్టుల, రష్యన్ జారుల నిరంకుశత్వం, కొలదిమంది కోటీశ్వరులై కులకటం, కోటానుకోట్ల ప్రజలపై కొలదిమంది పెట్టుబడిదారుల పెత్తనం—శాశ్వతంగా ఎందుకుకొనసాగాలి?

హెగెల్ తత్వశాస్త్రంలో మానసిక, భావాభివృద్ధులను గురించి చెప్పబడింది. మానసికాభివృద్ధి మూలంగానే ప్రకృతి, మానవుడు, మానవునకూ సమాజానికీ మధ్యగల సంబంధాలూ అభివృద్ధి చెందుతాయని ఆయనభావం. అందుచేతనే ఆయనబోధన 'భావాత్మకం.' మార్క్సు, ఎంగెల్సులు ఆయన బోధనలోని "విశ్వంలో నిరంతరాయమైన మార్పు, అభివృద్ధులు జరుగుతున్నాయి," అనేభాగాన్ని గ్రహించి ఆయన ఆధారరహితమైన భావవాదాన్ని విసర్జించారు. (మార్క్సు, ఎంగెల్సులు అనేకమార్లు తమ మానసికాభివృద్ధికి అధికముగా తోడ్పడిన జర్మన్ తత్వశాస్త్రవేత్తలకు, ముఖ్యంగా హెగెల్ కు తమకృతజ్ఞతను తెలిపారు. "జర్మన్ తత్వశాస్త్రమే లేకపోయినట్లయితే శాస్త్రీయమైన సోషలిజం వుండేదికాదు"—ఎంగెల్సు) వారుజీవితమును పరీక్షించి ప్రకృతియొక్క అభివృద్ధికి కారణం మానసికాభివృద్ధి కాదనీ, పైగా మానసికాభివృద్ధికి మూలం ప్రకృతిలోను, పదార్థంలోను కలదని వారు గుర్తించారు... హెగెల్ వలెను, ఆయన యితరశిష్యుల

వలెను భావవాదులు కాక మార్క్స్, ఎంగెల్సులు భౌతికవాదులు. తమ భౌతికదృష్టితో విశ్వమును, మానవసమాజమును వీక్షించి ప్రకృతిలో దృష్టికిగోచరించే చరాచరవస్తుజాల మంతటికీ మూలమైన భౌతిక కారణాలున్నట్లే మానవసమాజాభివృద్ధికిగూడ భౌతికవుత్పత్తిశక్తులే కారణమని మార్క్స్, ఎంగెల్సులు గుర్తించారు. తమజీవితావసరాల నిమిత్తమై చేయు వుత్పత్తిలో మానవులమధ్య పరస్పర సంబంధాలు ఉత్పత్తిశక్తుల అభివృద్ధిపై ఆధారపడి వుంటాయి. ఈపరస్పర సంబంధాల దృష్టితోనే మనంసామాజిక జీవిత ఘటనలను, మానవ ఉన్నతాశయాలను, భావాలను శాసనాలను, సరిగాఅర్థం చేసుకోగల్గుతాము.

ఉత్పత్తిశక్తుల అభివృద్ధి ప్రత్యేకఘట్టాన్నిపై ఆధారపడిన సామాజిక సంబంధాలను సృష్టిస్తుంది. కాని యీవాదుమనం చూచినట్లయితే ఆఉత్పత్తిశక్తుల అభివృద్ధియే అత్యధిక సంఖ్యాకులను ధనవిహీనులనుచేసి, అత్యల్ప సంఖ్యాకులను కోటానుకోట్లకు అధీశ్వరులను చేస్తోంది. ఈ అభివృద్ధియే ఆధునిక సామాజిక విధానానికి పునాదియైన ప్రత్యేకఘట్టాన్ని రూపుమాపుతుంది. అంటే సోషలిస్టులు ఏఆశయసిద్ధికై కృషిచేస్తున్నారో ఆ ఆశయ సాఫల్యానికి తోడ్పడుతుందన్నమాట. ఆధునిక సమాజంలో యేసామాజిక శక్తిప్రయోజనాలు సామ్యవాద సంపాదనకు అనుగుణ్యంగా వున్నాయో అనే విషయం మాత్రం గ్రహించి ఆశక్తికి తనప్రయోజనాల సంబంధమైన చైతన్యమును, చారిత్రక బాధ్యతలను సోషలిస్టులు బోధించాలి. కార్మిక వర్గమే ఆశక్తి. ఇంగ్లండుదేశంలోని మాంఛెస్టరు నగరంలో తనతండ్రికూడ భాగస్వామియైన ఒకవ్యాపారగృహంలో ఎంగెల్సు 1842 లో ఉద్యోగానికి కుదిరాడు. మాంఛెస్టరు నగరం బ్రిటిష్ పారిశ్రామిక కేంద్రం. అక్కడే ఆంగ్లకార్మిక వర్గంతో ఎంగెల్సుకు సన్నిహిత సంబంధం ఏర్పడింది. అక్కడ ఎంగెల్సు బుద్ధిమంతుడువలె కూలీల దుర్గంధ భూయిష్టమైన సందుగొందులన్నీ తిరిగి అతిసమ్మర్దమైన, మురికి కూపాలైన కార్మిక నివాసాలను, వారిదైన్యాన్ని, దుస్థితినీ స్వయంగా పరీక్షించేవాడు. తాను స్వయంగా పరీక్షించి గ్రహించిన దానితోనే తృప్తిపడక అప్పటికి యితరులు పరిశీలించి ప్రకటించిన బ్రిటిష్ కార్మిక వర్గంయొక్క పరిస్థితి సంబంధిం

చిన విషయాలను, తన కా విషయమై దొరికిన అన్ని అధికార పత్రాలను అతి జాగ్రత్తతో పఠించి క్షుణ్ణంగా అధ్యయనం చేసుకున్నాడు. ఆకృషి ఫలితంగానే “ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి” అనే గ్రంథం 1845 లో వెలువడింది.

“ఇంగ్లండులో కార్మిక వర్గపరిస్థితి” రచనద్వారా ఎంగెల్సు చేసిన మహత్తరమైన సేవనుపైన వివరించాం. ఎంగెల్సు కన్న ముందుగానే కార్మికవర్గ దుస్థితిని వర్ణించి, ఆ దుస్థితినితొలగించి కార్మికవర్గానికి సహాయం చేయవలసిన అవసరాన్ని సూచించిన వారు అనేకమందివున్నారు. కాని, కార్మికులు దుస్థితిలోవున్న ఒకవర్గము మాత్రమే కాదని, యీనాడు యెట్టి హీనమైన, నికృష్టమైన, నిస్సహాయమైన ఆర్థికదుస్థితిలో కార్మికులున్నారో ఆదుస్థితే వారిని ముందుకు త్రోలి తమఅంతిమ విముక్తికై పోరాడునట్లుచేసి తీరుతుందనికూడ చెప్పినవారిలో ఎంగెల్సు ప్రప్రథముడు. అంతేకాక పోరాటంలో పాల్గొనే కార్మికవర్గం స్వశక్తి స్వప్రయత్నాల మీదనే ఆధారపడి జయాన్ని సాధిస్తుంది కార్మికులలో ప్రబలిన రాజకీయఉద్యమం సోషలిజం వినా వేరువిముక్తిమార్గం లేదనే చైతన్యాన్ని వారిలో కలుగచేస్తుంది. వేరు విధంగా చెప్పాలంటే కార్మిక‘వర్గ’ రాజకీయ పోరాటంయొక్క ఆశయమైన నాడే సోషలిజం ఒకశక్తిగా తయారౌతుంది. “ఇంగ్లండులో కార్మికవర్గ పరిస్థితి” లోని ముఖ్యమైన భావాలనుపైన పేర్కొన్నాను. ఆరోజుల్లో యీభావాలు అతినూతనమైనవి. ఈనాడు జాగృతిచెంది, పోరాటాలలో పాల్గొనే కార్మికవర్గం యావత్తూ యీభావాలను అవలంబించుతూంది. బ్రిటిష్ కార్మికవర్గ దుర్భరదుస్థితి చిత్రాలతో, భయంకరనగ్న సత్యాలతో నిండిన ఆగ్రంథంలో తన యీభావాలను ఎంగెల్సు అత్యద్భుతంగా ఉపపాదించాడు. ఆగ్రంథం పెట్టుబడిదారీ విధానంపై, పెట్టుబడిదారీ వర్గంపై అతినిశితమైన నేరారోపణ. ఆగ్రంథం కలుగజేసిన సంచలనం అత్యధికం. ఆధునిక కార్మికవర్గస్థితిని వర్ణించే గ్రంథాలలోకెల్ల ఎంగెల్సుగ్రంథమే అత్యుత్తమమైనదని అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు. నిజానికి 1845 కు పూర్వంగాని, తర్వాతగాని కార్మికవర్గ దుస్థితిని అంతనిశితంగా, నగ్నంగా చిత్రించినగ్రంథం వెలువడలేదు.

ఎంగెల్సు ఇంగ్లండులో వున్నకాలంలోనే సోషలిస్టుగా మారాడు.

బ్రిటిష్ కార్మికోద్యమ సేవకులతో మాంఛెస్టరులో ఎంగెల్సుకు పరిచయమేర్పడిన నాటినుండి ఆయన ఇంగ్లీషు సోషలిస్టు ప్రచురణలలో తనరచనలను చేర్చ నారంభించాడు. 1844 లో ఎంగెల్సు జర్మనీకి పారిస్ మీదుగా తిరిగివచ్చే సమయంలో ఆయనకు, తానంతకు ముందే ఉత్తరప్రత్యుత్తరాలు జరుపనారంభించిన మార్క్సు మహాశయుని ప్రత్యక్ష పరిచయ భాగ్యంలభించింది. పారిస్‌లో ఫ్రెంచి శ్రామికులయొక్క, ఫ్రెంచి సోషలిస్టులయొక్క-పలుకుబడి మూలాన మార్క్సుకూడ అప్పటికి సోషలిస్టుగా మారాడు. పారిస్‌లో ఆమిత్రులిద్దరూ కలిసి "పవిత్రకుటుంబం" లేక "సునిశిత విమర్శపై విమర్శ" అనే గ్రంథాన్ని రచించారు. "బ్రిటిష్ కార్మికవర్గ పరిస్థితి"కి ఒక యేడాది ముందుగా ప్రచురింపబడిన యీగ్రంథంలో నేను పైనవివరించిన విప్లవాత్మక భౌతిక సామ్యవాద మూల సూత్రాలు ప్రతిపాదించబడ్డాయి. ఈగ్రంథంలో హెచ్చుభాగం మార్క్సుచేత రచింపబడింది. "పవిత్రకుటుంబం" అన్నది బోర్ సోదరులకు, తత్వశాస్త్రజ్ఞులకు, వారిశిష్యపరమాణువులకు పెట్టబడిన హాస్యపూరిత వికటనామం! ఈపెద్దమనుష్యులు భౌతిక స్వత్వాలకు, పార్టీలకు, రాజకీయాలకు అతీతమై, యదార్థ కార్యాచరణకు ప్రతికూలమై, పరిసరప్రపంచాన్ని దానిలో సంభవించే దృశ్యఘటనలను "విమర్శనాత్మకంగా" పరిశీలించేటటువంటి ఒకకొత్తరకమైన విమర్శనాపద్ధతిని బోధించారు. బోర్ ముఠావారు కార్మికవర్గాన్ని మందబుద్ధులమూకగా పరిగణించి అలక్ష్యంచేశారు. బోర్ ప్రభృతుల అసందర్భపు ప్రమాదకరమైనవిధానాన్ని మార్క్సు, ఎంగెల్సులు తీవ్రంగా ఎదిరించారు. ప్రభుత్వవర్గాలచేతను, ప్రభుత్వం చేతను పీడిత తాడితులైన యదార్థమానవులైన కార్మికుల కొరకు పరిస్థితుల పరిశీలనకు కాక, ఒకఉత్తమసమాజ వ్యవస్థా స్థాపనకుగాను పోరాటం సాగించమని వారు పిలుపునిచ్చారు. కార్మికవర్గమే అట్టిపోరాటము సాగించగల శక్తికలదిగాను, అభిలాషకలదిగాను వారుపరిగణించారు. "పవిత్రకుటుంబం" ప్రచురణకు పూర్వమే మార్క్సు-రూగెల 'జర్మన్—ఫ్రెంచి వార్షికసంచిక'లో ఎంగెల్సు "అర్థశాస్త్రంపై సవిమర్శక వ్యాసం" సోషలిస్టు దృక్పథంలో ప్రకటిస్తూ అందులో ప్రత్యేకాస్తి పద్ధతికితప్పనిసరి ప్రతిఫలమే నేటి ఆర్థికవ్యవస్థయని ఆయన చర్చిం

చాడు. ఏ అర్థశాస్త్ర రంగంలో మార్క్స్ రచనలు బ్రహ్మాండమైన విప్లవాన్ని సాధించాయో ఆ అర్థశాస్త్రాన్ని ఆయన పఠించడానికి ఎంగెల్స్‌తో ఆయనకు కలిగిన పరిచయ స్నేహాలు చాల హెచ్చుగా తోడ్పడ్డాయనటం నిస్సందేహమైన విషయం.

తన శాస్త్రీయ పరిశోధనలతో బాటు బ్రస్సెల్స్, పారిస్ నగరాల లోని కార్మికుల మధ్య ప్రత్యక్ష కార్యాచరణను కూడ సాగిస్తూ 1845 నుండి 1847 వరకు బ్రస్సెల్స్, పారిస్ నగరాలలో ఎంగెల్స్ గడిపాడు. ఆ కాలంలో వారికి రహస్యంగా పనిచేస్తున్న జర్మన్ "కమ్యూనిష్టుసమితి"తో ప్రత్యక్ష సంబంధం యేర్పడింది. ఆ సమితివారు వారిని తమ సోషలిస్టు మూల సిద్ధాంతాలను ప్రతిపాదించి విశదీకరించమని నియమించారు. 1848లో ప్రకటింపబడిన "కమ్యూనిష్టుప్రణాళిక" అను ప్రఖ్యాతగ్రంథం యీ విధంగా ఉద్భవించింది. ఈచిన్న కరపత్రం అనేక ఉద్గ్రంథ సముదాయంతో సమానమైనది. యీనాటి నాగరక ప్రపంచం లోని సంఘటిత కార్మిక వర్గ ఉద్యమానికి యీ కరపత్రం లోని భావాలు జీవం పోస్తున్నాయి.

ఫ్రాంసులో ప్రప్రథమంగా ప్రారంభమై క్రమంగా పశ్చిమయూరపు దేశాలకు వ్యాపించిన 1848 విప్లవం మూలాన మార్క్స్, ఎంగెల్సులు తమ మాతృదేశమైన ప్రష్యాకు చేరుకున్నారు. కలోన్‌లో ప్రకటింప బడుచున్న "న్యూ రెనిష్ జీటంగ్" అనే ప్రజాతంత్ర పత్రికకు వెంటనే నాయకత్వం వహించారు. ప్రష్యాలో విప్లవ ప్రజాతంత్ర) ఆశయాలన్నింటినీ వారు తమలో మూర్తీభవింప జేసుకుని ప్రజల స్వాతంత్ర్య ప్రయోజనాల రక్షణార్థమై అభివృద్ధి నిరోధక శక్తులతో నిరంతర తీవ్రపోరాటం సాగించారు. కాని యీపోరాటంలో అభివృద్ధినిరోధక శక్తులకే విజయంలభించి "న్యూ రెనిష్ జీటంగ్" అణచి వేయబడింది. మార్క్స్ తనవలస జీవిత కాలంలో ప్రష్యా పౌరహక్కులు కోల్పోయి యుండుటచేత వెంటనే దేశము నుండి తరిమి వేయబడ్డాడు. కాగా ఎంగెల్స్ మాత్రం ప్రష్యాలోనే వుండి ప్రజల సాయుధవిప్లవంలో పాల్గొని, స్వాతంత్ర్యంకొరకై మూడు యుద్ధాలలోపోరాడి కడకు విప్లవవాదులోడిపోగా స్విట్జర్లండు ద్వారా తప్పించుకు పోయి లండన్ చేరుకున్నాడు.

మార్క్సుకూడ లండనులోనే తన నివాస మేర్పరుచుకున్నాడు. ఎంగెల్సు లండన్‌లో గుమాస్తాగా చేరి కొంత కాలం పనిచేసి, ఆ తర్వాత పూర్వం తానుపనిచేసియున్న మాంచెస్టరు వ్యాపార గృహంలో భాగస్తుడుగా చేరి మాంచెస్టరు నివాసాన్నేర్పరుచుకున్నాడు. 1870 వరకూ మార్క్సు, ఎంగెల్సు లిద్దరూ వేర్వేరు ప్రదేశాలలో ఉన్నప్పటికీ ఉత్సాహాకరమైన ఉత్తర ప్రత్యుత్తరాలు నిరంతరం సాగిస్తూ మానసికంగా అతి సన్నిహితంగా ఉంటూవచ్చారు. నిత్యంగుడు, వారిమధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరగనిరోజు లేదంటే అతిశయోక్తి కాదు! ఆమిత్రు లిద్దరూ యీ ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా తమ తమ భావాలను, జ్ఞానాన్ని ఒకరికొకరు అందజేసుకుంటూ సంయుక్తంగా శాస్త్రీయ సోషలిజాన్ని విశదీకరించారు. 1870లో ఎంగెల్సు కూడ లండన్ తిరిగివచ్చాడు. ఆనాటి నుండి 1883లో మార్క్సు మరణించిన నాటివరకు విశేష పరిశ్రమతో కూడినవారి సంయుక్త శైల్యానికి జీవితం కొనసాగింది ఈ కృషిఫలితంగానే మన కాలంలో వెలువడిన రాజకీయార్థిక గ్రంథాలన్నింటిలో అత్యుత్తమమైనదైన మార్క్సు యొక్క "పెట్టుబడి" గ్రంథం, ఎంగెల్సు రచించిన అనేక చిన్న పెద్ద గ్రంథాలు వెలువడ్డాయి ఎంగెల్సు పెట్టుబడిదారీ అర్థశాస్త్రములోని అనేక క్లిష్ట సమస్యలను విపులంగా విశదీకరించాడు. అతి సులభము, సరళము తార్కికము అయిన తన రచనలలో సర్వసాధారణ శాస్త్రీయ సమస్యలను, గతకాలపు, ప్రస్తుతపు వివిధ సంఘటనలను మార్క్సు ఆర్థిక సిద్ధాంత దృష్టిలోను, చారిత్రక భౌతికవాద దృష్టిలోను, ఎంగెల్సు విపులీకరించాడు. జర్మనీలో డుహ్రింగును ఖండిస్తూ ఆయన వ్రాసిన తార్కిక గ్రంథము (ఇందులో తత్వ, ప్రకృతి, సామాజిక శాస్త్రరంగముల లోనిముఖ్య సమస్యలన్నీ సమగ్రంగా చర్చించబడ్డాయి) "కుటుంబం, ప్రత్యేకపుటాస్తి, ప్రభుత్వము వాటి పుట్టుపూర్వోత్తరాలు," "లుడ్విగ్ ఫ్యూర్‌బా" రష్యన్ ప్రభుత్వ విదేశాంగ నీతిపై ఒక వ్యాసము, గృహ సమస్యపైకొన్ని ప్రముఖ వ్యాసాలు, ఆఖరున చిన్నదే అయినా రష్యన్ ఆర్థికాభివృద్ధిపై చాల ముఖ్యమైన రెండు వ్యాసాలను మాత్రమే యిక్కడ పేర్కొంటున్నాము. మహత్తర గ్రంథమైన "పెట్టుబడి" ని పూర్తిచేయకుండానే

మార్క్సు మరణించాడు. కాని అసమగ్రమైన చిత్తు ప్రతి ఆధారంతో తన స్నేహితుని మరణానంతరం ఎంగెల్సు విశేష పరిశ్రమచేసి రెండవ భాగాన్ని 1885 లోను. మూడవ భాగాన్ని 1894 లోను ప్రకటించాడు. దురదృష్టవశాత్తు అయిన నాల్గవ భాగం పూర్తిచేయలేక పోయాడు. రెండు, మూడు భాగాలను పూర్తిచేయుటానికి చాలకృషి అవసరమైంది. "పెట్టుబడి" రెండు, మూడు భాగాలను ప్రచురించి తన స్నేహితుని అసామాన్య మేధశ్శక్తి చిత్రాన్ని ఉన్నతంగా మనసునో ఫలకాలపై చిత్రించి దానిపై అనుద్దేశ పూర్వకంగానే తన నామాన్నికూడ ఆస్ట్రియన్ సోషల్ డెమాక్రట్ అయిన అడ్లర్ చెప్పినట్లుగా శాశ్వతంగా లిఖించుకొన్నాడు. ఈ రెండు భాగాలూ నిజానికి మార్క్సు. ఎంగెల్సుల సంయుక్త కృషి ఫలితమని చెప్పాలి. పురాణ కాలపు అనేక మహత్తర స్నేహ గాథలు వినియున్నాము. తమ రాజకీయ శాస్త్ర నిర్మాతలు, ఉత్తమ పండితులు, సాహసోపేతులైన సైనికులు అయిన మార్క్సు, ఎంగెల్సుల అపూర్వ స్నేహగాథ పురాణ స్నేహ గాథలన్నింటినీ మించిన దని యూరపియన్ కార్మిక వర్గం గర్వించవచ్చును. ఎంగెల్సు ఎల్లప్పుడూ మార్క్సుకు ప్రాముఖ్యత నిచ్చి తానాయన వెనుక స్థానంలో నుండేవాడు. తన పాత స్నేహితుని కొకనికి జాబువ్రాస్తూ ఎంగెల్సు—"మార్క్సుకన్న నేనెప్పుడూ ఒక మెట్టు దిగువనే యుండేవాడిని"— అని వ్రాసిన దానినిబట్టి అది సహేతుకమే అని మనం గ్రహించవచ్చును. మార్క్సు జీవితకాలంలో ఆయనపట్ల ఎంగెల్సుకుగల గౌరవము అనంతము, అప్రతిమానము. సాహసిక సైనికుడు, సుశిక్షిత మేధావి అయిన ఎంగెల్సు హృదయం నవనీతసదృశం, ప్రేమ పునీతమూను.

1848–49 ఉద్యమానంతర ప్రవాస కాలంలో మార్క్సు, ఎంగెల్సులు ఒక శాస్త్ర విషయాలతో మాత్రమే సంతృప్తి పడియూరుకోలేదు. 1864 లో మార్క్సు అంతర్జాతీయ కార్మిక సంఘాన్ని స్థాపించి ఒక దశాబ్దం పాటు దానికి తానే నాయకత్వం వహించి నడిపించాడు. ఎంగెల్సుకూడ ఆ సంఘ కార్యకలాపాలలో ప్రముఖ పాత్ర వహించాడు అంతర్జాతీయ కార్మిక సంఘం స్థాపించుటలో ప్రపంచ కార్మికుల నేకం

చెయ్యటమే మార్క్స్ ఉద్దేశం. ఆయన భావించినట్లే ఆ సంఘం కార్మికోద్యమాభివృద్ధికి విశేషంగా తోడ్పడింది. 1870-79 మధ్య కాలంలో. అంతర్జాతీయ కార్మిక సంఘం రద్దయిపోయాక కూడ కార్మిక వర్గ ఐక్యతకై వారుచేసిన కృషిప్రముఖపాత్ర వహించింది. నిరంతర కార్మికోద్యమాభివృద్ధిలో పాటువారి కార్మిక వర్గ అదర్శ నాయకత్వ ప్రాధాన్యతకూడ క్రమక్రమంగా పెరుగ నారంభించింది. కాగా మార్క్స్ మరణానంతరం యూరపియన్ సోషలిస్టు లందరికి ఎంజెల్సే ఏకైక నాయకుడూ, సలహాదారూ అయినాడు. ప్రభుత్వ దమన నీతిని వ్యతిరేకించి అతి త్వరితంగా, అవిరామంగా సంఖ్యాబలం సంపాదించుకుంటూన్న జర్మన్ సోషలిస్టులు, అతి మెలుకువలో దీర్ఘాలోచనా నంతరం తమ ప్రథమ ప్రయత్నాలను చేయవలసిన స్పెయిన్, రుమేనియా, రష్యా మొదలైన వెనుకబడిన దేశాల ప్రతినిధులుకూడ ఎంజెల్సు సలహాలను, సూచనలను అర్థించి పొందేవారు. వృద్ధ ఎంజెల్సు యొక్క విలువైన విజ్ఞానాన్ని, అపారమైన అనుభవాన్ని వారంతా వినియోగించుకునేవారు.

మార్క్స్, ఎంజెల్సు లిద్దరికి రష్యన్ భాషవచ్చును. వారు రష్యన్ గ్రంథాలను తరుచుగా పఠిస్తూ రష్యన్ విప్లవవాదులతో సన్నిహిత సంబంధం కలిగి, రష్యన్ విప్లవోద్యమ గమనాన్ని సానుభూతితో పరిశీలిస్తుండేవారు. వారు సోషలిస్టులుగా మారటానికిముందు "ప్రజాతంత్రవాదులు" గా వుండేవారు అందుచేతనే వారియువ్వరిలోను రాజకీయ నిరంకుశత్వం పట్ల అరవిద్వేషం అభివృద్ధి చెందింది. ఆర్థిక దోపిడికీ, రాజకీయ నిరంకుశత్వానికీ గల సంబంధాన్ని సిద్ధాంతరీత్యా పరిపూర్తిగా అర్థంచేసుకోవటం వల్లను, తమ విశేష విశిష్ట అనుభవం వల్లను, దానికితోడు ప్రత్యక్ష రాజకీయ సంబంధ, కార్యాచరణలవల్లను మార్క్స్, ఎంజెల్సులకు రాజకీయాలు ప్రాణప్రదమైనాయి. అందుచేతనే మహాశక్తి వంతమైన జారు ప్రభుత్వంపై కొలదిమంది రష్యన్ విప్లవవాదులు సాగించిన వీరోచిత పోరాటాన్ని యీ విప్లవవాదులు సానుభూతితో వీక్షించ గలిగారు. ప్రథమంగా ప్రధానంగా సాగించవలసిన పోరాటం రాజకీయ స్వాతంత్ర్య సంపాదనార్థమై కాక తద్విరుద్ధంగా ఆర్థిక హక్కుల సాధనార్థమై పోరాట

గమనాన్ని మార్చ ప్రయత్నించిన రష్యన్ సోషలిస్టుల ప్రయత్నాలను అనుమాన కారణంగాను, విప్లవ ద్రోహ ప్రాయంగాను పరిగణించారు. "కార్మిక వర్గ విముక్తికై కార్మిక వర్గమే పోరాడాలి" అంటూ మార్క్సు, ఎంగెల్సులు నిరంతరమూ బోధిస్తూ వుండేవారు. కాని ఆర్థిక విముక్తికై కార్మిక వర్గం పోరాడుటకు గాను ముందుగా కొన్ని "రాజకీయ" హక్కులు సంపాదించుకోవాలి. దీనికితోడు రష్యాలో రాజకీయ విప్లవమే వస్తే పశ్చిమ యూరపు దేశాల కార్మికోద్యమానికి అత్యంత అధికంగా, అద్భుతంగా తోడ్పడుతుందో మార్క్సు, ఎంగెల్సులు సంపూర్ణంగా గుర్తించారు. యూరపులోని యావత్తు అభివృద్ధినిరోధక శక్తులకూ నిరంకుశ రష్యా పెట్టనికోటగా వుండేది. 1880 యుద్ధ ఫలితంగా జర్మనీ, ఫ్రాంసులు చాల కాలందాకా శత్రుత్వాలో మునిగిపోయాయి. అంతకుముందే అంతర్జాతీయ రంగంలో అభివృద్ధి నిరోధక శక్తిగా తయారైన నిరంకుశ రష్యాను 1870 నాటియుద్ధం మరింత ప్రముఖ అభివృద్ధినిరోధక శక్తిగా మార్చింది. పోలులు, ఫిన్నులు, జర్మనులు, ఆర్మీనియనులనుగాని, యితర చిన్న జాతులనుగాని పీడించవలసిన అవసరము లేని; ఫ్రాంసు, జర్మనీ దేశాలమధ్య నిరంతర శత్రుత్వమును కోరని స్వతంత్ర రష్యామాత్రమే ఆధునిక యూరప్‌ను మిలిటరీ పీడల బారినుండి విముక్తిచేసి, యూరప్‌లోని యావదభివృద్ధినిరోధక శక్తులనూ బలహీనపరచి, యూరపియన్ కార్మికవర్గ శక్తిని యితోధికంగా యినుమడింప చెయ్యగలదు. పశ్చిమ యూరపు దేశాల కార్మికోద్యమాభివృద్ధినికూడ దృష్టిలో నుంచుకునే ఎంగెల్సు రష్యాలో రాజకీయ స్వాతంత్ర్య స్థాపనను గాఢంగా వాంఛించాడు. అట్టి సన్మిత్రుడైన ఎంగెల్సు మరణం రష్యన్ విప్లవ వాదులకే కాక యావత్ప్రపంచానికే తీరని కొరత.

కార్మిక వర్గ మహానాయకుడూ, మార్గదర్శకుడూ అయిన ఎంగెల్సు మహనీయుని స్మృతి చిరకాలం వర్ధిల్లుగాక!

(రచన: 1895, ఆకు రాలుకాలం)

# ఫ్రెడరిక్ ఎంగెల్సు

## జీవితం—ఉపదేశాలు.

### ప్రకరణం 1.

## బాల్యం.

జర్మనీ దేశంలోని బార్మెన్ నగరంలో మార్క్సు జనావాసాంతరం రందున్న తండ్రులకు ఫ్రెడరిక్ ఎంగెల్సు 1820 నవంబరు 28వ తేదీనాడు జన్మించాడు. తండ్రి ధనిక ఉత్పత్తి దారుడవటంచేత ఆయన బాల్యమంతా ఛాందస, మూఢ మత విశ్వాస పరిసరాలలో గడిచిపోయింది. బార్మెన్ నగరంలోని భౌతిక, ప్రకృతి శాస్త్ర మాధ్యమిక విద్యాలయంలో విద్యాభ్యాసం పూర్తికాగానే ఆయన ఎల్బర్ ఫెల్డ్ పట్నంలోని పురాణకావ్యబోధనకు ప్రాధాన్యత నిచ్చే ఒక మాధ్యమిక పాఠశాలలో చేరాడు. కాని అంతిమ పరీక్షకొక ఏడాది ముందుగానే చదువు చాలించుకుని ఆయన తన తండ్రి వ్యాపారంలో ప్రవేశించాడు. భౌగోళిక పరిస్థితులవల్లను, బొగ్గు ఖనిజములసంపద వల్లను జర్మన్ దేశమంతటా పారిశ్రామికంగాను, రాజకీయంగాను బాగా అభివృద్ధి చెందిన రైన్ రాష్ట్రమే ఎంగెల్సు జన్మ, నివాస స్థానం కావటం గమనించదగ్గ విశేషం. తత్కారణంగా జర్మనీలో యితర చోట్ల కన్న ముందుగా ఆప్రాంతంలో అప్పటికింకా జర్మనీలో శేషించియున్న భూస్వామ్య శక్తులకు అగర్భశత్రువులైన పెట్టుబడిదారీ పరిశ్రమలు, పెట్టుబడిదారీ వర్గము, వాటిని నీడవలె వెన్నంటియుండు బలీయమైన కార్మికవర్గము ఉద్భవించాయి. ఆ సమయంలో జర్మన్ తత్వ శాస్త్ర రంగంలో మహత్తరమైన విప్లవం రావసాగుతోంది. ఆ విప్లవ ఫలితంగానే హెగెల్ తత్వ శాస్త్రం ప్రాధాన్యత వహించింది. ఆ మహత్తర పరివర్తన కాలంలో మార్క్సు వంటి యితర అభివృద్ధికర మేధావులైన జర్మన్ యువకులందరివలెనే ఎంగెల్సుకూడ హెగెల్ అనుచరుడుగా మారాడు.

బార్మెన్, బ్రెమెన్ పట్నాలలోని వ్యాపార గృహాలలో పనిచేస్తున్న కాలంలో వ్యాపార వృత్తిలో ఆయన విశేష నైపుణ్యం ప్రదర్శించియున్నప్పటికీ వ్యాపార విషయాలలో తనమనస్సు నెన్నడూ ఆయనలగ్నం చేయలేదు. తన సర్వ మానసికశక్తి యుక్తులనూ ప్రయోగించి తత్వ శాస్త్ర పఠనానికే ఆయన తన తీరిక సమయమంతా వినియోగించేవాడు. 18వ ఏట ఆయన తన విద్యార్థి స్నేహితులకు వ్రాసినలేఖలను పరిశీలించి నట్లయితే వాటిలో తన వ్యంగ్య కవితా ప్రయత్నాలు, సాహిత్యవిమర్శలు, మతపూర్వక శంకలు, చిన్ననాటి దైవ భక్తిని తిరిగి అలవర్చుకోవాలనే కోర్కెల ప్రసక్తియే తప్ప ఒక్కపంక్తికూడ వ్యాపార విషయాలకాయన ప్రత్యేకించిన సందర్భం మనంచూడలేము. చివ్వర కాయన తనమతభావ శృంఖలాలను ఛేదించుకుని హెగెల్ తత్వ శాస్త్రాన్ని పూర్తిగా ఆమోదించాడు.

1841 అక్టోబరు నుండి ఒక సంవత్సర కాలం ఎంగెల్సు బెర్లిన్ ఆయుధ రక్షణశాలలోచేరి పనిచేశాడు. ఆ కాలంలోనే బహుశ్రద్ధగా సైనిక శాస్త్రాన్నభ్యసించి గొప్ప సైనిక నిపుణుడుగా తయారయాడు. ఫ్రాన్సు-ప్రష్యా దేశాల మధ్య జరిగిన యుద్ధకాలంలో ఎంగెల్సు "పాల్ మాల్ గజెట్" అనే పత్రికలో వరుసగా వ్యాసాలువ్రాస్తూ వాటిలో యుద్ధగమనాన్ని గురించిన కొన్ని జోస్యాలు చెప్పాడు. ఉదాహరణకు "జనరల్ మార్ మాహాన్ కనుక తన సైన్యంతో శత్రుశ్రేణులను చీల్చుకుని బెల్జియం చేరకపోతే సెడాన్ మైదానంలో శత్రువుకాయన లొంగిపోవలసి వస్తుంది" అని ఎంగెల్సు చెప్పిన జోస్యం రెండువారాలు దాటక ముందే యథార్థంగా జరిగింది! ఆయనకు 'జనరల్' అనే మారుపేరు స్నేహిత బృందంలో అప్పటి నుండే వ్యాప్తిలోనికి వచ్చింది.

ఈ సైనికోద్యోగ కాలంలో 'మ్యూవ్ జార్ బూసర్', 'రెనిష్ జీటుంగ్' అనే పత్రికలకుకూడ 'ఆస్వాల్డ్' అనే మారుపేరులో పనిచేశాడు. ఆ దశలోనే కొన్ని హాస్యరస పూరిత దూషణ గీతాలను, తన కప్పటికింకా అపరిచితుడైన మార్క్సును, తనను వర్ణిస్తూ వ్రాసిన గీతాన్ని ఒక స్విస్సు పత్రికలో ప్రకటించాడు.

## ప్రకరణం 2.

# మాంచెష్టరుకు ప్రథమ ప్రయాణం.

తన సైనికోద్యోగం పూర్తికాగానే ఎంగెల్సు బార్మెన్‌కు తిరిగి వచ్చి, అక్కడనుండి 1842 అక్టోబరులో తనతండ్రి భాగస్థుడైన 'ఎర్మన్ అండ్ ఎంగెల్సు' నూలు కర్మాగారానికి ఏజంటుగా మాంచెస్టరు నగరంవెళ్ళాడు. ఈ ప్రయాణ సమయంలోనే కొలోన్ పట్నంలోదిగి 'రెనిష్ జీటుంగ్' పత్రికా సంపాదక వర్గ కార్య స్థానంలోనున్న కారల్ మార్క్సును ప్రథమ పర్యాయం కలుసుకున్నాడు. మార్క్సు ప్రత్యర్థులైన బోర్ సోదరుల పలుకుబడిలో ఎంగెల్సు అప్పటికింకా వుండుట చేత వారి అప్పటి ప్రథమ కలయిక చాల ఉత్సాహరహితంగా జరిగింది.

తత్వ శాస్త్రానికి తోడు ఎంగెల్సు అప్పటికే అర్థికశాస్త్రంపై అత్యధికాసక్తికలిగి యుండేవాడు. పెట్టుబడిదారీ విధానానికి మాతృభూమి యని చెప్పదగు ఇంగ్లండుకు పారిశ్రామిక ముఖ్యపట్టణ మనదగు మాంచెస్టరు నగర నివాసంవలన ఆయనకు అర్థిక శాస్త్ర పఠనమునకు, అర్థికవిషయ పరిశీలనకు అత్యద్భుతమైన అవకాశం కలిగింది. ఆ సదవకాశా న్నాయన మాంచెస్టరులోవున్న సంవత్సరం, తొమ్మిది నెలల కాలంలో సంపూర్ణంగా వినియోగించుకుని తనయొక్క, మార్క్సు యొక్కభావి సంయుక్త జీవితానికి అత్యధికంగా తోడ్పడే విషయాలనేకం సేకరించుకున్నాడు. యజమానికీ, కార్మికులకూ మధ్యగల సంబంధాలను ప్రత్యక్షంగా పరిశీలించుతూ బాగా అభివృద్ధియైన పెట్టుబడిదారీ విధానంలో కార్మిక వర్గ దుర్భర దారిద్ర్య దుస్థితిని గమనిస్తూయున్న ఎంగెల్సులో త్వరలోనే కార్మిక వర్గ వుద్యమం పట్ల ప్రగాఢమైన అనురాభిమానాలుత్పత్తి చెందాయి. ఆ వెంటనే ఊహాజనిత సామ్యవాదులుచేసే ప్రచారంలోను, లేబరు, చార్టిస్టు ఉద్యమాలలోను ఎంగెల్సు ఉత్సాహంగా పాల్గొన నారంభించి రాబర్టు ఓవెన్ భావాలను ప్రచారంచేసే 'నూతన నైతిక ప్రపంచం' అనే పత్రికలోను,

చార్టిస్టుల పత్రికయైన 'ఉత్తర తార' తోను సంబంధం పెట్టుకున్నాడు.

తన తార్కిక ప్రతిభాశక్తి, సునిశిత మేధాశక్తుల సహాయంతో ఆయన పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాలను, కార్మికుల తాత్కాలిక పాత్రను, కార్మిక వర్గానికి భావిలో గల మహత్తర చారిత్రక ప్రాధాన్యతను గురించి 'దూష్ ఫ్రాంజో సిష్ జార్ బూషర్' పత్రికలో జాతీయార్థిక విధానంపై పట్టాలు తప్పిన రైలువలె విపరీత వేగంతో కొనసాగింపబడే పెట్టుబడిదారీ ఉత్పత్తి గతి, అమానుష ప్రమాణాలను తాకే పెట్టుబడిదారీ పోటీలను గురించి మార్క్సు అభిమాన, మన్ననలను చూరగొన్న ఒక విమర్శక వ్యాసాన్ని ఎంగెల్సు వ్రాశాడు. దీనిలోను, జనసంఖ్య విషయమై మాల్థూస్ రచనలపై ఆయన వ్రాసిన విమర్శలలోను, వ్యాపార సంక్షోభాలు, జీతప్రమాణాలను నిర్ణయించే సూత్రాలు, శాస్త్రీయాభివృద్ధి మొదలైన విషయాలపై ఆయన వెలువరించిన ఉద్దేశాలలోను అప్పటి కప్పుడే శాస్త్రీయ కమ్యూనిస్టు సిద్ధాంత బీజాలు గోచరించాయి.

ఆ చిన్న వ్యాసాన్ని పరిశీలించి నట్లయితే హెగెల్ తత్వశాస్త్రమంతటిలోను ఉత్తమమైన, అతి విప్లవాత్మకమైన భాగాన్ని ఎంగెల్సు గ్రహించుకుని చారిత్రక, ఆర్థికాభివృద్ధి సూత్ర రహస్యాలను పరిష్కరించే మహత్తర సాధనంగా ఉపయోగించు కోగలిగిన విషయం బోధపడుతుంది. ఆ పత్రికలోనే కార్లయిల్ రచించిన 'గతం: ప్రస్తుతం' అనే గ్రంథమొక్కటే 1843 సంవత్సరంలో వెలువడిన ఇంగ్లీషు గ్రంథాలన్నింటిలోను చదువదగినదని ఆయన పేర్కొంటూ వ్రాసిన చక్కని విమర్శ కూడ ప్రచురింపబడింది.

తన యిరువది రెండవ యేటనే, కార్మికుల కుండే కష్టాలు తాను స్వయంగా అనుభవించక పోయినప్పటికీ, జననం, విద్యాభ్యాసం వృత్తుల చేత పెట్టుబడిదారీ వర్గానికే తాను చెందినప్పటికీ, ఆయన ఇంగ్లండులోని వర్గాలపైన, పార్టీలపైన వెలువరించిన అభిప్రాయాలను పరిశీలించి నట్లయితే చాల ఆశ్చర్యం కలుగుతుంది.

ఇంగ్లీషు ధనిక పెట్టుబడిదారీ వర్గంలోని ఆధ్యాత్మిక శూన్యత్వాన్ని, దివాళా కోరుతనాన్ని పటుతరమైన భాషలో శక్తివంతంగా వర్ణించిన

తర్వాత, "విద్యా వంతుడైన ఇంగ్లీషువాడు ప్రపంచమంతటిలోను బహు నికృష్ట ప్రాణిని" అని యూరప్ ఖండ మంతటా వ్యాపించియున్న ప్రచనాన్ని ఉపహరించి, "యూరప్ ఖండ వాసులింతవరకూ గుర్తించని ఆంగ్ల జాతిలో ఒక భాగమై అంటరాని వారుగా పరిగణింపబడే దీనులు, దీనలు అయిన కార్మికులు మాత్రమే వారెంత నాటుమోటువారైనప్పటికీ నిరుత్సాహులు, నిర్వీర్యులైనప్పటికీ యదార్థానికి గౌరవింపదగ్గవారు వారే ఇంగ్లండును రక్షిస్తారు. వారికి చదువు రాకపోవచ్చును; కాని వారిలో చదువుకున్నవారిలో గల మరకభిప్రాయాలు కూడ లేకవటం వాస్తవ విషయం. అద్భుతమైన జాతీయకృషి కొనసాగించే శక్తితో బాటువారికి దివ్యమైన భావికూడ వుంది" అని ఆయనవ్రాశాడు. ఇంగ్లండులోవున్న టోరీ, విగ్గు విద్యావంతుల పార్టీలలో తమకధికార ప్రదానంచేసిన పారిశ్రామిక ప్రాభవాభివృద్ధులు పరమ పవిత్రమైన వనీ, వాటివృద్ధిని నిర్ణయించుకోటే ప్రభుత్వ శాసనాల ఆశయమై యుండాలనీ వాదించే విగ్గు పార్టీకన్న గ్రుడ్డికన్ను మెల్లకన్నైన రీతిగా టోరీ పార్టీ నయమని ఎంజెల్సు పరిగణించాడు.

## ప్రకరణం 3.

# మార్క్సుతో కలయిక, గాఢస్నేహ ప్రారంభం.

ఫ్రెంచి విప్లవాన్ని పరీక్షించి, తత్వ శాస్త్ర పఠనం సాగించిన మార్క్సు. ఆంగ్ల పారిశ్రామిక పరిస్థితులను సూక్ష్మంగా పరిశీలించిన ఎంజెల్సు లిద్దరూ పెట్టుబడిదారీ సమాజం విషయంలో ఒకేవిధమైన అభిప్రాయాలకు, నిర్ణయాలకు రావటం గమనించ దగ్గ విశేషం. వారిద్దరి రచనల్లోనూ భౌతికవాద, చారిత్రిక పరిశీలన అప్పటికే గోచరించ నారంభించింది. కానైతే ఆనాటికి భౌతిక దృష్టి మార్క్సులో ఎంజెల్సులో కన్న విశేషంగాను, విశదంగాను వున్నదని చెప్పవచ్చు.

"డ్యూచ్ ఫ్రాంకోసిష్ జార్ బూషర్" పత్రికలో వారి రచనల

ప్రకటన ఫలితంగా, వారిద్దరి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరిగాయి. సెప్టెంబరు 1844 లో ఎంగెల్సు జర్మనీకి తిరిగి వెళ్తూ దారిలో పారిస్‌లో దిగి మార్క్సుతో కొన్ని రోజులు గడిపాడు. అప్పటికి తత్వ శాస్త్ర, ఆర్థిక విషయాలలో వారిద్దరి భావాలు యెంతగా ఏకీభవించాయంటే వెంటనే వారిద్దరూ సంయుక్తంగా "పవిత్ర కుటుంబం లేక బ్రూనో బోయరు, అతని అనుచరుల సవిమర్శక విమర్శపై సునిశిత విమర్శ" అనే గ్రంథ రచనకు పూనుకున్నారు.

ఆ గ్రంథం 1845 లో ప్రచురింప బడింది. అందులో ఊహాజనిత తత్వ శాస్త్రంపై ప్రజా సామాన్యానికి గల దుర్భ్రమలు తొలగించుటే తమ ఆశయమని గ్రంథకర్తలు స్పష్టపరిచారు. ఆ పుస్తకంలో ఆర్థిక విషయాలపై అతి స్వల్పంగానే వ్రాసినప్పటికీ అప్పటి కప్పుడే మార్క్సు, ఎంగెల్సులు కార్మిక వర్గ దృక్పథం అవలంబించారనే విషయం బోధ పడుతుంది.

ఎంగెల్సు కొద్ది పేజీలు మాత్రమే వ్రాశాడు. కాని వాటినే మార్క్సు విపులీకరించి, ఎంగెల్సుకే ఆశ్చర్యం కలుగు నంతటి పెద్ద గ్రంథంగా తయారు చేశాడు. ఆ విషయమై అంత పెద్ద పుస్తకం వ్రాయటం అనవసరమేమో అని ఎంగెల్సు భావించినా మార్క్సు వ్రాసిన విధానానికీ, వ్రాయటంలో వెలుగరబడి ముందుగా పెట్టకుండా వెంటనే ప్రకటన కిచ్చినందుకూ మటుకు మహదానంద భరితుడయాడు.

స్వభావం చేత తాను ఓపిక, శ్రద్ధ కలిగిన రచయిత అయినప్పటికీ మార్క్సును మాత్రం ప్రకటన ఆలస్యమవుతుందనే ఉద్దేశ తో గ్రంథ రచన విషయంలో మెరుగులు దిద్దకుండా ఎంగెల్సు తొందర చేస్తుండేవాడు. విప్లవ శీఘ్ర ఆగమనం పట్లగల ప్రగాఢ విశ్వాసమే ఆయన శీఘ్ర ప్రచురణా కాంక్షకు మూలమనే విషయం జనవరి 1845 లో ఆయన మార్క్సుకు వ్రాసిన యీ క్రింది లేఖాభాగం చూస్తే బోధపడుతుంది: "జాతీయార్థిక విధానంపై నువ్వు వ్రాస్తున్న పుస్తకం త్వరగా పూర్తిచెయ్యి. నీ రచన విషయంలో నీకు సంపూర్ణంగా తృప్తి కలుగక పోయినా ఏమంత యిబ్బంది లేదు. కాలం పక్వమైంది. అలస్యా దమృతం విషం! ఏప్రిల్ నాటికి సిద్ధం చేసేందుకు ప్రయత్నించు. నా పద్ధతి నవలంబించు; ఏదో ఒక తేది

నిర్ణయించుకుని ఆ తేదీనాటికి భూమి తల్లక్రిందులైనా సరే పూర్తిచేసి తీరాలని నిశ్చయించుకొని ప్రకటన విషయంలో కూడ వెంటనే యేర్పాట్లు చేసుకో.........అది వెంటనే వెల్వడి తీరాలి."

పారిస్‌లో వారి కలయికతోను, 'పవిత్ర కుటుంబ' సంయుక్త రచనతోను ఆ మహనీయులిద్దరి మధ్య చరిత్రలో ఎన్నడూ కని విని యెరుగనటువంటి, జీవితాంత పర్యంతము నిలబడినట్టి ప్రగాఢ స్నేహం ప్రారంభమైంది. వీరిరువురి అద్భుత గాఢస్నేహాన్ని గురించి ముమ్ముందు చెప్పుకుందాం.

## ప్రకరణం 4.

# 1844 లో ఆంగ్ల కార్మిక వర్గ పరిస్థితి.

పారిస్ నుండి ఎంగెల్సు బార్మెన్ తిరిగి వెళ్లగానే ప్రారంభించి ఇంగ్లండులో తను సాగించిన ఆర్థిక పరిశోధనల ఫలితాలను వర్ణిస్తూ "1844 లో ఆంగ్ల కార్మిక వర్గ పరిస్థితి" అను గ్రంథాన్ని రచించి 1845 వేసవిలో ప్రప్రథమంగా జర్మన్ భాషలో ప్రకటించాడు.

ఆంగ్ల కార్మిక వర్గ పరిస్థితిని సక్రమంగా చిత్రించటమే కాదాయన గ్రంథ ప్రాశస్త్యానికి మూలం. అప్పటికే యితరులు కొందరా విషయంపై రచనలు చేసి యున్నారు. పెట్టుబడిదారీ సమాజంలో నిబిడీకృతమై యున్న వైరుధ్యాలను, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధాననిజ తత్వాన్ని గ్రహించ గలిగిన యిరవది నాలుగేండ్ల యువకుడైన ఎంగెల్సు అత్యద్భుత మేధ శక్తియే ఆశ్చర్యాన్ని గొల్పుతుంది.

పెట్టుబడిదారీ పారిశ్రామిక విధానమే విధంగా ఆధునిక కార్మిక వర్గాన్ని సృజించినదీ, కార్మికులనే విధంగా నిత్యనికృష్ట దుర్భర దుస్థితిలో వుంచుతూన్నదీ, యేవిధంగా నిర్భాగ్యులను గావించుతూన్నదీ, యే విధంగా వారిలో మానవత్వాన్ని రూపు మాపుతూన్నదీ, వారిని బానిసలు గాను అంతకన్న కనాకష్టంగాను ప్రాణ రక్షణార్థం పొట్టకూటికై తమ శరీర, శక్తి యుక్తులనే కాక, మనస్సును, ఆత్మను కూడ ఉత్పత్తిశక్తుల స్వంతదారులైన

పెట్టుబడిదారులకు అమ్ముకుంటేగాని గతిలేనివారిగా తయారుచేస్తున్నదీ చూపటమే ఆ గ్రంథ ప్రధానోద్దేశం.

అట్టి కార్మికవర్గ దుర్భరస్థితిలోనే భవిష్యదాశాజ్యోతిని కూడా ఆయన చూడగలగటం గొప్పవిశేషం. ప్రత్యేకవ్యక్తుల యాజమాన్యాన నడపబడు బ్రహ్మాండమైన కర్మాగారాలలో వందలాది, వేలాదిగా కార్మికులు కేంద్రీకరింపబడి తమవర్గసంఖ్యా బలాన్నే విధంగా గుర్తించేదీ, యంత్రాలలోను, పట్నవాస జీవితంలోను ప్రకృతిశక్తులపై మానవుడు సాధించిన పెత్తనాన్ని చూసిన కార్మికులలో యేవిధంగా ఆత్మధైర్యం వృద్ధిచెందేదీ, తమ దుర్భరదారిద్ర్యస్థితి కారణంగానే కార్మికులంతా తమశత్రువర్గమైన పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా పీడననుండి విముక్తులగుటకు యేకమైతిరేదీ, అట్టి కార్మికుల భయంకర పరిస్థితులలోనుండే భవిష్యదాశా జ్యోతియైన సోషలిస్టు కార్మికోద్యమం యేవిధంగా తలచూపుతున్నదీ, అదియేవిధంగా చివరకు ఒకవ్యక్తిని మరొకవ్యక్తి, ఒకజాతిని వేరొకజాతి పీడించేవిధానాలతో సహా సమస్త దానిసత్వ రూపాలనూ సమూలంగా నాశనంచేసేదీ ఎంగెల్సు వివరించాడు. శాస్త్రీయ సోషలిజానికి పునాదులు వేసిన గ్రంథాలలో యిదే మొదటిది. ఈ గ్రంథ రచనతోనే ఎంగెల్సు తనయావజ్జీవితకాల సోషలిస్టు కార్మికోద్యమ పోరాటాన్ని ప్రారంభించాడు.

హెగెల్ తత్వశాస్త్రంలోని భావవాద భాగమునుండి, జర్మన్ తత్వశాస్త్రంలోని అనవసరమైన చిక్కులనుండి విడివడి హెగెల్ తత్వశాస్త్రంలోని ఉపయోగకరమైన ఉత్తమ భావాలను యెంతచక్కగా జీర్ణించుకుని, విశేషనైపుణ్యంతో ఎంగెల్సు వాడుతున్నదీ యీ గ్రంథపఠనవల్ల మనకు తెలుస్తుంది.

ఎంగెల్సు పెట్టుబడిదారీ పారిశ్రామిక విధానాన్నీ, దాని నుండివచ్చే ఆర్థిక, సాంఘిక ఫలితాలను అద్భుతంగా విశదీకరించటమే కాక ఆకాలపుఇంగ్లండు కార్మికోద్యమ వివిధరూపాలనుకూడ విస్పష్టంగా వర్ణించాడు. కార్మికోద్యమ ప్రాధాన్యత, ఆవశ్యకతలనే కాక, అది ఆర్థిక సమస్యలతో మాత్రమే సంతృప్తిచెంది యుండేటంతవరకూ దాని అసమగ్రతను కూడ ఎంగెల్సు గుర్తించాడు.

అందుచేతనే ఆయన చార్టిస్టు ఉద్యమాన్ని పెట్టుబడిదారీ వర్గానికి వ్యతిరేకంగా కార్మికులు సంఘటితులై, రాజకీయాధికారాన్ని గుంజుకునేందుకు చేసే రాజకీయపోరాట మేనని గుర్తించి మెచ్చుకున్నాడు.

కాని చార్టిస్టులకు సోషలిస్టు సిద్ధాంతాశయాల పునాది లేకపోవటంచేత, కార్మికులకు హెచ్చువేతనాలు, తక్కువపని కాలపుగంటలు మొదలైన సమస్యలపై పెట్టుబడిదారీ సమాజవిధానం (చట్రం) లోనే కార్మికుల పరిస్థితులను కొంతవరకు బాగుపరచేందుకు జరిగే కార్మిక వర్గసాంఘిక పోరాటాలలో మాత్రమే పాల్గొంటూండేవారు. సిద్ధాంత విషయాలలో చార్టిస్టులు వెనుకబడి యున్నప్పటికీ కార్మికులవలెనే వారుకూడా తీవ్ర కార్యాచరణలో మాత్రం వెనుకంజ వేసేవారు కారు.

మరిఆ కాలపు సోషలిష్టులెల్లకాక సిద్ధాంతవిషయాలలో ఉద్దండులుగా వున్నప్పటికీ పెట్టుబడిదారీ వర్గమునకు హెచ్చుగా చెందియుండటంచేత చాలమంది పిరికివారుగా వుంటూలొంగిపోతుండేవారు. ధనికవర్గంలో గల నిర్వీర్యాన్ని, వ్యక్తిగత ప్రయోజనాల వలనజనించే మోసపుకుట్రల అధిక్యాన్ని, కార్మికవర్గంలోగల భవిష్యదభివృద్ధి సూచనలను వారుగుర్తించలేక, కార్మికవర్గంలో గల నిరుత్సాహాన్ని, లోపాలనూ మాత్రం చూసి వాపోతూ, దీనులు కారుతుండేవారు.

సోషలిష్టులు చారిత్రికాభివృద్ధిని గుర్తించక పెట్టుబడిదారీ వర్గంపట్ల కార్మికులు ప్రదర్శించే ద్వేషభావాలను ఖండిస్తూ, అసాధ్యమైన వర్గసామరస్య, మానవ కారుణ్యనైతిక సూత్రాలను వల్లిస్తూ సోషలిజానికి క్రొత్తభాష్యాలు చెప్పటానికి వృధాగా తంటాలుపడేవారు.

కనుక సోషలిష్టులు కార్మికోద్యమానికి సేవ చేయాలంటే చార్టిస్టుల విప్లవకర కార్యాచరణ నవలంబించాలనీ, చార్టిస్టులు తప్పటడుగులు వేయకుండా వుండాలంటే సోషలిస్టుల సిద్ధాంతాశయాలను గ్రహించాలనీ; అంటే సోషలిజం కార్మికోద్యమ రూపాన్ని ధరించాలనీ, పెట్టుబడిదారీ బానిసత్వంనుండి కార్మికవర్గం విముక్తిపొందాలంటే కార్మికోద్యమం సోషలిస్టు సిద్ధాంతా న్ననుసరించాలనీ ఎంగెల్సు వాదించాడు.

ఈవిషయం ఆయనచెప్పి యిప్పటికి చాలకాలం గతించి పోయినప్ప

టికీ, చార్టిస్టుల రాజకీయాశయా లన్నింటినీ కార్మికులు సాధించుకోగాక, ఆధికారవర్గంనుండి అనేక యితర ఆర్థిక హక్కులనుగూడ పొందగలిగి నప్పటికీ కార్మికోద్యమం సోషలిస్టు సిద్ధాంతాశయాలను స్వీకరించి చైతన్యంతో పెట్టుబడిదారీ వర్గాన్ని కూలద్రోసి సోషలిస్టు సమాజవిధాన్ని నిర్మించేందుకు పూనుకోనంతవరకు అది తన అంతిమమైన కార్మికవర్గ బానిసత్వ బాధావిముక్తిని సాధించలేదనటం మాత్రం యీనాటికికూడ వర్తిస్తుంది.

అంతేకాక పెట్టుబడిదారుల హృదయ పరివర్తనం సాధ్యమని భ్రమచెందే సోషలిస్టు బెంగళయ్యలు 'యెక్కడవేసిన గొంగళీ యెన్నాళ్ళు చూచినా అక్కడే వుండేటట్లుగా' యేమాత్రం ముందుకుపోరనీ, కార్మికవర్గంపైననే ఆధారపడిన సోషలిస్టు పార్టీలకూడ తమనైతిక, మేధస్సంపన్న నాధిక్యతలను తలపోసుకుంటూ కార్మికులకు అంటీ ముట్టకుండావుంటూ సిద్ధాంతబోధలు చేస్తూ కార్మికోద్యమం'లో' 'భాగంగా' వుండి పనిచేయకపోయినట్లయితే వారిత్యాగాలు, కార్యక్రమాలు బూడిదలోపోసిన పన్నీరు మాదిరిగా వృధాయాతాయనీ కూడ ఎంజెల్సు వక్కాణించాడు.

తనగ్రంధాన్ని ముగిస్తూ ఇంగ్లండులో ఎంజెల్సు విప్లవం వచ్చేఅవకాశం త్వరలోనే కలగవచ్చునని సూచించాడు. ఆసూచన ఎంజెల్సు చెప్పిన విధంగా ఫలించక పోవటాన్ని ఆదనుగా తీసుకొని చాలమంది ఆయనగ్రంధస్థ విషయాలను విమర్శించ నారంభించారు. కానీ ఎంజెల్సే చనిపోయే ముందు తనకొన్ని సూచనలు ఫలించనందుకు కాక, అనేక సూచనలు ఫలించినందుకు చాల ఆశ్చర్యపడ్డాడు' ఈదృష్టిలో కనుక చూస్తే పైవిమర్శలవల్ల యీగ్రంధ ప్రాశస్త్యమేమాత్రమూ తరగదని తేల్తుంది.

మార్క్సు, ఎంజెల్సులు ముఖ్యంగా తమ యౌవనకాలంలో విప్లవ కార్మికోద్యమ స్థాయిని కొంత హెచ్చుగా అంచనా వేస్తుండేవారు. కాని ఆవిధంగా అధికంగా అంచనా వేసినది విప్లవోద్యమ 'స్థాయి' నేగాని 'క్రమాన్ని' మాత్రం కాదని మనంజ్ఞాపకముంచుకోవాలి.

ఒక్కొక్క మారు వారాశించినంత శీఘ్రముంగా పరిస్థితులు మారకపోయినప్పటికీ, వారు నిర్వచించిన భూతభవిష్యద్వర్తమాన కాలాలలో సాంఘికాభివృద్ధి క్రమసూచనలో మాత్రం చిన్న పొరపాటుకూడ దొర్లక

పోవటం అద్భుతమైన విషయం.

"మనం విస్పష్టంగా ఊహించుకోగలిగిన భవిష్యద్విషయాలు క్రమతర, సులభతర సాధ్యాలుగా కన్పించటం మానవసహజం" అనిలాంగే చెప్పిన మాత్రమెంతైనా సమంజసమైనది. అంటిమాళయ, పోరాట క్రమాలను మార్క్స్, ఎంగెల్సులు అతి విస్పష్టంగా దర్శించటంవల్లనే పోరాట మార్గం వారికి హ్రస్వంగా తోచింది.

1892 లో వెలువడిన ముద్రణకు ఎంగెల్సువ్రాసిన భూమికే ఆగ్రంథంపైగల ఈ విమర్శ యని చెప్పవచ్చు:

"ఈగ్రంథంలో నేను ప్రతిపాదించిన తాత్విక, ఆర్థిక, రాజకీయసూత్రాలతో నాయీనాటిభావాలు పూర్తిగా ఏకీభవిస్తాయని చెప్పటానికి వీల్లేదు. ప్రధానంగాను, ప్రత్యేకంగాను మార్క్స్ మహత్తరకృషిచేత సమగ్రశాస్త్రంగా పరిణతిచెందిన ఆధునిక అంతర్జాతీయ సోషలిజం 1844 నాటికిలేదు. నాపుస్తకం జర్మన్ తత్వశాస్త్రము నుండి అభివృద్ధిచెందిన ఆధునిక సోషలిజానికి పిండాకారరూపం మాత్రమే. కమ్యూనిజం కార్మికవర్గపార్టీ సిద్ధాంతం మాత్రమే కాదనీ, ప్రస్తుత సంకుచిత క్లిష్టపరిస్థితి నుండి పెట్టుబడిదారీ వర్గంతోసహా సమాజాన్నంతటినీ విముక్తి చేసేందుకుపయోగించే సిద్ధాంతమనే సూత్రానికి నేనందులో అనవసర ప్రాముఖ్యత చాలయిచ్చాను. ఇదిసిద్ధాంతరీత్యా సరియైనదే కావచ్చు; కాని ఆచరణలో ప్రయోజనశూన్యము, ఒక్కొక్కమారు ప్రమాదభరితంగా కూడ పరిణమించింది. ధనికవర్గం విముక్తి పోరాటావశ్యకతను గుర్తించి అందులో పాల్గొనపోవడమే కాక, విముక్తికై పోరాడే కార్మిక వర్గానికికూడ తీవ్ర అటంకాలను కలుగచేస్తారు అందుచేత కార్మికవర్గం ఒంటరిగానే సాంఘిక విప్లవ పోరాటంలో పాల్గొని విజయం సాధించ ప్రయత్నించాలి."

ఆయన చెప్పినదైవిషయం నిజమని అనాటినుండి మనకుకలిగిన అనుభవం నిరూపించటంలేదు? ఏదేశపెట్టుబడిదారీ వర్గమూ స్వయంగా తనవర్గాధికారాన్ని, విశేషవర్గప్రయోజనాలను చేజేతులార విసర్జించుకున్నట్లు వినలేదుకదా? అఖరుకు రాజీలకు పేరుపడిన ఇంగ్లండులోకూడ పెట్టుబడిదారీ వర్గమంతా ప్రస్తుత సమాజవ్యవస్థలోని లోటుపాట్లను గుర్తించి, తమపెత్త

దాన్ని చేతులారా విసర్జించి, వ్యక్తుల లాభముకొరకై కోట్లాది కార్మికులను పీడించే పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానమును రూపుమాపి నూతన సోషలిస్టు సమాజ నిర్మాణానికై కార్మికులు సాగించే పోరాటానికి సాయపడ్తారని కలలోనైనా తలచడానికవకాశముందా?

అన్ని ప్రజాజీవిత సమగ్ర చిత్రంలో 'ఆంగ్ల కార్మిక వర్గ పరిస్థితి' ప్రథమ భాగం మాత్రమే. అప్పటికే మోజెస్ హెస్సు సహాయంతో ఒక సోషలిస్టు మాసపత్రికను వెలువరించాలని, విదేశీ సోషలిస్టు సాహిత్య విజ్ఞానసర్వస్వము, లిస్టుపై విమర్శ మొదలైన గ్రంథాలు ప్రకటించాలని ఎంగెల్సు ఉద్దేశపడ్డాడు. చివరి గ్రంథం వ్రాయటానికే ఉద్దేశించి, మార్క్సును కూడా పురమాయించేటట్లు అది ఆయనను కదిలించాడు. కాని తరువాతి రోజుల్లో ఆరోగ్యభారం వల్లనైతే కార్యక్రమం పూర్తిగా కొనసాగలేదు.

ప్రకరణం 5

# గృహజీవనం: కమ్యూనిస్టుగా ప్రథమ కార్యకలాపాలు.

బార్మెన్‌కు పారిస్ నుండి తిరిగి వచ్చాక 1844 సెప్టెంబరు మాసాంత్య ప్రాంతంలో ఎంగెల్సు మార్క్సుకు వ్రాసిన మొదటి జాబంతా పట్టపగ్గాలులేని నవోత్సాహంతోను, తమ యిద్దరి కృషిపట్ల తీరని కాంక్షతోను నిండియున్నది.

ఆ జాబులో కొలోన్‌లో నాటి కమ్యూనిస్టు ప్రచార ఫలితాన్ని యిలా వర్ణించాడు: "మనవాళ్ళంతా మంచి హుషారుగా పనిచేస్తున్నారు. కాని వారికి సిద్ధాంత పునాది లేని లోటుమాత్రం బాగా వ్యక్తమవుతోంది. ప్రస్తుతం లభ్యపడే తాత్విక, చారిత్రికాధారాలను పైకొని తాత్విక హేతువాదాల ననుసరించి మన సిద్ధాంతాలను కొన్ని గ్రంథాలలో పొందుపరచి అవి ప్రస్తుత చరిత్రకూ, తత్వశాస్త్రానికి ఆవశ్య పరిణామాలేనని నిరూపించనంత కాలము మన ప్రయత్నాలన్నీ చీకటిలో తడుముకొంటూనే వుంటుం

ది...............అందరికన్న మానవతత్వం పూర్తిగా రక్తమాంసాలలో జీర్ణించుకున్న నా ఎల్బర్ఫెల్డుయువకస్నేహితులను చూస్తే చాలసంతోషం కలుగుతోంది వాళ్లంతా నమకుటుంబాల ఆర్థిక పద్ధతులలో విప్లవకరమార్పులు నములు పరుచనారంభించారు. పెద్దవాళ్ళు కూలీలపైగాని, సేవకులపైగాని నిరంకుశంగా ప్రవర్తించినప్పుడల్లా యీపిసింగ్రీల కంటె కుర్రవాళ్ళు వాళ్లకి మంచిపాఠాలు చెప్పుతున్నారు. పితృస్వామిక పద్ధతులింకా మారని ఎల్బర్ఫెల్డులో యిదిజరుగుతోందని గుర్తించుకుంటే దానిప్రాధాన్యతయెంతో నీకే తెలుస్తుంది'

బార్మన్ పట్నంలోని, బార్మన్ జిల్లాలోని పెట్టుబడిదారీ సమాజాన్ని వర్ణించి, కార్మికుల అసంతృప్తి యేవిధంగా నానాటికీ పెరుగుతూ వ్యక్తిగత హింసా పూరిత కార్యాలుగా వ్యక్తమగుతున్నదీ తెల్పుతూ యీవిధంగా వ్రాశాడు. "జర్మన్ కార్మిక వర్గాభివృద్ధికూడా ఆంగ్ల కార్మికవర్గాభివృద్ధి మార్గాన్ననుసరించియే జరిగినట్లయితే వారుత్వరలోనే వ్యక్తిగత హింసాపూరిత కార్యాలవల్ల ఫలితముండదని సమిష్టిగా మానవులవలె కమ్యూనిస్టు పద్ధతిలో యెదిరించటం నేర్చుకుంటారు. కాని ముందుగామనం వారికి మార్గాన్ని చూపవలసివుంటుంది. అయితే ఆపనిప్రస్తుతం సాధ్యం కాదు." బహిరంగంగా పనిచేసే కమ్యూనిస్టు లందరికీ అరెస్టులు తప్పకపోవడమే దీనికి కారణం) ఆయనజాబు నీవిధంగా ముగించాడు; "సమయం మించిపోతున్న సంగతి గుర్తించుకుని నువ్వు ప్రోగుచేసిన సామాగ్రినంతా పుస్తకరూపంలో పొందుపరచి ప్రపంచానికి త్వరగా అందచెయ్యి. మరి నేను కూడ గ్రంథరచన ప్రారంభిస్తాను...............త్వర త్వరగా రచనలు పూర్తిచేసి ప్రకటనకివ్వాలి. సెలవు ప్రియమిత్రమా, తిరుగు టపాలో జవాబియ్యి. నీతో గడిపిన పదిరోజులూ యెంతహాయిగా గడిచిపోయాయి"

ఈలేఖ యువకుడైన ఎంగెల్సు చిత్రాన్ని మనముందుంచటమే కాక అప్పటికే మార్క్సుకూ ఆయనకూ మధ్య ఎంత ధృఢతర స్నేహసంబంధాలేర్పడ్డాయో కూడ తెలియచేస్తుంది. ఇందులో అప్పటికప్పుడే మార్క్సు ఎంగెల్సులు 'నువ్వు నువ్వు'అని పిల్చుకునే టంతటిసాన్నిహిత్య సంబంధాలు ప్రదర్శింప బడ్డాయి. మార్క్సు, ఎంగెల్సుల మధ్య జరిగిన ఉత్తరప్రత్యుత్త

రాలలో తమ తమ ఆర్థిక, తాత్విక సిద్ధాంతాలను, ఆయాసమయాల్లో తాముపఠిస్తూన్న రచిస్తూన్న గ్రంథాలను యూరప్‌లో 1857 లో కలిగిన ఆర్థికసంక్షోభాలు, క్రిమియా యుద్ధము, ఆస్ట్రియాకు వ్యతిరేకంగా ఫ్రాంసుచేసినయుద్ధము, ఉత్తర, దక్షిణ అమెరికాల మధ్య జరిగిన యుద్ధము మొదలైన ఆ కాలపు సమస్తముఖ్య ఘటనలనూ వారుచర్చించారు.

ఖండ ఖండాంతరాలలోని కార్మికోద్యమాలను గురించి యూరప్‌అమెరికా ఖండాలలోని వాటి నాయకులనుగురించి కూడ వారుతమ ఉత్తర ప్రత్యుత్తరాల్లో చర్చించారు. సిద్ధాంతా చరణరూపాల్లో శాస్త్రాభివృద్ధిని వారు నిరంతరమూ అవగాహన చేసుకొనేవారు. ఎంగెల్సు తనజాబులకొన్నింటిలో విద్యుద్రంగం లోను భౌతిక శాస్త్రపథంలోను షార్లిమర్ వంటి ప్రముఖ రసాయన శాస్త్రవేత్త అభినందనలను పొందిన తనపరిశోధనా ఫలితాలనుకూడ పేర్కొన్నాడు.

ఈఉత్తర ప్రత్యుత్తరాలను గురించి పూర్తిగావ్రాస్తే అదిప్రత్యేకంగా వేరొక పుస్తకమవుతుంది. అందుచేత ఎంగెల్సుజీవిత విశేషాలకు సంబంధించిన భాగాలను మాత్రమే యిక్కడ వుదహరించుతాను.

ఎంగెల్సు తనతండ్రి వ్యాపారంలో ప్రవేశించి పని చెయ్యాలని అతని కుటుంబం వారంతా ఒత్తిడిచేసినారు. కాని ఎంగెల్సుమాత్రం తనఆశయాలకు పరమ విరుద్ధమైన వ్యాపారంలో ప్రవేశించటానికి సుతరామూ ఒప్పుకోలేదు. ఈవిషయం 1845 మార్చిలో ఆయన మార్క్సుకు వ్రాసిన యీక్రిందిజాబును పరిశీలిస్తే తెలుస్తుంది' "నేను బహిరంగంగా కమ్యూనిస్టుసమావేశాల్లో పాల్గొని ఉపన్యసించటంవల్ల, నేను కలిసి తిరిగే స్థానిక కమ్యూనిస్టుల అశుభ్రతవల్ల, నిర్మొహమాటంగా వ్యాపారంలో నేనుచేరనని చెప్పటంవల్ల మాతండ్రి చాదస్తం, కోపం పెచ్చుపెరిగిపోయి తీవ్రరూపం ధరించాయి. ఇందువల్ల నాగృహజీవనం సంకటంగా పరిణమించింది.

నా పరిస్థితి యీవిధంగావుంది. పది పదిహేను రోజుల్లో యిక్కడ నుండి ఎట్లాగా వెళ్లిపోతున్నాను కనుక లేనిపోని గందరగోళంచెయ్యటం నాకిష్టంలేదు. అందుచేత వాళ్ళెన్ని మాటలన్నా నన్ను కావన్నట్లు బెల్లం కొట్టిన రాయివలె వూరుకుంటున్నాను. ఈకొత్తపద్ధతికి వారలవాటు పడ

కపోవటం చేత వాళ్లకోపం మరింత ప్రకోపించి తారామండలాని కంటు తోంది..............మా యమ్మ ప్రేమమయురాలు. ఆమెమూర్తి మహనీయమైనది. కాని గట్టిగా మానాన్న నెదిరించి ఆమె నిలబడలేదు. ఆవిడ ఆరోగ్యం కూడ అంతంత మాత్రమే. నన్ను గురించి విచారం కలిగినప్పుడల్లా రోజుల తరబడి ఆమె తలనొప్పితో బాధ పడుతూంటుంది. ఇదంతా భరించ శక్యంగాకుండావుంది. మాయమ్మకోసం కాకపోతే. మానాన్న మూరత్వాన్నీ, నిరంకుశత్వాన్నీ ఒక్కనిముషం కూడ సహించేవాడిని కాను. ఏ వెలాగున్నా యీనరకకూపంలోనుండి త్వరగాబయటపడాలి. ఇక్కడ యీఒకటి రెండువారాలు తరలించట మెట్లాగా అనేదే పెద్ద సమస్యగా వుంది. అయితే కాలచక్రం కదలకుండా ఆగిపోదుకదా!''

1845 లో ఎంగెల్సు తనవ్యాపారజీవితానికి స్వస్తిచెప్పి బార్మెన్ వదలి మార్క్సు నివసిస్తున్న బ్రస్సెల్సు చేరుకున్నాడు. జన్మస్థలంలో తన కమ్యూనిస్టు కార్యకలాపాలకు బంధువులు, స్నేహితులు ఆటంకాలు కలుగ చేయటం కూడ ఒక కారణమైనప్పటికీ ఎంగెల్సు ముఖ్యంగా తనయొక్క, మార్క్సుయొక్క యిరువురి తాత్విక, ఆర్థిక సిద్ధాంతాలను సంయుక్తంగా అభివృద్ధిపరచాలనే వుద్దేశంతోనే బ్రస్సెల్సు వచ్చాడు. అక్కడవారిద్వారా శాస్త్రీయ సోషలిస్టు సిద్ధాంతాన్ని రూపొందించటమేగాక, ఆనాటి కార్మికోద్యమాన్ని తమసిద్ధాంత పునాదియైన వర్గ చైతన్యమార్గంలో నడుపుటకు కూడ ప్రయత్నించారు.

వారు ప్రప్రథమంగా తమ కాలంనాటి జర్మన్ తత్వశాస్త్రంతో పూర్తిగా విభేదించుతూ హెగెల్ తత్వశాస్త్రంపై తమవిమర్శను రచించారు. రెండుభాగాలుగా రచింపబడిన యీగ్రంధం మార్క్సురచనలపై యిటీవలి వరకు జర్మనీలో అమలులోనున్న సారస్వత ఆంక్షవలన మొన్న మొన్నటివరకు ప్రచురించబడలేదు. మార్క్సు చెప్పినట్లుగా "ఆగ్రంధప్రాతప్రతి చెదల విమర్శకువదలి వేయబడింది'' ఏ వెలాగున్నా ఆగ్రంధరచన మాత్రంవారి భావశక్తిని వృద్ధిచేసి, స్వీయసిద్ధాంత విస్పష్టజ్ఞానానికి మరింత జీవంపోసింది. దానితో సిద్ధాంత, కార్యాచరణ రంగాల్లో వారిపని మరింత తీవ్రరూపందాల్చింది. వారు బ్రస్సెల్సులో ఒక జర్మన్ కార్మికసంఘాన్ని స్థాపిం

చి 'న్యూ రెనిష్ జైటుంగ్' అనే పత్రికా నిర్వహణలో ప్రముఖపాత్ర వహించనారంభించారు. అంతేకాక ఆంగ్ల చార్టిస్టులతో తీవ్రవిప్లవవాదులతోను, 'రిఫార్మ్' అనే ఫ్రెంచి పత్రికకు ఆంగ్ల, జర్మన్ కార్మికోద్యమ వార్తలను (ఎంజెల్సు) పంపుతూ ఫ్రెంచి సోషల్ డెమాక్రట్లతోను వారు నిరంతర సన్నిహిత సంబంధం పెట్టుకునేవారు, తర్వాత తర్వాత మార్క్సు, ఎంజెల్సుల బోధలవలన అంతర్జాతీయ కమ్యూనిస్టు సంఘంగామారిన 'న్యాయవంతుల సమితి'తో కూడవారు సంబంధంపెట్టుకున్నారు.

## ప్రకరణం 6.

# కమ్యూనిస్టు ప్రణాళిక

1847 వ సంవత్సర వేసవి కాలంలో అంతర్జాతీయ కమ్యూనిస్టుసమితి మహాసభ నిబంధనావళి, కార్యక్రమాల నంగీకరించటానికై లండను నగరంలో జరిగింది. పారిస్ ముఠాకు ప్రతినిధిగా ఎంజెల్సు కూడ హాజరయాడు. అదే సంవత్సరం నవంబరు మాసంలో సమితి ఆశయ, భావాలను ప్రతిపాదిస్తూ ప్రణాళిక నొకదానిని ప్రకటించటానికై తిరిగి మహాసభజరిగింది. మార్క్సు, ఎంజెల్సులు తయారుచేసిన ప్రణాళికా చిత్తుప్రతిని సమగ్రంగా పదిదినముల పాటు ప్రతినిధులంతా చర్చించి, చివరకు వారిని ప్రకటనార్థమై శుద్ధప్రతిని తయారు చేయవలసిందిగా నియమించారు.

నవంబరు 1847 లో ఎంజెల్సు మార్క్సుకు వ్రాసిన యీ క్రింది జాబును బట్టి ప్రణాళిక అనే పేరు యీ గ్రంథానికి కలగటానికి ఎంజెల్సే కారణమని తెలుస్తుంది. "............ప్రశ్నోత్తర రూపం మార్చివేసి 'కమ్యూనిస్టు ప్రణాళిక' అనిపేరు పెడితే బాగుంటుందని నావుద్దేశం. అందులో మనం వివరించేది చరిత్రగనుక కనుక ప్రశ్నోత్తరరూపం దానికి తగదనుకుంటాను. నా భాగం తీసుకవస్తున్నాను. అది వివరణాత్మకంగా వున్నది; కాని అతితొందరగా తయారుచేయుటంవల్ల చాల గజిబిజి గావుంది..........." తర్వాత ప్రణాళికలో వివరింపబడిన వివిధ ప్రకరణాల పేర్లు చెప్పబడ్డాయి.

పూర్వపు భావవాదుల ఊహాజనిత నినాదమైన "మానవులంతా సోదరులే" అనే నినాదం మార్క్స్, ఎంగెల్సుల పలుకుబడి ప్రభావాలచేత "ప్రపంచ కార్మికులారా ఏకముకండు" అనే సమరనినాదంగా మార్చబడింది. 1848 లో కమ్యూనిస్టు ప్రణాళిక ప్రకటించబడింది; అంటే ఆధునిక సోషలిస్టు పతాకం బహిరంగంగా ఎగురవేయబడిందన్నమాట.

చారిత్రిక భౌతికవాదాధారంతో కమ్యూనిస్టుప్రణాళిక రచింపబడింది. ఏ చారిత్రిక దశయొక్క రాజకీయ, విజ్ఞానిక అభివృద్ధి మూలకారణమైనా తెలుసుకోవాలంటే ఆదశలోగల ఉత్పత్తి, మారక విధానమును, దానిఫలితంగా ఏర్పడు సాంఘికనిర్మాణమును ముందుగా తెలుసుకోవాలనేది దాని ప్రధానోద్దేశం.

ఆదిమ కాలంలో భూమిపై అందరికిహక్కు కలిగిన పురాతన తెగల సమాజం మినహాయిస్తే (చారిత్రక భౌతికవాదదృష్టిని బలపరచే యీపురాతన మానవచరిత్ర మోర్గన్, ఎంగెల్సు ప్రభృతులచే పరిశోధింపబడింది) సమాజాభివృద్ధియొక్క వివిధదశలలో మానవ సమాజ చరిత్రఅంతా పీడక-పీడిత, పాలక-పాలిత వర్గాలమధ్య జరిగే కలహాల చరిత్రయే.

ఈచారిత్రిక పరిణామాల క్రమంలో దోచుకోబడే, అణచబడే వర్గమైన శ్రామికవర్గం దోచుకునే, పెత్తనం సాగించే వర్గమైన పెట్టుబడిదారీ వర్గంపై తిరుగబడి యావత్సమాజాన్ని దోపిడి, వర్గ వత్యాసాలు, వర్గకలహాలనుండి శాశ్వతంగా విముక్తిగావించే దశ నేడువచ్చింది.

ఆధునిక పెట్టుబడిదారీ వర్గం పూర్వ సమాజ విధానాలనుండి ఏవిధంగా అభివృద్ధి చెందినదీ, యేవిధంగా మారకవిధానాలలోను, సరుకులలోను కలిగిన అభివృద్ధి, నూతనదేశాలను కనిపెట్టడం క్రొత్తవ్యాపార ప్రదేశాలేర్పడడం "వ్యాపారానికి, నౌకాయానానికి, పరిశ్రమలకు ఆదివరకెన్నడూ కనివిని యెరుగని ప్రోత్సాహమిచ్చినదీ, తద్వారా శిష్టభూతమయ్యే భూస్వామ్య సమాజ మందుండే విప్లవకర శక్తులకు శీఘ్రాభివృద్ధిని చేకూర్చినదీ" 'ప్రణాళిక' మొదటి ప్రకరణంలో తెలుపబడింది.

విప్లవకర పాత్ర వహించిన పెట్టుబడిదారీ వర్గ అభివృద్ధి క్రమంలోని ప్రతిదశతో బాటు అవర్గ రాజకీయాభివృద్ధికూడ అనుసరిస్తూ వస్తూంది. "తన

ఫు పెత్తనం చేజిక్కిన ప్రతిచోటా పెట్టుబడిదారీ వర్గం భూస్వామ్య, పితృస్వామిక, పురోహిత సంబంధాలను తుడిచిపెట్టివేసింది............వేయేల ముక్తసరిగా చెప్పదలచివస్తే అది మత, రాజకీయ తెరలమాటున జరుగుతుండే దోపిడీకి బదులు దయ, లజ్జ లేని కేవల ప్రత్యక్ష దోపిడిని అవలంబించింది. పూర్వం భయంతో గౌరవింపబడుతుండే పనులన్నింటి యందుండే వ్యర్థ పూజ్య భావాన్ని పెట్టుబడిదారీ వర్గం నాశనం చేసింది. వైద్యునీ, న్యాయవాదినీ, మతగురువునూ, కవినీ, శాస్త్రజ్ఞుని తనజీతపు కూలీలుగా మార్చివేసింది ''

పురాతన పూజ్య భావాలన్నీ తుడిచిపెట్టి వేయబడుతూ, వాటిస్థానాల నాక్రమించుకునే కొత్తభావాలుకూడ శాఖావ్యాప్తిచెంది దృఢపడక ముందే బూజుపట్టి పోతూండటం చూసినదాని ఫలితంగా మానవునకు యిదార్థపరిస్థితులను యెదుర్కొని విషయాలన్నీ కూలంకషంగా అర్థంచేసుకోవలసిన అవసరం కలుగుతుంది.

ఒకమారు అమలులోకి వచ్చిన పెట్టుబడిదారీ వుత్పత్తివిధానం ''ఏ జాతియైనా సరే తాను జీవించియుండాలంటే పెట్టుబడిదారీవుత్పత్తివిధానాన్నితప్పక అనుసరించే లాగుచేస్తుంది. అది తాను నాగరకత అని పిలిచే దాన్ని యితరులందరూ తమమధ్యకూడ ప్రవేశపెట్టుకొనేటట్లు చేస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే అది పెట్టుబడిదారీప్రపంచాన్ని సృష్టిస్తుంది''

పెట్టుబడిదారీ విధానం బ్రహ్మాండమైన పట్నాలలో జనబాహుళ్యాన్ని విపరీతంగా కేంద్రీకరించినది. ఉత్పత్తి సాధనాలను, వాటితోబాటు విపరీతమైన ఐశ్వర్యాన్ని కొద్దిమంది చేతుల్లో అదికేంద్రీకరించింది. తత్ఫలితంగా రాజకీయాధికార కేంద్రీకరణతోబాటు పూర్వం అక్కడక్కడ చెల్లాచెదరుగా వున్న జనసమూహ కేంద్రీకరణ కూడజరిగి వాటిలోనుండి ఆధునిక జాతులుద్భవించాయి.

పెట్టుబడిదారీ వర్గంగ్రామాలను నగరశాసనానికి లోబరచి, వాటిపై ఆధారపడేటట్లు చేసింది. అట్లే అనాగరక దేశాలు, అర్థనాగరక దేశాలు నాగరకతగల దేశాలపైన; వ్యవసాయక దేశాలు పెట్టుబడిదారీ దేశాలపైన; ప్రాచ్యదేశాలు పాశ్చాత్య దేశాలమీదా ఆధారపడునట్లు చేసింది. (తంవ్వత తర్వాత తూర్పుదేశాలుకూడ జాగృతిచెందెంది, తప్పనిసరిగా పెట్టుబడిదారీ

మార్గంలో పశ్చిమదేశాలకంటెనే త్వరత్వరగా అభివృద్ధి చెందుతున్నాయి.

"వంద సంవత్సరాలు కూడ నిండని పెట్టుబడిదారీ శాసన కాలంలో అది అతఃపూర్వపు తరాలన్నీ కలిసి నిర్మించజాలని బ్రహ్మాండమైన, బహు శక్తి సంపన్నమైన వుత్పత్తిశక్తులను సృజించింది."

పెట్టుబడిదారీ వుత్పత్తి విధానాభివృద్ధి కొనసాగు వీలు కలుగుటకు గాను భూస్వామ్య యుగపు సంకెళ్లే విధంగా ఛేదింప బడవలసి వచ్చిందో, అదేవిధంగా అతిత్వరితంగా అభివృద్ధిచెందుతూన్న ఉత్పత్తివిధానము వల్ల, ఆవిధాన ఫలితంగా సంఘంలో తప్పని సరిగాజనించే సాంఘిక, రాజకీయ, మానసిక సంబంధాలు కూడ పెట్టుబడిదారీ సమాజానికి ప్రతికూలమైనవిగా, అసంబద్ధమైనవిగా తయారవుతాయి. పెట్టుబడిదారీ వర్గం భూస్వామ్య యుగాన్ని యే ఆయుధాలతో నైతే నేలమట్టం చేసిందో ఆ ఆయుధాలే పెట్టుబడిదారీ వర్గంమీద నేడు తిరిగి ఉపయోగింపబడుతున్నాయి. పెట్టుబడిదారీవిధాన విజయాన్నీ ఆధిక్యతనూ చాటే బహుళోత్పత్తియే దాని పతనానికికూడ దారితీస్తుంది. దీనికి తార్కాణంగా 'కమ్యూనిస్టు ప్రణాళిక'లో నానాటికీ అధికంగా దాపురింపుతూన్న ఆర్థిక సంక్షోభాలు ఆసమయాల్లో సంభవించే 'అత్యధికోత్పత్తిజాడ్యము,' పేర్కొనబడ్డాయి.

పెట్టుబడిదారీ వర్గం కేవలం తనను వినాశంచేసే ఆయుధాలనే గాక, ఆ ఆయుధాలను వుపయోగించగలిగియున్న మనుష్యులను కూడ కల్పించియుంది వారే ఆధునిక కార్మికవర్గం—శ్రామికులు. తర్వాత జనాభాలోని అన్ని వర్గాలలోనుండి యేవిధంగా కార్మికవర్గం జనించి అభివృద్ధిచెందేది, పెట్టుబడిదారీ వర్గంతో దానికుండే సంబంధాలను గురించి 'ప్రణాళిక'లో వివరింపబడింది. దానిపుట్టుక నుండీ కార్మికవర్గం చైతన్య సహితంగానో, చైతన్య రహితంగానో పెట్టుబడిదారీ వర్గంతో పోరాటం సాగిస్తూనే వుంటుంది. పెట్టుబడిదారీ వర్గంకూడ—మొదట ప్రభువులతోను, తర్వాత భావి పరిశ్రమాభివృద్ధికి ఆటంకాలుగా తయారయ్యే కొందరు పెట్టుబడిదారులతోను, ఆతర్వాత యెల్లప్పుడూ పరదేశాల పెట్టుబడిదార్లతోను — యీవిధంగా నిరంతర పోరాటాలలో వలిగి పోతూవుంటుంది.

ఈపోరాటాలన్నింటిలోనూ తన అవసరార్థం పెట్టుబడిదారీ వర్గం

కార్మికవర్గ సహాయాన్ని కోరక తప్పదు. కార్మికవర్గం తనకు తెలియకుండానే తనగర్భశత్రువులైన పెట్టుబడిదారీ వర్గానికి సహాయభూతంగా యుద్ధాలలో పాల్గొన్నప్పటికీ, ఆ యుద్ధక్రమంలోనే సమిష్టిప్రయత్న ప్రయోజనాన్ని నేర్చుకొని, రాజకీయరంగంలోనికీడ్వబడి, యేఆయుధాలలో నైతే పెట్టుబడిదారీ వర్గాన్ని కార్మికవర్గం సంహరిస్తుందో ఆ ఆయుధాలు తనశత్రువుచేతనే సరఫరా చేయబడుతుంది.

మధ్యతరగతిలోని క్రిందమెట్టువారు, చిన్నవర్తకులు, దుకాణదారులు చేతిపనులు చేసుకునేవారు, రైతులుకూడ పెట్టుబడిదారీవర్గానికి శత్రువులే అయినప్పటికీ ఒక్క కార్మికవర్గమే నిజమైన విప్లవకరవర్గం. ఆధునిక పారిశ్రామిక పద్ధతులనుండి ఆవశ్యంభావిగా జనించే ప్రత్యేక శక్తియే కార్మికవర్గం. సమాజపు అట్టడుగు భాగాలకుచెంది, అణగద్రొక్కబడుటచే అవినీతి పరులుగాను, అవినీతికరమైన వర్గంగాను మారిన ముష్టివాండ్లు మొదలైనవారు. అప్పుడప్పుడు శ్రామిక విప్లవోద్యమం లోనికి లాగబడినప్పటికీ వారిజీవిత పరిస్థితుల మూలంగా తరచుగా వారు అభివృద్ధి నిరోధకుల లంచాల కాశపడి వారిచేతులలో కీలుబొమ్మలుగా వుపయోగపడుతూ వుంటారు. 'ప్రణాళిక'లో తర్వాత యీవిధంగా చెప్పబడింది'.

"వెనుకటి చారిత్రకోద్యమాలన్నీ అల్పసంఖ్యాకులయొక్క లేదా వారి లాభాలకోసం ఉద్దేశింపబడ్డ వుద్యమాలు. కార్మికోద్యమం తనశక్తి తానెరిగిన అత్యధిక సంఖ్యాకుల స్వతంత్రోద్యమం. అత్యధిక సంఖ్యాకుల వుద్యమంగా అదితయారై తీరాలి. ప్రస్తుత సమాజంలో క్రిందమెట్టునవుండు కార్మికవర్గం తనపైపెత్తనం చెలాయించే వర్గశ్రేణు లన్నింటిని ఛేదించుకుని బయటపడితేగాని కదలమెదల జాలదు...........(ఈవిధంగాను, యితర విధాలలోను) ఆధునిక పారిశ్రామికాభివృద్ధి పెట్టుబడిదారీ వర్గపుఉత్పత్తి, వినియోగవిధాన పునాదినే త్రవ్వివేస్తుంది. అందుచేత పెట్టుబడిదారీ వర్గం, అన్నిటికన్న ముఖ్యంగా తయారుచేసేది తన వినాశకారులనే. దానిపతనం, కార్మికవర్గవిజయం రెండూతప్పనిసరిగా రానున్నాయి!"

'ప్రణాళిక' రెండవప్రకరణంలో కమ్యూనిస్టులకు 'లేక సోషలిస్టులకు) కార్మికులతో యెట్టిసంబంధ మున్నదీ వివరింపబడింది. కమ్యూనిస్టులకు

కార్మికవర్గ మంతటియొక్క క్షేమలాభాలు కాక మరొక ప్రత్యేక ప్రయోజనా
లు లేవు. సర్వదేశ కార్మిక పక్షాలకు అగ్రశ్రేణులే కమ్యూనిస్టుపార్టీలు.
"విశ్వసంస్కర్త కాబోవు యెవరో ఒకవ్యక్తిచే కనుగొనబడినట్టి, కల్పించబడి
నట్టి భావాలపైగాని, సూత్రాలపైగాని కమ్యూనిస్టుల సిద్ధాంతాలే మాత్ర
మూ ఆధారపడిలేవు. "ప్రస్తుతముండే వర్గకలహము నుండి, మనకండ్లయె
దుటనే జరుగుతున్న ఒకచారిత్రకోద్యమము నుండి బయల్వెడలిన ప్రస్తుత
సంబంధాలనే కమ్యూనిస్టుసూత్రాలు సాధారణ పదాలలో వెల్లడిస్తూవున్నా
యి. ప్రస్తుతపు ఆస్తి సంబంధాలను రద్దుపరచడం కమ్యూనిజంయొక్క ప్ర
త్యేకలక్షణం ఏమాత్రమూ కాదు. గతంలోకూడ చారిత్రక పరిస్థితుల యంద
లిమార్పుల ననుసరించి ఆస్తి సంబంధాలన్నీ చారిత్రక మార్పులకు వరుసగా
లో నగుతూనేవున్నాయి."

పెట్టుబడిదారీ ఆస్తిని లేకుండచేయుటమే కాని, సాధారణ ఆస్తిహక్కు
నుకూడ రద్దుచేయటం కమ్యూనిజం యొక్క ఆశయం ఎంతమాత్రం కాదు.
ఆ తర్వాత సోషలిజానికి వ్యతిరేకంగా చేయబడే వివిధరకాల పరిచిత ప్రతి
కూల వాదనలు పేర్కొంటూ యీవిధంగా చెప్పబడింది: "వ్యక్తిగత ఆస్తిని
రద్దుచెయ్యాలనే మాకోరికను వినగానే మీరు భయభ్రాంతు లగుతున్నారు.
కాని మీయీ ప్రస్తుత సమాజంలో పదింటతొమ్మిదివంతుల జనానికి వ్య
క్తిగత ఆస్తిలేకుండా యిదివరకే చేయబడింది. కొలదిమంది దగ్గరనైనా అది
వుండే దానికి కారణం మిగత తొమ్మిది వంతులజనంవద్ద లేకుండడమే. అం
దుచే దేని ఉనికి సమాజమం దత్యధిక సంఖ్యాకుల కట్టిఆస్తియు లేకుండడం
మీదనే ఆధారపడివుందో అట్టిఆస్తి స్వరూపాన్ని మేములేకుండ చేయగో
రుతున్నామని మీరు మమ్ము నిందిస్తూవున్నారు. ముక్తసరిగా చెప్పాలంటే
మీస్వంత ఆస్తిలేకుండ చేయగోరుతున్నామని మీరుమమ్ము నిందిస్తున్నారు.
ఖండితంగామేము చేయగోరేది అదే.............సమాజంయొక్క వస్తుత్ప
త్తులను వినియోగించుకునేందుకు ఏమనుష్యుని హక్కునూ కమ్యూనిజం రద్దు
చెయ్యదు. అది చేసేదల్లా, అట్టివినియోగంవలన యితరుల కష్టఫలితాన్నిదో
చుకునే శక్తిని రద్దుచేయడం మాత్రమే."

కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా చెప్పబడే తాత్విక వాదనలకు బదులుగా

‘ప్రణాళిక’లో యీవిధంగా చెప్పబడింది. “భౌతిక పదార్థోత్పత్తి మారే కొలది విజ్ఞానోత్పత్తికూడ దానిస్వభావాన్ని మార్చుకుంటూ, వుంటుందని కాక భావాలచరిత్ర మరిదేన్ని ఋజువుపరుస్తూవుంది? ఏయుగమందైన, ఏ కాలమందైనాసరే ప్రాబల్యంలో వుండే భావాలన్నీ ఆకాలపు పాలకవర్గంయొక్క భావాలే. సమాజాన్ని విప్లవోద్దీపిత మొనర్చే భావాలనుగూర్చి ప్రజలు చెప్పకునేమాటలనుబట్టి పాత సమాజమునందే నూతన సమాజబీజాలు సృజింపబడ్డాయనీ, పాతభావాలు పాతజీవిత పరిస్థితులలో పాటు శిధిలమవుతున్నాయనీ వ్యక్తమవుతోంది.”

నిస్సందేహంగా మత, నీతి. తత్వ. ధర్మశాస్త్రభావాలు చారిత్రకాభివృద్ధి క్రమంలో మార్చబడ్డాయి. మతం, నీతి, తత్వజ్ఞానం, రాజకీయశాస్త్రం, చట్టశాస్త్రం సదా యీమార్పులకు దాటుతూ నేటికీ జీవించియే వున్నాయి.’

అంతేగాక స్వేచ్ఛ. న్యాయం మొదలగు నిత్య సత్యాలు అన్నికాల సమాజాలకు సమానంగా అన్వయింపబడుతూ వస్తున్నాయి. కాని కమ్యూనిజం నిత్యసత్యాలను నాశనంచేస్తుంది. మతాలన్నింటిని, సర్వనీతి సూత్రాలనూ నూతన విధానంమీద నిర్మించక నాశనంచేస్తుంది. అందుచేత పూర్వ చారిత్రక అనుభవాని కంతకూ వ్యతిరేకంగా అదిపనిచేస్తోంది” అని ఆరోపిస్తారు.

ఈనింద కర్థమేమిటి? సమాజంయొక్క పూర్వచరిత్ర అంతావర్గస్పర్థల అభివృద్ధియేననియే కదా? ఈస్పర్థలు వివిధ యుగాలందు వివిధ రూపాలు దాల్చాయనే కదా?

“కానిఅవిఏరూపాన్ని ధరించినా పూర్వయుగాల కన్నింటికీ సమాజమందలి ఒకభాగాన్ని మరియొకటి దోచుకునే దన్న సత్యంమాత్రం సమానంగానే వర్తిస్తుంది. అందుచేత, పూర్వయుగాల సామాజిక చైతన్యం అనేకవిధాల ప్రకటితమై యుండినప్పటికీ కొన్ని సమాన రూపాలలోనే, కొన్ని సాధారణ భావాలలోనే పరిభ్రమిస్తూవుండేది. ఇందాశ్చర్య మేమీ లేదు. ఈ స్థితి వర్గ స్పర్థలు సంపూర్ణంగా మాయమయ్యే వరకు సమసిపోదు.

“సాంప్రదాయ సిద్ధమైన ఆస్తిసంబంధాలతో సంపూర్ణ, తీవ్రసంఘర్ష

లే కమ్యూనిస్టు విప్లవం, అందుచేత దాని అభివృద్ధికి సాంప్రదాయ సిద్ధభావాలకూ మధ్యకూడ తీవ్రసంఘర్షణ కలగడంలో ఆశ్చర్యపడవలసిన విషయమేమీలేదు.”

మూడవ ప్రకరణంలో సంస్కరణ వాద, అభివృద్ధి నిరోధక, ఊహాజనిత సోషలిస్టుల లోపభూయిష్ట వాదాలన్నీ వివరంగా అతి సమర్థతతో బట్టబయలు చేయబడ్డాయి.

చివరి ప్రకరణంలో ఏవిధంగా కమ్యూనిస్టులు కార్మికులకైవందిన ఆర్థిక హక్కులకై పోరాడుతూనే వారి 'కార్మికవర్గ సంపూర్ణవిముక్తి' అనే అంతిమ మాశయాన్ని విస్మరించక దానికొరకై కృషిచేస్తారో వివరించి, 'ప్రణాళిక' యీక్రింది చారిత్రక వాక్యాలతో ముగిస్తుంది “కమ్యూనిస్టులు తమ భావాలను దాచ నిరాకరిస్తారు. వారు తమ ఆదర్శాలు ప్రస్తుత సామాజిక పరిస్థితులను బలవంతంగా రూపుమాపనిదే పొందటం సాధ్యంకాదని బహిరంగంగా చాటుతారు. కమ్యూనిస్టు విప్లవాన్ని తలుచుకొని పాలకవర్గాలు గడగడ కంపిస్తాయి! కార్మికులకు పోగొట్టుకునేందుకు సంకెళ్ళు తప్ప మరేమీలేవు. కాని పొందేందుకుమాత్రం విశాలమైన ప్రపంచమంతావుంది. ప్రపంచ కార్మికులారా ఏకముకండు'”

1888 వ సంవత్సరంలో వెలువడిన 'కమ్యూనిస్టు ప్రణాళిక' ముద్రణకు భూమిక వ్రాస్తూ సోషలిస్టు సాహిత్య మంతలోనూ అనాటికి (1888) అత్యధిక, అంతర్జాతీయ వ్యాప్తిచెందినది నిస్సందేహముగా 'ప్రణాళిక'యేనని పేర్కొంటూ యీవిధంగా వ్రాశాడు. “అయితే దానిని వ్రాసేటప్పుడు దానికి 'సోషలిస్టు' ప్రణాళిక అని మేము పేరుపెట్టలేకపోయాం. 1847 లో 'సోషలిస్టు' లనే పేరు ఒకవంక ఊహాజనిత వివిధ విధానాల ననుసరించే ఇంగ్లండులోని ఓవెన్ అనుయాయులకూ, ఫ్రాంసులోని ఫోరియరు అనుయాయులకూ వర్తిస్తూవుండేది. ఇవిరెండూ అప్పటికే క్షీణించిపోయి కేవలం చిన్న తెగలుగా వుండి, కాలక్రమేణా నశించి పోయేదశకు వచ్చివున్నాయి. వేరొకవంక సోషలిస్టులంటే పెట్టుబడికి, లాభానికి ఎట్టి అపాయము కలుగ చేయకుండానే సకలవిధాల సామాజిక సంకటాలను నివారిస్తామని, అన్ని రకాల అతుకుబొతుకులుచేసి సామాజిక రోగాలను పోగొట్టుతామని,చెప్పే

వివిధ బూటకపు చికిత్సకులకు వర్తిస్తుండేది. ఈ యిరుతెగల్లోనివారూ కార్మికోద్యమానికి దూరులై వీరుతమ సహాయార్థమై విద్యావంతులగు తరగతులవైపే దృష్టిని నుడ్చుచుండేవారు.

"కేవలం రాజకీయ విప్లవాలే చాలవని గ్రహించి సంపూర్ణసమాజిక మార్పుయొక్క అవశ్యకతను ప్రకటించిన కార్మికవర్గభాగాలన్నీ తమనుతాము కమ్యూనిస్టులని వ్యవహరించుకొనసాగాయి. అది గజిబిజిగావుండి, అప్పుడే ఆకారం పొందుచున్న స్వభావసిద్ధమైన కమ్యూనిజం. అయినప్పటికీ అది మూలవిషయం గ్రహించింది. ఇట్లు 1847 లో సోషలిజం ధనికవర్గపు వుద్యమం; కమ్యూనిజం కార్మికవర్గపు వుద్యమం. సోషలిజం కనీసం యూరపు భాగమంతైనా 'మాననీయంగా' వుండేది. కాని కమ్యూనిజం పూర్తిగ తద్వ్యతిరేకం. మొట్టమొదట నుండీ 'కార్మికుల విముక్తితప్పక కార్మికులపనే' అనేభావం కలిగినవారం కావడంచేత సోషలిజం అనేపేరు స్వీకరించవలెనా లేక కమ్యూనిజం అనేపేరు స్వీకరించవలెనా? అనేవిషయంలో మాకేమీ సందేహానికి తావు కన్పించలేదు. పైగా నాటినుండి నేటివరకును ఆపేరుసరియైనది కాదని నిరాకరించే విషయం ఆలోచించనైనాలేదు,"

## ప్రకరణం 7.

# పెట్టుబడిదారీ, కార్మికవర్గ ప్రజాతంత్రాలు.

ద్వితీయ మహాసభ అనంతరం అంతర్జాతీయ కమ్యూనిస్టు సమితిశాస్త్రీయ ప్రచారకుల బలీయమైన సంస్థగా తయారైంది. మార్క్సు, ఎంగెల్సులు పారిస్‌కు, అక్కడనుండి జర్మనీకి వెళ్లి కొలోన్‌లో 'న్యూరేనిష్‌జీటుంగ్' అనేపత్రికను స్థాపించి సిద్ధాంతరంగంలోను, కార్యరంగంలోను, పౌర, రాజకీయ స్వాతంత్ర్యాలను పొందుటే పరమ ప్రధానమనీ, వాటి సాధనతో ప్రజల బానిస శృంఖలాలు వాటంతటవే పటాపంచలై తమపరివారంతా కాంతిసంపదలతో తులతూగుతారని చెప్పే 1848 నాటి విప్లవవాదుల భావాలన్నీ పగటికలలని నిరూపించి వాటిని తూర్పారబట్టేవారు రాజకీయవా

హక్కుల సాధనకొరకు, అభివృద్ధి నిరోధకులను అధికారచ్యుతులను గావించేందుకు మార్క్స్, ఎంగెల్సులు బలిష్టమైన పోరాటాలవసరమని చాటి చెప్పారనే విషయం నేనిక్కడ పేర్కొనటం అనవసరం. కాని ఆ పోరాటాలు కూడ పెట్టుబడిదారీ ఆధిపత్యమునుండి కార్మికవర్గ విముక్తిని సాధించడానికై జరుగవలసిన అంతిమ పోరాటానికి ప్రాతిపదిక మాత్రమే ననివారు చెప్పిన విషయం మీ గుర్తుకు తెస్తున్నాను. మార్క్సు వలెనే ఎంగెల్సుకూడ కమ్యూనిజాన్ని సాధించేక్రమంలో మాత్రమే ప్రజాస్వామిక సూత్రాలను సాధించడం సాధ్యమని బోధించాడు.

(కమ్యూనిజం వినా) “ఇతర ప్రజాతంత్రసూత్రాలేవీ, యదార్థపరిస్థితులను పరిగణించక పరిసరాల ప్రాబల్యంవల్ల, మానవుల కృషివల్ల సిద్ధాంతాలేర్పడతాయని కాక, సిద్ధాంతాలు వాటంతటవే యేర్పడతాయని శాస్త్రీయవాదన చేస్తూ పగటి కలలుకనే సిద్ధాంతకర్తల మస్తిష్కాలలో తప్ప వేరెక్కడా వుండజాలవు. అందుచేతనే ప్రజాతంత్ర మనేది కార్మికవర్గ సిద్ధాంతంగా పరిణామం చెందింది” అని ఎంగెల్సు చెప్పాడు. ప్రజాతంత్రాభివృద్ధిపై బలప్రయోగం చేసే పాలకవర్గాధికారాన్ని నాశనంచేస్తేగాని ప్రజాతంత్రాభివృద్ధి సాధ్యంగాదు.

ఎంగెల్సు రచించిన “కుటుంబం, దాని పుట్టుపూర్వోత్తరాలు” అనే గ్రంథములోని యీ క్రిందిభాగమెంత యదార్థమైనదో చూడండి. “కార్మికవర్గపక్వతను తెలుసుకోటానికి సార్వజనీన ఓటింగుహక్కు ఒక కొలత బద్దవంటిది. ఆధునిక రాజ్యాంగ విధానంలో సార్వజనీన ఓటింగుహక్కు కన్న అధికతర ప్రజాతంత్ర విధానం అమలుజరగటం సాధ్యంకాదు; అమలు జరుగదు కూడా. కాని అంతమాత్రమే చాలు కార్మికవర్గానికి. సార్వజనీన ఓటింగు హక్కును సంపూర్ణచైతన్యంతో కార్మికులుపయోగించుకున్న రోజే పెట్టుబడిదారీ పతనదినమవుతుంది.”

సార్వజనీన ఓటింగుహక్కు ప్రజలకు ప్రసాదించబడిందంటే దానర్థం కార్మికవర్గశక్తి ప్రబలమవుతోందన్నమాట. పాలకవర్గాలు తమ అధికారాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రజల కధికార ప్రదానం చేసినట్లు నటిస్తూ అసలైన అధికారాలను తమచేతుల్లోనే నిలుపుకోటానికి ప్రయత్నిస్తుంటా

ను. కాని యెప్పుడైతే కార్మికవర్గమూ, దాని చైతన్యవంతమైన పురోగామి భాగమూ పూనుకుని యీహక్కును నిజంగా వుపయోగించుకొన నారంభిస్తాయో తమ అధికారం 'నిజంగానే' గుంజుకోబడబోతుందని గ్రహించిన పెట్టుబడిదారీ వర్గాలు అవెంటనే నైతిక బోధనలు, బూటకవాగ్దానాలు, అయోమాయ గారడీలతో కూడిన ఎన్నికల విధానానికి ఎసరబెట్టి చరిత్రలో పూర్వ మనుసరింపబడిన అనేక యితరపద్ధతులకు పూనుకుంటారు. దానిలో సార్వజనీన ఓటింగు హక్కు కూడ బూజుపట్టిపోతుంది.

ఈసందర్భములో సోషలిస్టులుగాని, కమ్యూనిస్టులుగాని సాయుధ, శాంతి, రక్తస్రావిత విప్లవమే పరమావశ్యకంగా పరిగణించరని మీకుగుర్తుకు తెస్తున్నాను. కాని యదార్థపరిస్థితుల నెమరువేయక మరుగుపరచ ప్రయత్నించటం మాత్రం శిక్షితమని చెప్పవలసివస్తుంది. ప్రతిపక్షం పదవీ త్యాగంచేసి తనఆస్తిని తనంతటతాను పంచిపెట్టదుకదా! అప్పుడు మనకింక గత్యంతర మేమిటి? వారిఆస్తి వారిచేతుల్లో అవిధంగానే వుండి. దానిని వారు యథేచ్ఛగా వాడుకో దలుచుకున్నట్లయితే పాలకవర్గపు ఆస్తి అనేఆయుధం, కార్మికవర్గపు ఓటింగుహక్కు కన్న అనేకరెట్లు శక్తివంతమైనదిగా వాడిగైనదిగావుంటుంది. అందుచేత కార్మికవర్గానికి పోరాటంవినా అన్యథాశరణ నాస్తియన్నమాట.

రష్యన్ కార్మిక ప్రజాస్వామికం తాను బాహ్యాంతరంగిక శత్రువుల చేముట్టడింపబడి సమూలంగా నాశనం చేయబడబోతున్నా సమయంలో 'సత్యమేవజయతి' 'అహింసా పరమోధర్మః' అంటూ చేతులు ముడుచుకుని నీతిసూత్రాలను వల్లిస్తూ కూర్చుండే శత్రువులచేతుల్లో దానిపని ఏమయ్యేది? రష్యాపై ఒక్కపెట్టుగా శత్రురాజ్యాలు దండెత్తి వచ్చినవాడు తమమాతృదేశాన్ని ఒక విశిష్ట, విలక్షణ నూతన నాగరకతా నిర్మాణార్థమై జరిగినమహత్తర సోవియట్ విప్లవాన్ని రక్షించుటకు పూనుకొని రెడార్మీ ఆయుధ విసర్జనచేసి శత్రువుల హృదయ పరివర్తనానికై మంత్రాలువల్లించి వట్లయితే 'నైతిక శాస్త్రోక్తం'గా ప్రవర్తించినదౌనని యెంతమూర్ఖుడైనా అనగలడా! అహింసా సిద్ధాంతాన్ని అక్షరాలా అమలుజరిపి తీరాలనటం శుద్ధమూర్ఖత్వం తప్ప వేరేమీ కాదని గుర్తించటానికెవ్వరూ సందేహించరనుకుంటాను.

అదే సమయంలో ఎంగెల్సు 'డ్యూహరింగ్‌పై ఖండన'లో నిరూపించి

వట్లుగా బలప్రదర్శనమే మన ఆశయంకాదు. బలప్రయోగంతోనే విప్లవ విజయం సాధించటం గాని, ఏ ఒక ప్రబలమైన వర్గాన్నైనా శాశ్వతంగా అధికారంలో వుంచడంగాని సాధ్యంగాదు. ఆర్థికపరిస్థితులు, ఉత్పత్తిశక్తుల అభివృద్ధి యొక్క స్థాయిలే ఆయాప్రత్యేక సామాజికవిధానాల ప్రాదుర్భావానికి మూల కారణాలు. పూర్వ, ప్రస్తుత సామాజిక విధానాలపై మనకు అసహ్యాన్ని కలిగించి, పరిస్థితులు పక్వమైనపుడు వాటిని కూలద్రోసే యిచ్ఛను, సమర్థతను కలిగించేది కూడ తిరిగి ఉత్పత్తిశక్తుల అధికతరాభివృద్ధియే!

ఈవిధంగా ఆదిమ కమ్యూనిస్టు సమాజమునుండి పరిణామంచెందుతూ వస్తూన్న సామాజిక విధానాలలో బానిససమాజం కూడ దానికన్న పూర్వపుసమాజం కన్న యేవిధంగా ఆవశ్యక, ఉపయోగకర పాత్రను వహించినదీ పేర్కొంటూ ఎంగెల్సు యీవిధంగా వ్రాశాడు. "బానిసత్వం వంటి విధానాలను పాపభూయిష్టమైనవంటూ తీవ్రంగా నిందించడం చాల సులభమే కాని దురదృష్టవశాత్తూ యీ ఆక్షేపానికి కారణం యీనాటిపరిస్థితులకు, వాటి నుండి జనించిన మనభావాలకూ బానిసత్వంవంటి పురాతన పద్ధతులు అనుగుణ్యం కాకపోవటమే ననే విషయం అందరకూ తెలిసినదే. కాని యీ ఆక్షేప ప్రదర్శనంవల్ల అట్టి వ్యవస్థలే విధంగా బయల్దేరి, యేల వ్యాపించి, చరిత్రలో యే పాత్రలను వహించాయో అనే విషయాలను గురించిమాత్రం కించిన్మాత్రం కూడ మనకు తెలియదు. కాని మనం యీవిషయాలు సమగ్రంగా పరిశీలించినట్లయితే, ఆ దేశ కాల పరిస్థితుల ననుసరించి బానిసవిధానపురాక కూడ గొప్ప అభివృద్ధికరమైన విషయమే నని—యెంతవిరుద్ధంగాను, వితండంగాను కనిపించినా—ఒప్పుకు తీరవలసి వుంటుంది."

జీవనాధారాలు అధికంగా లేకపోవటంవల్ల ఆదిమ పురాతన కమ్యూనిజం అంత హెచ్చుగా వ్యాప్తిచెందలేక పోయింది. కాని యెప్పుడైతే జీవనోపాయాలు అధికమవుతాయో అప్పటికి ఉత్పత్తిశ్రమ సాధనాలు చాలతక్కువగా నుండుటచేత, "అవసరమైన జీవనోపాయాల కన్న కొలదిగా మాత్రమే అధికంగా కల్పించాయి. ఈపరిస్థితుల్లో ఉత్పత్తిశక్తుల్లోను, వ్యాపారవ్యాప్తిలోను, రాజ్యాంగ, న్యాయచట్టాల అభివృద్ధిలోను లేక కళా, విజ్ఞాన

ం జనకంలోను అధికతరశ్రమ విభాగంతో మాత్రమే యోగ్యద్ధి పెరుగుదలకైనా సాధ్యమౌతుంది.”

ఈవిధమైన శ్రమ విభజన పద్ధతుల్లో అన్నిటికంటె బానిసత్వపద్ధతే అతి సహజమైన, సులభమైన పద్ధతి. ఈపద్ధతిలో సమాజములోని ఒకభాగం నీచ, నికృష్ట కార్యాల భారంతో సతమవుతూంటే, రెండవదైన పాలకవర్గం బానిసలపై పెత్తనం చెలాయించటం, రాజ్యాంగ కార్యకలాపాలు కొనసాగించటం, వ్యాపార, కళా, విజ్ఞాన పథాల్లో కృషిచేయడం చేస్తూంటుంది. ఆరోజుల్లో బానిసవిధానంలోని అసమత్వాలను గుర్తించినప్పటికీ, దానిని రద్దుచెయ్య ప్రయత్నించడం మాత్రం ప్రయోజన శూన్యమైన పని అవటంలో సందేహంలేదు. అందుచేతనే బానిసవిధాన వినాశానికై యే ప్రజాపార్టీయు జనించనూలేదు; ఒకవేళ జనించినా దాని ప్రయత్నం ఫలించేదికాదు.

కాని కాలచక్ర గమనం ఆగిపోలేదు విశ్రాంతిగల వర్గాల అంతకంతకు యితరుల శ్రమనధికంచేస్తూ పూర్తిగా దానిపైనే ఆధారపడనారంభించారు. కానైతే, ఉత్పత్తిశక్తులు చాల అధికంగా పెరిగి యుండుటవల్ల సమాజంలో విశ్రాంతిగల ఒకప్రత్యేక వర్గపు ఉనికి అనావశ్యకము. భావి సమాజాభివృద్ధి మార్గంలో ప్రత్యాఘాటంకముగా తయారైంది, అందుచేత, అది “ ‘పవిత్రత’ (దుహ్రింగుపదం) సంపన్నమైనదైనప్పటికీ నిర్దాక్షిణ్యంగా నిర్మూలింపబడుతుంది.” ఏమైనప్పటికీ, బలప్రయోగం చరిత్రలో ప్రముఖమైనపాత్రను వహించిందని చెప్పక తప్పదు. అందుచేత దానిని అసహ్యించుకోటం గాని, తేలికగా నిరాకరించటం గాని మంచిదికాదు.

“పాప దుహ్రింగు నడిగితే బలప్రయోగం పూర్తిగాదోషము. పుట్టుకతోటి పాపము వంటిదీ అంటాడు. తదుపరి చరిత్రలో పుట్టుకతోటి పాపంవంటి యీహింస కానివచ్చిన పంకిలమే అంతా, యీహింసతో రాష్ట్రశక్తి చేసిన కుట్రలే నీతివిరుద్ధమైన ప్రాకృతిక, సాంఘిక పాపాలన్నీ అని వాపోయాడు దుహ్రింగ్. కాని చరిత్రలో హింస మరియొక పాత్ర అంటే విప్లవకర పాత్రనుకూడ వహించింది. మార్క్సు చెప్పినట్లుగా పాతసమాజ గర్భంలోనే నూతనసమాజం జననమొందుతుంది. హింస

ఆనూతన సమాజ శిశువు బయటపడటానికి తోడ్పడే మంత్రసాని వంటిది. హింసఅంటే మృతిచెందిన, బూజుపట్టి పాతవైన రాజకీయ విధానాలను ఛేదించగాని సాంఘికాభివృద్ధి బయటపడటానికి తోడ్పడే సాధనం. కాని ఈ విషయాలను గురించి మాత్రం డుహ్రింగ్ పల్లెత్తుమాటకూడ చెప్పలేదు. దోపిడిపై ఆధారపడిన ఆర్థికవిధానాన్ని కూల్చటానికి హింస అవసరమయ్యే అవకాశముండవంటూ—దురదృష్టవశాత్తు హింసను ప్రయోగించేవారు హింసాప్రయోగ క్రమంలోనే నిర్వీర్యులవుతారంటూ—మూలుగుతూ, ముక్కుతూ అయిష్టంగా మాత్రమే ఆయన అంగీకరిస్తాడు. విజయం పొందిన ప్రతి విప్లవ కాలంలోను ప్రజలలో అత్యద్భుతమైన నైతిక, ఆధ్యాత్మికాభివృద్ధి ద్యోతకమవటం చూసికూడా ఆయనయీవిధంగా వాపోవడం ఆశ్చర్యకరమైన విషయం' పైగా సాయుధ విప్లవంద్వారా, ముప్ఫైయేండ్ల యుద్ధ పరాజయ ఫలితంగా జర్మన్ జాతిలో వ్యాపించిన బానిస భావాలు సమూలం పెకలటానికి మహదవకాశం గల జర్మనీ విషయంలో డుహ్రింగ్ యీవిధంగాచెప్పటం ఎంతదారుణమైన విషయం!"

## ప్రకరణం 8.

# జర్మనీలో శాసనబద్ధవిప్లవాలు.

1848 నాటివిప్లవాలలో అభివృద్ధి నిరోధకులు జయించిన కారణంచేత కార్మిక వర్గాలు రాజకీయ హక్కులేమీ సాధించుకోలేక పోయాయి.

కాని స్వల్పసంపత్తిపరుల ఊగులాటలు, మోసం; పెట్టుబడిదారులతో తాము జరిపే పోరాటంలో తమవర్గంవారంతా స్వశక్తిపై ఆధారపడితేగాని విజయం సాధించడం సాధ్యంకాదనే విషయం మొదలైన విలువైనపాఠాలు కొన్ని యీ తిరుగుబాటు సమయంలో కార్మికులు నేర్చుకున్నారు. యూరోప్ తరువాతి చరిత్ర చూచినట్లయితే యూరోపియన్ కార్మిక వర్గాలన్నీ యీపాఠాన్ని పూర్తిగా నేర్చుకోలేదని తెలుస్తుంది. కాని కార్మికులలో చైతన్యవంతమైన భాగం మాత్రం యీపాఠాన్ని బాగానేర్చుకొని, విప్లవ

నాయకులవల్ల జరిగిన నష్టాన్ని ఎవరు గమనించిపోగానే మరింతధైర్యంతో ఉగ్రపోరాటాలు సాగించ వాదించింది.

1849, మే లో జర్మన్ రాష్ట్రంలోని ఒక భాగంలో తిరుగుబాటు ప్రారంభమైందని విని దానితోనే ఎంగెల్స్ తిరుగుబాటుకు కేంద్రస్థానమైన ఎల్బర్‌ఫెల్డుకు చేరుకున్నాడు. కాని చిన్న పెట్టుబడిదారులు విద్రోహానికి గడంగటం వల్ల తిరుగుబాటు త్వరలోనే అణగిపోయింది. 'న్యూ రీనిష్ జీటుంగ్' కూడ అణచివేయబడింది. దానితో ఎంగెల్స్ కొంతకాలం రహస్యంగా కొలోన్‌లో గడిపి, జర్మన్ సామ్రాజ్యాన్ని ఒకే రాజ్యంగా కావాలనే వివాదంతో బేడెన్‌తో పాటు తిరుగబడిన పలాటినేట్‌కు చేరుకుని అక్కడ ఒక వాలంటీరు దళంలో ఉపనాయకుడుగా చేరాడు. కాని యీతిరుగుబాటు కూడ నాయకత్వం వహించిన చిన్నపెట్టుబడిదారీ సంస్థకు చెందిన దక్షిణ జర్మన్ డెమాక్రాట్ల మోసంవల్ల, నాయకుల అసమర్థ నాయకత్వంవల్ల నీరుగారిపోయి, ఎంగెల్స్ వర్ణించినట్లుగా రక్తపుటేరుల్లో ముంచెత్తబడింది. ఎంగెల్స్ కార్మికులతో దక్షిణం వరకు కలిసిపోరాడి, యికనేమాత్రం లాభంలేదని తేలిపోయాక ఆఖరికి స్విట్జర్లాండు చేరుకున్నాడు.

ఎంగెల్స్ చేరుకున్న మరుసటి దినమే కానన్ని రోజులుగా జాబులు వ్రాయనందుకు కారణము, తిరుగుబాటుక్రమము తెలియజేస్తూ మార్క్సుకు సవివరమైన ఒకజాబువ్రాశాడు. అందులో మొదటనాసి తిరుగుబాటులో చేరాలని అనుకోక పోయినప్పటికీ ప్రష్యన్లు ప్రవేశించారని యిప్పుడైతే తెలిసిందో అప్పుడింక అక్కడే తానుకూడ కార్మిక శ్రేణిలో చేరిపోయానని వ్రాశాడు. తిరుగుబాటు వల్ల తనకంత గొప్పఅభిప్రాయం లేకపోయినప్పటికీ 'న్యూ రీనిష్‌జీటుంగ్' తరఫున కనీసం నాలుగైదా పెద్దాన్నందుకు సంతోషిస్తున్నానని, లేకపోతే 'ప్రజాతంత్రవాదులు' తమకు పోరాటంలో పాల్గొనని పిరికిపందలుగా చిత్రిస్తూ ప్రచారం సాగించియుండే వారనివ్రాస్తూ, మార్క్సు క్షేమాన్ని గూర్చి ఆందోళనపడుతూ యీవిధంగా వ్రాశాడు. "మార్క్సు క్షేమ సమాచారం తెలియకపోవటమన్నదెంత భారంగావుంది! ఆర్మీలో యిమిడియుండకపోతే, ముఖ్యంగా పారిస్‌లోవున్న మార్క్సువారం

కై యిరువైపులా దూసుకుపోతూన్న ప్రష్యన్ తుపాకి గుండ్లమధ్యనుండ చేసి సురక్షిత ప్రదేశంలో వున్నానని అనేక మార్లనుకున్నాను. మీ క్షేమ సమాచారం వెంటనే తెలిపి నామనోభారాన్ని తీర్చుతారని ఆశిస్తున్నాను.”

దీనికి మార్క్సు జవాబిస్తూ ఎంగెల్సును గురించి తానెంతటం దోళన పడ్డదీ, అతని జాబుచూచి ఏవిధంగా పరమానంద భరితుడైనదీ తెలియజేసి యీతిరుగుబాటును గురించి చరిత్రరూపంలోగాని, కరపత్రరూపంలోగాని వ్రాయమని ప్రోత్సహించినాడు.

1849 ఆగష్టులో మార్క్సు పారిస్‌లో వుండరాదని నిషేధింపబడగానే లండన్ వెళ్ళాలని నిర్ణయించుకుని, ఎంగెల్సు స్విట్జర్లెండులో వున్నట్లయితే ఏనాడైనా ప్రష్యన్ల చేతులో చిక్కే ప్రమాదముందనీ, పైగా తామిద్దరూ లండన్‌లోనే వున్నట్లయితే కలిసి కొండంత పనిచేయవచ్చునని ఉద్దేశంతో ఎంగెల్సును కూడ తప్పక లండన్ రమ్మని మార్క్సు ప్రోత్సహించాడు. ఆప్రోత్సాహ ఫలితంగానే మార్క్సుతో పాటు ఎంగెల్సు లండన్ చేరుకున్నాడు.

## ప్రకరణం 9.

# ప్రజాతంత్ర కాందిశీకులపోరాటప్రథమలు.

లండన్ చేరుకోగానే వారిద్దరూ సిద్ధాంత, కార్యరంగాల్లో తీవ్రంగా పాల్గొనారంభించి మొట్టమొదట అంతర్జాతీయ కమ్యూనిస్టుసమితిని ఉద్ధరించి, సాధ్యమైనంత వ్యాపింపచేయాలని చూసుకున్నారు. కాని ఆకాలంలో ప్రతికూలశక్తి బలం హెచ్చుగా వుండటంవల్ల, లండన్ లోగల అనేకమంది కాందిశీకులకు వారిబోధలేమీ తలకెక్కలేదు. కాగా వెంటనే సాయుధ తిరుగుబాటుకు పిలుపివ్వటం వ్యర్థమని తేలిపోయింది.

వారు ‘సమీక్ష’ అనే మాసపత్రికను స్థాపించి, హాంబర్గులో ప్రచురించ సారంభించారు. అందులో వారు కాలిఫోర్నియా బంగారు గనులు బయటపడి. విస్తారమైన అగమలతలవ వృద్ధిచెందిన ప్రపంచఉత్పత్తి, వ్యాపారాభివృద్ధియే ఫ్రెంచి విప్లవ వైఫల్యానికి కారణమని, 1847 నాటి ప్రపంచ

వ్యాపార సంక్షోభమే విధంగా విప్లవానికి దారితీసిందో అదేవిధంగా కాలిఫోర్నియా బంగారు గనులు కనుగొనబడటం వలన వచ్చిన పారిశ్రామికవృద్ధి ప్రాభవాలు విప్లవ ప్రతికూలశక్తుల విజయానికి దారితీశాయనీ, అందుచేత అదను విప్లవానికి కాక ప్రచారానికి, ప్రజలను చైతన్యవంతులను చెయ్యటానికి మాత్రమే తగినదనీ వారు వివరించారు.

వారి 'సమీక్ష' యొక్క అయిదారు సంచికల్లో 1840-49 మధ్య సంభవించిన రాజకీయ, ఆర్థిక ఘటనలను సింహావలోకనం చేస్తూ 1847 నాటి ఆర్థిక దుస్థితి తర్వాత సుభిక్ష దశ ప్రారంభమైందనీ, అది 1850 నాటికింకా పారాన్ని ముట్టలేదనీ వ్రాశారు. “డచ్చి వలస రాజ్యాల స్థాపన వల్ల, పసిఫిక్ మహాసముద్రంపై నూతన మార్గాలు కనుగొనబడే అవకాశాలు వృద్ధిచెందటంవల్ల, 1851 నాటిగొప్ప పారిశ్రామిక ప్రదర్శనంవల్ల ఇంగ్లండు భాగ్యం మరింత వృద్ధిచెందుతుంది............ఏ కేంద్రీకృత శక్తిసాధనంతో ఆధునిక భారీ పరిశ్రమ జాతులమధ్య అడ్డుగోడలను పడగొట్టి, ఉత్పత్తిలో స్థానిక ప్రత్యేకతలను, సాంఘిక సంబంధాలను, జాతుల ప్రత్యేకతలను రూపుమాపుతుందో ఆకేంద్రీకృత శక్తికి యీ పారిశ్రామిక ప్రదర్శన ఒక ప్రత్యక్ష నిదర్శనం.........”

ఇంగ్లండు విశ్వోన్నతి ప్రాభవం యూరప్ ఖండమంతా కూడ ప్రసరిస్తుందని వేరే చెప్పనక్కర్లేదు. “పెట్టుబడిదారీ సమాజపు హద్దుల్లోసాధ్యమైనంత అధికంగాను ఉత్పత్తిశక్తులు అభివృద్ధిచెంది, తత్ఫలితంగా విస్తారంగా వ్యాప్తిచెందిన సుఖ సౌభాగ్యాలమధ్య విప్లవాగమనావకాశమే లేదు. ఆధునిక ఉత్పత్తిశక్తులు, పెట్టుబడిదారీ ఉత్పత్తి పద్ధతులనే శక్తులమధ్య యెప్పుడెప్పుడైతే వైరుధ్య మేర్పడుతుందో ఆదశల్లో మాత్రమే విప్లవంవచ్చే అవకాశం కలుగుతుంది. అధికారంలో గల పార్టీలోకూడ వారివారిమధ్య గల పరస్పరవిరుద్ధమైన పెట్టుబడిదారీ సంబంధాలవల్లనే చీలికలు, విభేదాలు వస్తూంటాయి. ఇట్టిపరిస్థితుల్లో అభివృద్ధి నిరోధక శక్తులను అధికారంలో వుంచటానికి పెట్టుబడిదారులుపడే తాపత్రయమంతా ప్రజాతంత్రవాదులనైతిక కోపతాపప్రకటన, ఉన్నత నినాదాలవలెనే విఫలమై పోతుంది. క్రొత్తగా వచ్చే ఆర్థికసంక్షోభ ఫలితంగా మాత్రమే మరలవిప్లవంవచ్చే అవకా

తముంది. అరెండూ ఎల్లాగూ రాక తప్పవు.

తమ సమీక్ష చివరి భాగంలో వారు, తమంతటతామొక కేంద్రసం ఘంగా చెప్పడి, వేర్వేరు నాయకుల మధ్యగల చీలికలు, వైషమ్యవిభేదాలే విప్లవ వైఫల్యానికి కారణమని అతిసులభంగా తేల్చివేసి, యూరపియన్ కాందిశీకులందర్నీ ఒకే జెండాక్రింద ఏకంకమ్మని కోరిన, లెడ్రూరోలిన్ రూజ్, డారజ్ లిచ్చిన పిలుపును నిర్దాక్షిణ్యంగా విమర్శించి, దానిలోని అవకతవకలను బట్టబయలు చేశారు'

వీరి యీవాదం పూర్తిగా సంకుచితత్వ ఫలితమని, ఏకొద్దిమంది అత్యుత్సాహంలో వారి కిష్టమైన సమయంలో, విధానంలో విప్లవాన్ని కొని వస్తామనే పెట్టుబడిదారీ భావవాదులు చేసే తలక్రిందులు వాదమని, అదియెన్నటికీ సాగదని మార్క్స్, ఎంగెల్సులు గట్టిగా వాదించారు.

ఈసమీక్షలోనే పదిగంటల చట్టం, జర్మన్ రైతు పోరాటం మొదలైన సమస్యలపై ఎంగెల్సు అనేకవ్యాసాలను వ్రాశాడు. భౌతికవాద దృష్టిలో చరిత్రను పరిశీలించి పెట్టుబడిదారీ సమాజానికి పూర్వమున్న సామాజిక సంబంధాలచరిత్రను వర్ణించిన గ్రంథాలలో తరువాత కరపత్ర రూపంలో ప్రకటింపబడిన యీజర్మన్ రైతుల పోరాటచరిత్రయే మొదటిది.

ఇష్టమైన సమయంలోను, రూపంలోను విప్లవం లేవదీయటం సంభవం కాదనే మార్క్స్, ఎంగెల్సుల అభిప్రాయం, అంతర్జాతీయ కమ్యూనిస్టు సమితి సభ్యులలో అనేకచీలికలకు కారణమయింది. పాతసభ్యులలో షాపర్, విలిచ్‌లు తప్ప ఎక్కారియస్, ప్ఫేండర్, సీలర్, ఫ్రెలిగ్రాత్, ఫెర్డినాండ్, బోర్ మొదలయినవారంతా మార్క్స్, ఎంగెల్సులనే అనుసరించారు. ఇంకనూతన సభ్యులలో ఎక్కడో విల్ హెల్మ్, లీబ్ నెక్ట్, కాన్ రాడ్, ష్రామ్ వంటివారు తప్ప మిగతవారంతా వారికి వ్యతిరేకులైన కాందిశీకుల మూకలో చేరిపోయారు.

**1850** సెప్టెంబరులో జరిగిన కేంద్ర కార్యనిర్వాహక సమావేశంలో యీవిభేదాలు మరింత తీవ్రమయాయి. అందులో అధికసంఖ్యాకులు మార్క్స్, ఎంగెల్సుల వాదాన్ని అంగీకరించినప్పటికీ రెండుపక్షాల మధ్య రాజీ కుదరటం మాత్రం అసంభవమని తేలిపోయింది. దీని ఫలితంగా కొంతకా

లం పాటు మార్క్సు, ఎంగెల్సులు ప్రత్యక్ష కార్యాచరణలో హెచ్చుగా పాల్గొనటం మానివేసి సిద్ధాంతరంగంలోకి నిష్క్రమించారు.

## ప్రకరణం 10.

# తిరిగి మాంఛెస్టరుకు

ఎంగెల్సు తండ్రికి ఆంగ్ల విప్లవోద్యమంలో మునిగి తేలుచున్న ఎంగెల్సునుచూచి ఒళ్లంతా తేళ్లూ, జెర్రులూ ప్రాకినట్లుకాగా ఎంగెల్సును తిరిగి రమ్మనీ, కలిస్తాంలో ఉద్యోగ మిస్తాననీ వ్రాశాడు. ఎంగెల్సు ఉద్యోగ స్వీకారాని కంగీకరించలేదని వేరేచెప్ప నక్కర్లేదను కుంటాను. కాని తాను బ్రతుకు తెరువుగా అవలంబించ దలచుకున్న పత్రికా రచనావృత్తిలో తన పొట్టకూటికి కటాకటిగా సరిపోయే దానికన్న హెచ్చుగా సంపాదించటం కలలోనిమాట అనేవిషయం మాత్రం ఆయన గుర్తించాడు.

పోనీ మార్క్సు చూద్దామా అంటే భార్య, ముగ్గురుబిడ్డలుగల సంసారశకటాన్ని తనరచనవల్ల సంపాదించిన సొమ్ముతో యీడ్వలేక యిబ్బందిపడుతున్నాడు. పారిస్‌లో మార్క్సుతో కలిగినగాఢపరిచయ కాలంలో అమానీయుని మహాద్భుత మేధాశక్తిని గుర్తించిన ఎంగెల్సుకు ఆయనమేధాశక్తి, విలువైన సమయమూ స్వల్పవిషయ సంబంధమైన రచనలతో వ్యర్థమై పోతుంటే చూస్తూ ఊరుకోవటానికిష్టం లేకపోయింది. ఈపరిస్థితుల్లో తీవ్రంగా ఆలోచించి తాను స్వంత అవసరాలకు, మార్క్సు కుటుంబ పోషణకూ సరిపడేటంత సంపాదించాలనీ, మరి ఆర్థిక, తాత్విక రంగాలలో తమయిద్దరి సంయుక్త భావాలను శాస్త్రీయసిద్ధాంతాలుగా ఆయన అభివృద్ధి పరచాలనీ నిర్ణయించుకున్నాడు.

ఈనిర్ణయ ఫలితంగానే వ్యాపారమంటే తనకుతీరని అసహ్యమైనా 1850 లో మాంఛెస్టరుకు తిరిగి వెళ్ళి తనతండ్రి వ్యాపారంలో చేరనంగీకరించి 'ఎర్మన్ అండ్ ఎంగెల్సు' నూలుమిల్లులో గుమాస్తాగా ప్రవేశించాడు. 1850 డిసెంబరులో తమబిడ్డ మరణంపట్ల ఎంగెల్సు సానుభూతి తెలిపి

వందుకు తనసంతోషాన్ని వెలిబుచ్చుతూ, ఆజాబు తన మనోశాంతికి ఎంతగానో తోడ్పడిందని తెలియచేస్తూ మార్క్సు సతీమణి యీవిధంగా వ్రాసింది.

మాకందరికీ నీవు మాతో లేని కొరత బాగా కనిపిస్తూన్నప్పటికీ, తరచు నీవు మాతో కలిసివుంటే బాగుండుననే కోర్కె కలుగుతున్నప్పటికీ నువ్వొక గొప్ప నూలుమిల్లు యజమానివై పోతోన్నందుకు చాలసంతోషం!......" తాను లేకపోతే తనతండ్రి! గడవని పరిస్థితి లేర్పరచమని సలహాయిచ్చి ఆమె యింకా యిలా వ్రాసింది. "నాఊహా పథాల్లో నీవప్పుడే నీతండ్రితో వ్యాపారంలో భాగస్తుడవై పోయినట్లూ, నూలువ్యాపారంలో ప్రవేశించినప్పటికీ నీవుపూర్వపు ఫ్రిడ్రిగానే వున్నట్లూ........పవిత్రస్వాతంత్ర్య దర్శానికి విముఖుడవు కానట్లూ అనిపిస్తూంటుంది.........బిడ్డలందరూ ఎంగెల్సు బాబయ్యను తరుచు తల్చుకుంటూనే వున్నారు. ముఖ్యంగా చంటిపాపాయి నీవు నేర్పిన పాటను విసుగూ విరామం లేకుండా ఊదరగొట్టి మాచెవ్వులనున్న తుప్పురాలగొట్టేస్తోంది!..........."

అప్పటినుండి యిరవైయేళ్లపాటు మార్క్సు, ఎంగెల్సులు మధ్యమధ్య ఎప్పుడో కలుసుకోటం తప్ప కలిసివుండలేదు, కానైతే, వారు మానసికంగా యెంత సన్నిహితులుగా వుండేవారో తెల్సుకోటానికి వారిమధ్య ఉత్తరప్రత్యుత్తరాలు జరుగని రోజులు చాల స్వల్పమని చెప్తే చాలనుకుంటాను. ఆర్థిక, తాత్విక శాస్త్ర విషయకమైన యేదైనాభావం వారిలో యెవరికైనా తట్టినవెంటనే దానివిషయంలో రెండవవారి అభిప్రాయం, సలహా, వారికి తెలిసిన యితర వివరాలను గురించి వెంటనేవ్రాసి తెల్సుకునేవారు.

మాంచెస్టరు నివాసకాలంలో ఎంగెల్సు వ్యాపారంతో సరిపెట్టక సైనికచరిత్ర, విజ్ఞానశాస్త్ర విషయాలలో తన పరిశోధన కొనసాగించాడు. వివిధభాషల తత్వశాస్త్రాన్నీ, ప్రకృతిశాస్త్రాలనూ కూడ మధించాడు. 1862 మార్చిలో తన రష్యన్ భాషా పఠనాన్ని గురించి వ్రాస్తూ, స్లావ్ సమస్యపై తానప్పుడుచేస్తూన్న పరిశోధనకు చాలినంత సమయం చిక్కటంలేదని అసంతృప్తిని వెల్లడించాడు. ఎర్నెస్టు జోన్స్ పేపరుకు యింకా హెచ్చుగా వ్యాసాలు పంపాలనే వున్నప్పటికీ. రోజల్లా ఆఫీసులో పనిచేసి, తనతండ్రికి వారసుని వెదుకంపి, ట్రిబ్యూన్ పత్రికకు వ్యాససంపుటి వెడిమేయర్ పత్రి

తను మూరు వారంవారం వ్యాసాలు పంపేసరికి తాతలు దిగివస్తున్నారు. కానీ కొంతకాలాన్ని తప్పక స్లావ్ సమస్యా పరిష్కారానికి ప్రత్యేకించాలి.

గత పదునాల్గు రోజులూ రష్యన్ భాషతో కుస్తీపట్టి వ్యాకరణాన్ని చాలమటుకు లొంగదీశాను. ఇంగ్లాండులో రెండుమూడు నెలలు కృషిచేస్తే పదజాలం చాలమటుకు వశమౌతుంది. దానితో యింకొక పనిలో ప్రవేశించవచ్చు. యీయేడాదిలో స్లావ్ భాషలన్నీ నేర్చుకోవాలి; నిజానికి అవిఏమంత యినుప గుగ్గిళ్ళుకావు కూడా' ఈసమస్యయొక్క లోతుపాతులను తెలుసుకోవాలనే గాఢవాంఛయే కాక మనిద్దరిలో యెవరో ఒకరు యే జాతులతోనైతే మనకు ప్రత్యక్ష విభేదాలు వస్తాయో ఆజాతుల భాషలు, చరిత్ర, సాహిత్యం సాంఘిక వ్యవస్థా వివరాలు తప్పక తెలుసుకుని వుండాలని కూడనాఅభిప్రాయం........ఈవిషయంలో చూడు, మనకెవ్వరికీ రష్యన్ భాషరాకపోవటంవల్లనేకదా ఒకునిన్ కా స్వల్ప ప్రాధాన్యతైనా? స్లావ్ రాజ్యాలలోని పురాతన సాముదాయిక యాజమాన్యాన్ని కమ్యూనిజంగా మార్చవచ్చునని, రష్యన్ రైతులుపుట్టుకతోనే కమ్యూనిస్టులనీ మొదలైన భ్రమలన్నీ ప్రజలలో విరివిగా ప్రచారం చెయ్యటానికి వారికి అవకాశం కలుగుతుంది.”

1859 ఇటాలియన్ యుద్ధకాలంలో ఎంగెల్సు “పోనది, రైనది” అనే కరపత్రాన్నొకదాన్ని రచించి ప్రకటించాడు. దానివ్రాత ప్రతినిచూచి మార్క్సు చాల మెచ్చుకొని, “ఎవరో గొప్ప సేనాని” వ్రాశాడనే భావం కల్పించటానికని అనామకంగా ప్రకటించమని సలహాయిచ్చాడు. అది అవిధంగా అనామకంగానే ప్రకటించబడింది. తర్వాత 1861 లో జర్మనీ వెళ్ళిన సందర్భంలో మార్క్సు, ఎంగెల్సుకు వ్రాస్తూ అక్కడవున్నత సైనికవర్గాలలో ఆవిధమైన భావమేకల్గిందని వ్రాశాడు.

ఇటాలియన్ యుద్ధానంతరం “సావోయ్, నీస్, రైను” అనేమరొక కరపత్రాన్ని ఎంగెల్సు రచించాడు. ఆయన 1865 లో “ప్రష్యా మిలటరీ సమస్య, జర్మన్ లేబరుపార్టీ” అనేకరపత్రంలో ఎంగెల్సుయొక్క, రాడికల్సుయొక్క అసమర్థతను, అనిష్టాన్నీ తీవ్రంగా దుయ్యబట్టి యితర ముఖ్య సమస్యలన్నిటివిషయంలో వలెనే ప్రష్యన్ మిలటరీ సమస్యా పరిష్కారా

న్ని కూడ ఒక్క కార్మికవర్గపార్టీ మాత్రమే చేయగలదని పేర్కొన్నాడు.

1864-66 మధ్య కాలంలో యింగ్లండులోను, యితరయూరపియన్ దేశాలలోను కార్మికోద్యమం తిరిగి తలయెత్త నారంభించింది. తత్ఫలితంగానే 1864 లో అంతర్జాతీయ కార్మికసంఘం యేర్పడింది. యీసంఘానికి మార్క్సు సిద్ధాంత విషయాలలో నాయకుడైనప్పటికీ ఎంగెల్సు దానిఅభివృద్ధికొరకై చేసినసేవకూడ అల్పమైనదికాదు.

## ప్రకరణం 11.

# మార్క్సుపట్ల భక్త్యనురాగాలు

ఎంగెల్సు తండ్రి 1860 లో మృతిచెందటంతో 1864 సెప్టెంబరులో మిల్లులో ఎంగెల్సు పాటాదారుడయినాడు. దీనితో ఎంగెల్సుకు పని, బాధ్యతలు, బాదరబందీలు పెరిగాయి. ఎంగెల్సు 1860 మే లో మార్క్సుకువ్రాసిన వుత్తరంలో సమయం వచ్చినప్పుడు ఎర్మెన్ గారు "వదిలించుకున్నామురా బాబూ" అని సంతోషంగా నన్ను ఒడంబడిక నుండి విముక్తుణ్ణి చేసేటంత భారంగా తయారవటానికి ప్రయత్నిస్తున్నాను అని వ్రాశాడు. దీన్నిబట్టి ఆయన వ్యాపారం పట్ల యెంతవిముఖుడైనదీ, వ్యాపారంలోనే శాశ్వతంగా వుండిపోవాలని ఆయనకు లేదని మనకుబోధపడుతుంది. ఆదశలో ఆదాయం మాత్రం పెరిగింది. మార్క్సుకు, ఎంగెల్సుకూ ముఖ్యంగా కావలసినదదేకదా?

మాంచెస్టరు మాలుమిల్లులో పనిచేసిన కాలమంతలోనూ ఎంగెల్సు మానసికంగా యెంత అసంతృప్తి, బాధలకు లోనయేవాడో. ఆవిషయంలో మార్క్సు, అభిప్రాయ మేమిటో యీక్రింద వుదహరింపబడిన లేఖాభాగాలవల్ల బాగా తెలుస్తుంది.

1869 లో ఒడంబడిక అంతమైపోవటంతో, పరిస్థితులనుబట్టి వ్యాపారము నుండి విరమించుకోటానికి వుంటుందనీ, పోనీతిరిగి తాను స్వంతముగా యేదైనా వ్యాపారంచెయ్యటం విషయంలో తనకేమాత్రం యిష్టంలేదనీ, ఎంగెల్సువ్రాశాడు. "ఈచచ్చు వ్యాపారంనుండి, బయటపడటం కన్న నే

ద గొప్పలేమీ లేదు నాకు. దీనివల్ల కాలం వృథా కావట మొక్కటే కాకుండా, నన్ను పూర్తిగా నిర్వీర్యుణ్ణి చేసేస్తోందిది. దీనిలో యిరుక్కుని వున్నంతకాలం యింకేపనికీ పనికిరాకుండా పోతున్నాను. అందులోనూ, వాటి దారుణ్ణయిన బాధ్యతలు పెరగటంవల్ల మరింత అధ్వానంగావుంది. ఆదాయం హెచ్చుగావస్తుంది. కనుక గానిలేకపోతే గుమాస్తాగా వుండటం కొయ్యార ట్లు తోలనిపిస్తోంది"

వ్యాపారజీవితం రెండేండ్లలో విరమించుకుంటే అప్పటికి మార్క్సు విషయ, మెల్లాగా అనేదే ఎంగెల్సు నెమర్కున్న తీవ్రసమస్య. మార్క్సు తనరచనలవల్ల కీర్తికాక డబ్బునకూడ హెచ్చుగా సంపాదించలేకపోతాడా (యీలోగా విప్లవమేవచ్చి ఆర్థిక ఇక్కట్లన్నీ పరిష్కరింపబడకపోయినా") అనే ఆశతో ఎంగెల్సు సమాధానం చేసుకునేవాడు.

తనకోసమై ఎంగెల్సు చేస్తున్న అపారమైన త్యాగాన్ని మార్క్సు విస్మరించేవాడుగా గుర్తించాడని చెప్పవచ్చును. ఒక ఏడాదిలో ఆర్థికంగా తనకాళ్లపై తాను నిలవడ గలుగుతానని ఆశిస్తున్నను, నమ్మకాన్ని (అది తరాత ఫలించనేలేదనుకోండి) మార్క్సు తెలుపుతూ ఎంగెల్సుకు వ్రాశాడు. "నీ సహాయమే లేకపోతే 'పెట్టుబడి' గ్రంధాన్ని నేను పూర్తిచేయగలిగేవాడిని కాదు. ముఖ్యంగా నాకోసం కదా నీ అద్భుతశక్తులన్నీ వృథాగాపోతున్నాయి; నీకుమాత్రం యిష్టంలేని వ్యాపార రంగంలో చిక్కిపోతున్నావనే చింతాభారం నన్ను నిరంతరం కృంగదీస్తోంది."

1865 నాటి కప్పుడే అప్పులు మొదలైన ఆర్థిక కష్టాలను నివరించి (ఎంగెల్సు యెప్పటికలనే తాను చేయగలిగిన సహాయమంతా చేశాడు). ఇతరులపై ఆధారపడే తన అసమర్థ పరిస్థితిపట్ల అసంతృప్తి వెల్లడిస్తూ మార్క్సు యిట్లా వ్రాశాడు. "మనిద్దరం భాగస్వాములుగా వుండే వ్యాపారంలో పార్టీ సిద్ధాంతపరంగా, కార్యాచరణ భాగం నామైపడిందని సరిపెట్టుకున్నప్పటికీ తప్ప నాకసలు భారమెంత్రం తగ్గటంలేదు." ఈ విషయం నిజమైనట టో సందేహమేమాత్రంలేదు. మహామేధావియైన మార్క్సు కారణంగా ఎంగెల్సు తమపార్టీ, ఆశయాలను ముందుకు నడిపించటానికి హెచ్చుగా స్వేచ్ఛనిచ్చి కీర్తి సాఫల్యాలను త్యాగంచేశాడని గుర్తించుకోవాలి.

అంతేకాక 1851 లో 'న్యూయార్క్ ట్రిబ్యూన్' పత్రికకు వ్యాసాలు వ్రాయమని మార్క్సుకు ఆహ్వానం వచ్చినప్పుడు కూడ అప్పటికింకా ఆయన ఇంగ్లీషుభాష బాగా రాకపోవుటవల్ల ఎంగెల్సు మార్క్సు వ్రాసిన వ్యాసాలను ఆంగ్లీకరించియు, యితర అనేక విధాల సహాయభూతుడుగా వుండేవాడు. మార్క్సుకు తీరిక చిక్కనప్పుడు గాని, ఆరోగ్యం సరిగా లేనప్పుడు గాని, వ్యాసం వ్రాయవలసిన సమస్య మిలిటరీదైనప్పుడుగాని ఎంగెల్సుకు హెచ్చుగా ప్రవేశంగల సమస్యలైనప్పుడుగాని ఆ వ్యాసాలెంగెల్సే వ్రాసేవాడు. సర్వసాధారణంగా తన ఆఫీసు పని, యితర గ్రంథ రచనలకు తోడు వారానికి ఒకటి రెండు వ్యాసాలు తప్పక ఎంగెల్సు వ్రాసి మార్క్సు పేరట ట్రిబ్యూన్‌కు పంపేవాడు. మార్క్సు, ఎంగెల్సుల్లో యెవరు వ్రాసినప్పటికీ— ఎప్పటివలెనే డబ్బు స్వల్పంగానే వచ్చినా—వాటి విలువ మటుకు అధికంగానే వుండేది.

మార్క్సు 1854, జనవరి 5 నాడు ఎంగెల్సుకు జాబువ్రాస్తూ ఆయన వ్రాసిన వ్యాసాలు (1853 నవంబరు 15, డిసెంబరు 16 తేదీలలో క్రిమియా యుద్ధంపై 'ట్రిబ్యూన్' లో ప్రధాన వ్యాసాలుగా ప్రకటింపబడిన వ్యాసాలు) "గొప్ప అలజడి కలిగించాయని, జనరల్ స్కాట్ (అమెరికాలో గొప్ప మిలటరీశాస్త్రవేత్త) చే వ్రాయబడినట్లుగా తలచబడుతున్నాయని" వ్రాశాడు.

1854 వ సంవత్సరంలో కొద్దికాలం పాటు 'డైలీన్యూస్' పత్రికా కార్యాలయంలో మంచిజీతంతో ఉద్యోగం వస్తుందనే ఆశతో ఎంగెల్సు కూపారుగా వ్యాపారజీవితానికి స్వస్తివాచకం చెప్పి లండన్ తిరిగి వచ్చే ప్రయత్నాలు చేసినట్లు కనపిస్తుంది. కాని దురదృష్టవశాత్తూ యీ ప్రయత్నాలేవీ ఫలితానికి రాకపోయేసరికి తనకి కుదరామూ యిష్టంలేని వ్యాపారంలోనే ఎంగెల్సు వుండిపోవలసివచ్చింది.

1855 ప్రథమ భాగంలో మార్క్సు యొక్క ఒకే ఒక కొడుకు చనిపోయాడు. ఆ కుర్రవాడెంత తెలివైనవాడో అంత అర్భకంగా వుండేవాడు. ఆ సందర్భంలో ఎంగెల్సుకు జాబువ్రాస్తూ మార్క్సు యీవిధంగా వ్రాశాడు. "బిడ్డపట్ల నీవుచూపిన సానుభూతికీ, నాకోసమై నీవు స్నేహపూర్వకంగా తీసుకొనే విశేష శ్రమకీ కృతజ్ఞత యేవిధంగా తెలియజెయ్యాలో నాకు

పాలుపోవటంలేదు.''

ఏప్రిల్ 6-వ తేదీన గిడ్డ చనిపోయాడు. మార్క్సు యిలా వ్రాశాడు. ''ఎడ్గార్ బాబు మమ్మల్ని శాశ్వతంగా వీడిపోయాడు............ఈకష్ట కాలం తరలించటానికి నీప్రగాఢస్నేహ మెంతగా తోడ్పడిందో యీజీవితంలో మరచిపోలేను........'' ఒకవారంరోజులు గడిచాక మరల యిలా వ్రాశాడు. ''ఎడ్గార్ చిలిపిచేష్టలతోను, అల్లరి ఆగాములతోను కలకలలాడుతుంటే యిల్లిప్పుడు కళావిహీనంగా వుంది. ఏదిచూసినా, చేసినా ఎడ్గారే జ్ఞాపకం వస్తున్నాడు అన్నిరకాల కష్టాలు నేననుభవించాను కాని, అసలైన కష్టమంటే యేమిటో యిప్పుడే నాకర్థమైంది. నామనస్సు బొత్తిగా వికలమైపోయింది............ఈకష్టసమయమంతలోను. నువ్వూ నీస్నేహమూ, యీప్రపంచంలో నువ్వూ, నేను కలిసి చేయవలసినవెన్నో విశిష్టకార్యాలింకా వున్నాయనే భావాలే నామనస్సును దిటవుపరచాయి.''

1857 లో ఎంగెల్సు మూంసగ్రంధి సంబంధమైన తీవ్రవ్యాధితో బాధపడినట్లు తెలుస్తుంది. ఆరోజుల్లో పేదరికంతోను, తనభార్య జబ్బు మొదలైన యితరయిబ్బందులతోను మార్క్సు చాల బాధపడ్డాడు. ఎప్పటివలెనే ఎంగెల్సు వారికి తనచేతనైనంత సాయమూ చేశాడు. కాని తనప్రియమిత్రుని అనారోగ్యకారణంగా మార్క్సు చాల ఆందోళనపడుతూ యీవిధంగా వ్రాశాడు ''మాకష్టాల మాట అటుంచి, నీఅనారోగ్యవిషయమే నాభార్యాబిడ్డల్నిద్దరిని విపరీతంగా బాధిస్తోంది.''

కుర్రతనంగా మంకుపట్టుపట్టక ఉద్యోగం. 'ట్రిబ్యూన్' కు వ్యాసరచన అన్నీ కట్టిపెట్టివేసి వెంటనే సముద్ర తీరానికి వెళ్ళిపోయి జబ్బు నయం చేసుకొమ్మని మార్క్సు గట్టిగా ఎంగెల్సు వొత్తిడిచేశాడు. మార్క్సు సలహానుసరించి ఎంగెల్సు సముద్రతీరానికి వెళ్లినా వ్యాసాలు వ్రాసి మార్క్సుకుపంపుట మానలేదు! ఎంగెల్సు మధు పానంలో ఉద్దండుడు. అందుచేతనే మార్క్సు గృహంలో యేమీలోటుగా వున్నా మధుపానీయాల లోటుమాత్రం కలుగనిచ్చేవాడుకాదు. సముద్రతీరానికి వెళ్లేముందుకూడా ద్రాక్ష సారాయిందండిగా మార్క్సుకు పంపి మరీవెళ్లాడు

ఎంగెల్సు జబ్బువిషయంలో మార్క్సు '' ఫ్రెంచి, ఆంగ్ల, జర్మన్,

సైన్యశాస్త్ర సంబంధమైన అతినవీనగ్రంథాలన్నీ" శ్రద్ధగా చదివి లోపాసం బంధమైనమాదు పుష్పగోమని ఎంగెల్సుకు గట్టిగా సలహాయిచ్చాడు ఎంగెల్సు కాడ్ లివర్ తయిల్ గ్రాహస్త్యాన్ని సైన్య పదజాలంలో నిరూపించి, రెండూ మంచివేననీ, రెండూ తీసుకుంటాననీ జవాబిచ్చాడు. దీన్నిబట్టి వారిద్దరూ ఏపనున్నా తీసుకున్నా దాన్ని ఎంతక్షుణ్ణంగా మథించేవారో మనకు బోధపడుతుంది.

మార్క్సు తనప్రధాన గ్రంథమైన 'పెట్టుబడి'ని వ్రాసేటప్పుడు కాలమూ అంతులో తాను ప్రతిపాదించిన ప్రతిసూత్రమునూ, ఎంగెల్సుతో చర్చించటమే కాక, ఉత్పత్తిదారుడు తనపెట్టుబడి నేవిధంగా తరిగణిస్తాడు, తన జమాఖర్చు పుస్తకాలలో ఏ అంశాలక్రింద వివరిస్తాడు మొదలైన విషయాలన్నీ కూడ వ్రాసితెల్సుకొనేవాడు. జీతాల విలువ, అదనపు విలువ మొదలైన విషయాలన్నింటిని గురించీ ఎంగెల్సు తాను స్వయంగా ఉత్పత్తిదారుడు కావటంచేత అవసరమైన విషయ సామాగ్రినంతా వివరంగా మార్క్సుకు పంపేవాడు.

ఎంగెల్సు సలహా, సహాయాలను, విమర్శాభిప్రాయాలను మార్క్సు ఎంతగా పాటించేవాడో యీదిగువ నుదహరింపబడిన కొన్ని లేఖాభాగాలవలన తెలుస్తుంది. ఎంగెల్సుకు "రాజకీయార్థ శాస్త్రంపై విమర్శ"ను గురించి 1859, జూన్ 7-న వ్రాస్తూ మార్క్సిలా అన్నాడు. "ప్రథమ భాగం నీకు నచ్చిందంటే నాకు కలిగిన సంతృప్తి, సంతోషాలింతింత కావు. ఈవిషయంలో నీదే తుదితీర్పుగానే ఎంచుకున్నాను. నీతీర్పు కొరకై నేను చూసిన ఆత్రుత జెన్నీకి చాలతమాషాను, సరదాను కలిగించింది." 1867 జూన్ లో "పెట్టుబడి" వ్రాతప్రతిలోని మరికొన్ని పత్రాలను ఎంగెల్సుకు పంపుతూ అతనిలా వ్రాశాడు. "ఈనాలుగుపేజీలు కూడ నీకు సంతృప్తికరంగా వుంటాయని ఆశిస్తున్నాను. ఈప్రపంచమంతా కలిసి ఏమనుకున్నా అననీ గాక; నీకు నచ్చుటమే నాకు కావలసింది" మార్క్సు రచనలను అవసరమైనచోట్ల ఎంగెల్సు నిర్మొగమాటంగా ఖండిస్తూ విమర్శించేవాడు. మార్క్సు తనుమతప్పక ఆవిమర్శలను వినియోగించుకొని వాటిదృష్టిలోతన రచనలను సరిదిద్దుతుండేవాడు.

1867, ఆగస్టు 16-వ తేదీ నాటికి తనఉద్గ్రంథ ప్రథమభాగాన్ని పూర్తిచేసి మార్క్సు ఆరోజునే ఎంగెల్సుకీవిధంగా వ్రాశాడు:

ప్రియమైన ఫ్రెడరిక్,

చివరిపేజీ యిప్పుడే సరిచూశాను. చిన్నఅచ్చులో వివిధరకాల విలువలను గూర్చిన అనుబంధం 1 1/4 పేజీ లౌతుంది.

నిన్ననే భూమికను సరిచూసి తిరిగిపంపాను. దీనితో మొదటిభాగం పూర్తిఅయిందన్నమాట. ఇప్పటికిది పూర్తికావటానికి నీసహాయమే పూర్తి గా కారణం. నాకోరకై నీవుచేసిన ఆత్మత్యాగ పూరితసహాయం తోడుకాక పోతే మూడుభాగాలకు కావలసిన విస్తారమైన విషయసేకరణ నాకెన్నడూ సాధ్యమయ్యేది కాదు. నీకు నాహృదయ పూర్వకాలింగనాలు.

సరిచూసిన ప్రూఫ్ కాగితాలు రెండూ యిందులో పంపుతున్నాను. నీవుపంపిన 15 పౌనుల సొమ్ముకూ నా సహృదయపూర్వక కృతజ్ఞత. ఇంతే విషయాలు, విశేషాలు. ప్రియమిత్రమా శలవు

ఇట్లు నీ,

కారల్ మార్క్సు"

ఎట్టకేలకు 'పెట్టుబడి' గ్రంథప్రథమ భాగం ప్రచురింపబడ్డాక దానిని చూసీ చూడనట్లు నటనగా ఉపేక్షిద్దామని లోకంచేసిన ప్రయత్నాన్ని కొనసాగకుండాచేసి ప్రచారంలోకి తెచ్చేందుకుగాను, ఎంగెల్సుపడనితంటాలు, చెయ్యని పనీలేదు.

## ప్రకరణం 12.

# మార్క్సు, ఎంగెల్సుల మధ్య తాత్కాలిక వైమనస్యం

1863, జనవరిలో మార్క్సు, ఎంగెల్సుల మధ్య వారిజీవితకాలమంతలోనూ ప్రథమ అంతిమ పర్యాయంగా స్వల్ప వైమనస్యం కలిగింది. వారి ఉభయుల మధ్యగల ప్రగాఢశాశ్వత స్నేహాన్ని నిరూపించే ఆ సంఘటన నిక్కడ వివరిస్తాను.

మాంచెస్టరు నివాస కాలంలో ఎంగెల్సుకు మేరీబరన్సు అనే ఒక ఐరిష్ యువతిలో గాఢ స్నేహమేర్పడగా వారిద్దరూ చాలయేండ్లు సంసార జీవితం గడిపారు. మేరీ చాల అందమైనది. దురదృష్టవశాత్తు 1863, జనవరి 5-వ తేదీనాడు ఎంగెల్సు ఆమెతో గడిపాడు; అప్పటికామె ఆరోగ్యముగానేవున్నది. కాని 6-వ తేదీనాడామె గుండెజబ్బువల్లనో యేమో అకస్మాత్తుగా చనిపోయింది. ఆకస్మిక దుస్సంఘటన ఎంగెల్సును తీవ్రంగా కలచివేసింది కాని యీ దుఃఖవార్తను తెలుపుతూ ఎంగెల్సు వ్రాసిన లేఖకు మార్క్సు జవాబుగా రెండు వాక్యాలలో తన విచారాన్ని వెలిబుచ్చి, మిగిలిన జాబునంతటినీ తన సంసారకష్ట గాథలతో నింపివేశాడు' [illegible]పాటు ఎంగెల్సు జవాబు వ్రాయడం మానుకుని, చివరకు తనకష్టంపట్ల మార్క్సు చూపిన 'అంటీముట్టని' సానుభూతి రహిత పద్ధతిని నిరసిస్తూ "ఒక్క నువ్వు తప్ప నా స్నేహితులు యావన్మందీ, నాకు వ్యతిరేకులైన కుటుంబాలవారు సహితం నేనెన్నడూ ఊహించనంతటి సానుభూతిని తెలిపారం" టూ ఘాటుగా ప్రత్యుత్తరమిచ్చాడు.

మార్క్సు చాలవిచారించి, తనతప్పుకు క్షమించమని కోరుతూ వెంటనే జాబువ్రాశాడు. ఆ కీలక ప్రత్యుత్తరానికి కారణం ఎంగెల్సుకు సంభవించిన దుఃఖంపట్ల సానుభూతి లేకపోవటం కాదని అప్పటి తనకుటుంబస్థితి యింటిలో ప్రవేశించి అప్పులవాళ్ళు యమకింకరుల్లాగ నానాహంగామా చేస్తున్నారనీ, దుస్తులేక యింటిలో తిండిలేదనీ, తనకూతురు జెన్నీకి జబ్బుగా వుందనీ, ఆ పరిస్థితుల్లో ఆందోళనతో, యేమి చెయ్యటానికీ, సహాయార్థమై యొకర్నర్థించటానికీ మనస్సొప్పలేదనీ, తనపొరపాటుకదే కారణమనీ మార్క్సు తెలియజేశాడు.

ఎంగెల్సు వెంటనే క్షమిస్తూ యిలా ప్రత్యుత్తరమిచ్చాడు:

"దాపరికం లేకుండా నీమనస్సును విప్పి చెప్పినందుకు చాల సంతోషం. నీ పూర్వపు జాబు నామనస్సులో యెట్లాంటి దుమారం రేపిందో ఇక నువ్వే "ఊహించుకోగలవనుకుంటాను. ఎల్లాంటి వాడికైనా తను చిరకాలం కలిసి జీవించిన స్త్రీ చనిపోతే కలిగే దుఃఖం స్వల్పంగా వుండదు. ఆమెతో బాటు నా యౌవనపు శేషాన్ని కూడ [illegible] అనిపిస్తుంది నాకు. కాని నీలా

టు వచ్చేసరికి ఆమె యింకా సమాధికూడా చేయబడలేదు. ఇవాళంతా నీలాటి వాడనే వీధుల్లో తిరుగుతూనే వుంటానంటే నమ్ము; దాన్నెంత ప్రయత్నించినా మరువలేక పోయాను. పోనీలే. నా ప్రియురాలు మేరీతో బాటు, చిరకాల ప్రియమిత్రుని కూడా కోల్పోలేను. నాకదే పదివేలు.'' దాని తర్వాత మార్క్సు ఆర్థికయిబ్బంది బాధలను తొలగించటానికి మార్గాలను, విధానాలను ఎంగెల్సు వివరించాడు.

మార్క్సుకూడ అదే ధోరణిలో జవాబిచ్చాడు: ''గత కొన్నివారాలలో నేనుపడ్డ కష్టాలన్నింటికంటె మనయిద్దరి స్నేహమూ యెక్కడ దగ్గమైపోతుందోనని బాధయే నన్ను విపరీతంగా క్రుంగదీసింది. పెట్టుబడిదారీ సమాజంలో సంభవించే కష్టాలు, వాటి కారణంగా కలిగే అసద్దా ఆందోళనలూ అంతటి కష్టసమయంలో నిన్నూరడించ పూనుకోక, నా స్వంత కష్టాలతో, నిన్ను విసిగించేంత హేయ కలిగాయంటే పెట్టుబడిదారీ సమాజ విధానమెంత హేయమైనదో తెలుస్తుంది. ఈవిషయాన్ని జెన్నితో యీ మధ్య అనేకమార్లన్నాను.''

ఎంగెల్సు 1864 వ సంవత్సరాంత్య భాగంలో మేరీ సోదరియైన లిజ్జీబరన్సును పరిణయమాడాడు. 1878 లో ఆమె మరణకాలం వరకు వారిద్దరూ చాల సుఖప్రదమైన సంసార జీవితం గడిపారు. ఎంగెల్సు పత్నిమణి చాల తెలివైనది. దేశభక్త ఆశయాలను నమ్మినది. విప్లవప్రజాస్వామిక స్థాపనార్థమై ఫెనియన్ సంఘంలో చేరి ఆమరణాంతమూ ఆమెపనిచేసింది. వారికి సంతానం కలుగకపోవుటచేత లిజ్జీ మేనకోడలైన మేరీ ఎలెన్ అనే బాలికను వారు పెంచుకొని, ఆమెకు విద్యచెప్పించి తమస్వంత కూతురువలె చూచుకున్నారు.

## ప్రకరణం 18.

# మధుర వాణిజ్యానికి స్వస్తి వాచకం.

1868 చివరిభాగంలో నూలుమిల్లు వ్యాపారమునుండి బయటపడటంతో ఎంగెల్సు విముక్తుడైనట్లు కనిపిస్తుంది ఎంగెల్సు తెరక్కుడా స్వయంగా నూలుమిల్లు వ్యాపారం చేయరాదనే షరతుమీద (మైనమానివిషయాలను

బట్టి యే దశలోను కూడా వ్యాపారాల్లో దిగాలని ఎంగెల్సు కలలోనైనా అనుకోలేదని మనకి కన్పిస్తూనేవుంది) ఎంగెల్సు వాటాను ఎర్మన్ విస్తారంగా సొమ్మిచ్చి కొనటానికి చూస్తే ఎంగెల్సు యెంత నమ్మకమైన వ్యాపారి అయ్యేవాడో మనకు బోధపడుతుంది.

మార్క్సు పోషణకు సరిపోయేటంత సంపాదించాలన్నదే ఎంగెల్సు ముఖ్య ఆశయం. మార్క్సుకు నెలకు 350 పౌనుల చొప్పున సంవత్సరాం డాక్టరు బిల్లులు మొదలైనవి అయినప్పుడు ... అవసరాలను తీరుస్తూ అయిదారేళ్లు గడపటానికి ఎర్మన్ యిచ్చే సొమ్ము సరిపోతుంది. అందుచేత మార్క్సుకు అప్పెంతవున్నదీ తెలియజేయమని తానా ఖర్చులు కనుక్కొని ముందు తీర్చివేసి. ఏడాదికి 350 పౌనుల చొప్పున (అనుకోని ఖర్చులకు గాను అవసరాన్నిబట్టి అదనంగానూ) పంపితే సరిపోతుందా ... నా గడుపుకోటం సాధ్యమౌతుందా అని ప్రశ్నించి ఆ విషయంపై ఎర్మన్ షరతులను తాను ఒప్పుకొనేది ఆధారపడి వున్నదని ఎంగెల్సు వ్రాశాడు. అయిదారేళ్లు గడిచిపోయాక యే మాత్రం నేను తాను ... లేను. అప్పుడైనా తాను సంవత్సరానికి 150 పౌనుల చొప్పున పంపగలుగుతాను, ఆ మొత్తాన్ని పెంచటానికైనా అవకాశం కలగొచ్చు అని మాట తనకుంది, సాహిత్యకృషి వల్లకూడా మార్క్సు ఆదాయం వృద్ధి కావచ్చు 350 పౌనులు సరిపోకపోతే ఏడాదికెంత మొత్తం సరిపోయేది మార్క్సును వెంటనే తనకు తెలియజేయమని ఎంగెల్సు వ్రాశాడు. ఎంగెల్సు సహాయంతను మాదిరిగాను “ఫలప్రదమైనవిగా” గా మార్క్సు వ్రాశాడంటే ఆ పనులో ఆశ్చర్యపడవలసిన పనిలేదను కుంటాను,

ఆఖరికి 1869 జూలై 1 నాడు ఎంగెల్సు యిట్లా వ్రాశాడు “ప్రియమైన తల్లిగారూ! ఇవాళే నా స్వేచ్ఛకి సంబంధించి ... వయుటపడ్డాను...... ..నా షరతులన్నింటికి ఎర్మన్ దిగివచ్చి అంగీకరించాడు నా స్వతంత్ర జీవితంలో ప్రథమదినం టుస్సీ (ఎంగెల్సు కుటుంబంతో కొన్ని వారాలు గడపటానికి వెళ్లిన మార్క్సు కడపటి కూతురు) నేనూ చాలా సేపు పొలాల్లో షికార్లతో గడిపాం నా కన్ను (అనుకోకుండా అంతలో కొన్నాళ్లనుండి కళ్లజబ్బులో బాధపడుతున్నాడు) చాలమట్టుకు బాగుపడింది కొద్దిగా శ్రద్ధ తీసుకుంటే త్వరలోనే పూర్తిగా నయమైపోతుంది.

జమా ఖర్చులు సరిగా చూడటంలోను, వాయిదాలతో సంప్రతించటం మరికొన్ని వారాలిక్కడ పడివుండవలసి వచ్చేట్లుంది. కాని పూర్వయుద్ధాలైన కాలంలో పోల్చి చూసుకుంటే యిది సముద్రంలో కాకిరెట్ట మాత్రమే..........''

మార్క్సు దీనికీ విధంగా జవాబిచ్చాడు:

“వ్యాపార వాణిజ్యాలనుండి విముక్తుడనైన యీ శుభ సమయంలో నీకివే నామనఃపూర్వక అభినందనలు! ఈబృహద్ఘటన సందర్భంలో పానీయం మరింత సేవించాను. ప్రష్యన్ సైనికులవలె ఉదయాత్పూర్వం కాదు, రాత్రియిక పడుతుండగా గోధూళివేళ..........''

## ప్రకరణం 14.

# తిరిగి లండన్‌లో

ఆఖరికి 1870 సెప్టెంబరు నెలాఖరులో చుట్టపక్కాలందరినీ వదిలివచ్చేలా తనభార్యను ఒప్పించి, ఎంగెల్సు లండను చేరుకున్నాడు. అక్కడవారి కార్య విభజన మరింత నిర్దిష్టరూపం ధరించింది. అయినా, వారిద్దరిలో ఏ ఒకరో రచనచేసినా దానిని ప్రకటనార్థం పంపేముందు యిరువురూ చర్చించి మెరుగులు దిద్దని రచనలేదు. కాని ప్లాను ప్రకారం మార్క్సు ఆర్థిక శాస్త్రీయ సిద్ధాంత రచనలకు, ఎంగెల్సు విమర్శనాత్మక ఖండన రచనలకు సిద్ధాంతదృష్టితో ప్రముఖమైనటువంటి సమస్యా పరిష్కార మార్గ ప్రదర్శక రచనలకూ తమ కాలాన్ని ప్రధానంగా వినియోగించారు. అయినా వారి సంయుక్త కృషి యెంత సన్నిహితంగా వుండేదో ‘డూహ్రింగు ఖండన’ ద్వితీయ ముద్రణకు ఎంగెల్సువ్రాసిన పీఠికచూస్తే బోధపడుతుంది.

“ఈగ్రంథంలో ప్రతిపాదింపబడిన దృక్పథ ప్రారంభాభివృద్ధులకు హెచ్చు బాధ్యత మార్క్సుదీ, అతిస్వల్పంగా మాత్రమే నాదీను, నాయీ రచన అతని పర్యవేక్షణలోనే జరిగిందని చెప్పవచ్చు, దానిని ముందుపూర్తిగా ఆయనకు చదివి వినిపించిన తర్వాతనే ప్రకటనకిచ్చాను. (విప్లవాత్మక చరిత్రనుండి) అనే ఆర్థిక భాగంలోని పదవప్రకరణమంతా మార్క్సు వ్రాశాడు. కొన్ని కారణాలవల్ల తప్పనిసరిగా చిన్నదిచెయ్యటం మాత్రమే నేను దానివిషయంలో చేసిన పనియంతా. నేను ప్రత్యేకంగాకృషి చేసిన

విషయాలలో ఆయనకూ, ఆయన విశేషంగా కృషిచేసిన విషయాలలో నాకూ పరస్పరం సహాయం చేసుకోవటం మాయిద్దరికీ అలవాటు.

ఆకాలపు అనేక సమస్యలపైన, వివాదాలపైన ఎంగెల్సు మనం పేర్కొనలేనన్ని వ్యాసాలు వ్రాశాడు. చారిత్రిక ప్రాధాన్యత గలవే కాక, నేటి సమస్యల పరిష్కారానికి కూడ అనువైనవి వాటిలో చాలవున్నాయి. ఉదాహరణకు 1872 లో 'ఫోక్స్‌స్టాట్' పత్రికలో వరుసగా ప్రకటించబడిన 'గృహ సమస్య' అనే చారిత్రక వ్యాసం అటువంటిదే. ప్రౌధన్ ముల్ బర్గర్ల ఛోటా పెట్టుబడిదారీ అనుచరులపై విమర్శాత్మక ఖండనగా వ్రాయబడిన ఆవ్యాసం అనేకమార్లు కరపత్ర రూపంలో పునర్ముద్రింపబడింది. అది యీనాటికీ అనుసరణీయమైనదిగా వుండి, మరెందరో శాస్త్రవేత్తల చేత అమలు పరచబడింది. అందులో ఎంగెల్సిట్లా వ్రాశాడు. "మరి గృహ సమస్యను పరిష్కరించే దెట్లా? ప్రస్తుత సమాజంలో యితర సాంఘిక సమస్యలన్నింటిలాగానే దీనికూడ సరఫరా, అవసరాల క్రమబద్ధ ఆర్థిక పరిష్కార మార్గంలోనే పరిష్కరించ బూనుకుంటున్నారు. పరిష్కారం మాట అటుంచి సమస్యనే నూతనరూపంలో మరల తయారుచేసే పరిష్కారమసలు పరిష్కారమనిపించుకోదు. ఆయా దేశాల్లో, ప్రదేశాల్లో గల పరిస్థితుల పైననేగాక, యితరశాస్త్రీయ సమస్యలపై అందులోనూ ముఖ్యంగా పట్టణాలకు, పల్లెటూళ్ళకు మధ్యగల వైరుధ్యాన్ని తొలగించటం పైకూడ సాంఘిక విప్లవమేదైనా యీసమస్యను పరిష్కరించే విధాన మాధారపడివుంది. భావి సమాజ నిర్మాణార్థమై ఊహామాత్ర విధానాలను వెదకటం మనపనికాదు గావున యీసమస్య నింతకన్న అధికంగా యిక్కడ తరచటం వృథా శ్రమ యవుతుందనుకుంటాను. కాని ఒక్క సంగతిమాత్రం నిజం: అదేమిటంటే పెద్దపట్నాలలో యేమైనా 'గృహాభావం' నిజంగా వుంటే దాన్ని వెంటనే తీర్చటానికి సరిగా ఉపయోగంలోకి తెచ్చినట్లయితే సరిపోయినన్ని యిండ్లు నేడున్నాయి. ప్రస్తుత యజమానుల వద్దనుంచి పెద్దభవంతులను జప్తుచేసి యిండ్లు లేనివారికి, ప్రస్తుతం తోవలో కిక్కిరిదిగా గుడిసెలలో గుంపులుగా నివసిస్తూన్న కార్మికులకూ వాటిలోచోటు చూపిననాడే యీనాటి గృహ సమస్యాపరిష్కారం సాధ్యమౌతుంది. ప్రస్తుత

ధనిక రాజ్యాంగంలో జప్తులు, వేలాలు యితర్లపై ఎంతసులభంగా అమలు జరుప బడుతున్నాయో కార్మికవర్గం రాజకీయాధికారం సంపాదించుకోగానే ప్రజావసరమైన యీపనినంత అతిసులభంగా అదిఅమలులోకి తెస్తుంది.”

ఎంగెల్సు శైలి ఎంత సులభగ్రాహ్యంగాను, సువిశదంగాను, శక్తిమంతంగాను వుండేదో తెల్సుకోటానికి పైవాక్యాలే చాలు. మార్క్సు, ఎంగెల్సులు తమసిద్ధాంతాల నేవిధంగా నిర్మించి పరీక్షించుకున్నారో, తమ తదుపరి రచనలన్నింటిలో వలెనే దీనిలో అప్పుడే ఎంగెల్సు సంపూర్ణ విముక్తి కొరకై కార్మికవర్గ ప్రథమపోరాటమైన పారిస్ కమ్యూన్ అనుభవాన్నే విధంగా గ్రహించి, వినియోగించుకున్నాడో, ఆ అనుభవ సహాయంతో తనసిద్ధాంతాలను, గుణపాఠాలను, భావి సూచనలను యేవిధంగా సరిమార్చుకున్నాడో మనకు స్పష్టంగా గోచరిస్తుంది.

## ప్రకరణం 15.

# “యాంటీ-డుహ్రింగ్” లేక శాస్త్రీయ సోషలిజం

ఎంగెల్సు 1875 లో ‘వార్వర్ట్సు’ పత్రికలో తన ‘యాంటీడుహ్రింగు’ గ్రంథాన్ని ప్రచురించాడు. 1876 లో అది పుస్తకరూపంలో ప్రథమ పర్యాయం ప్రకటించబడింది. దానిచివరిభాగం ప్రత్యేకంగా “సోషలిజం, ఊహాజనితం, శాస్త్రీయం” అనే పేరను ప్రకటించబడింది ఈప్రచురణకు ప్రజలలో గొప్పప్రచారం రావడమే కాక, అనేక భాషల్లోనికది అనువాదం చెయ్యబడింది కూడా.

పెట్టుబడిదారీ వర్గంలోని సంస్కృతి చెందినట్టి, మితవాదశ్రేణికి చెందినట్టి భాగాలు. 1870-74 మధ్యకాలంలో జర్మనీలో సోషల్ డెమాక్రసీ సాధించిన ప్రాబల్యం, విజయాలచూసి దానివైపుకు మొగ్గ నారంభించారు. మధ్యతరగతి, పెట్టుబడిదారీ వర్గాలకు చెందిన వ్యక్తులు తమమార్గాలోచనా విధానాలనుండి పూర్తిగా విముక్తులై, తమవర్గప్రయోజనాలను విసర్జించుకుని, కార్మికవర్గ విప్లవ దృక్పథాన్ని మనసారా అవలంబించి వారుసోషలిస్టు, కార్మికోద్యమాలలో పాల్గొనేటట్లయితే మంచిదే, యేవిధమైన

అర్థంతరమూ వుండ నవసరంలేదు. కాని ఆనాడు పెట్టుబడిదారీ వర్గం, పోషణవిస్తరణంలోనికి వేసిన గంతు యీసూత్రానికేమాత్రమూ అనుకూల్యమైనది కాదు. పైగా, ఆనాటి పోషణిస్తు వున్నట్టుయుండి దాని కార్మిక వర్గ శీలాన్ని తొలగించివేసి, మధ్యతరగతి వారికనుకూల్యమైన 'గౌరవనీయ' వున్యమంగా దాన్ని తయారుచేయు వారు పూనుకున్నారు.

శక్తి యుక్తులు కలిగిన అట్టి పెట్టుబడిదారీ వర్గప్రధాన నాయకులలో యూజెన్ డుహ్రింగ్ ఒకడు. సోషల్ డెమాక్రటిక్ పార్టీలోని యువకులలో ఆయన పలుకుబడి బాగా వ్యాపించనారంభించింది. ఆయన గొప్పకవుద్ధుడు; అందుకు సందేహంలేదు. చిన్నతనంలో చాల కష్టాలు అనుభవించాడు. ఆయన కనేక విషయాలు తెలుసు. అనేక విషయాలపై ఆయన రచనలు కూడ చేశాడు. కాని యే ఒక్క విషయంలోను, ఆయనకు సమగ్రమైన జ్ఞానం లేకపోవటమే విచారించ దగ్గ విషయం? పైగా, వివిధ విజ్ఞాన శాఖలమధ్య, వాటి అభివృద్ధి మధ్యగల పరస్పర సంబంధ మూల సూత్రము, భిన్నత్వంలోని ఏకత్వ సూత్రమే పాపం ఆయనకు బోధపడింది కాదు'

అయినప్పటికీ ముఖ్యంగా పార్టీయువకులపై డుహ్రింగుకు గల పలుకుబడిని ఒట్టి ఆయన వ్యతిరేకతను తక్కువ అంచనా వెయ్యటానికి వీల్లేదు. అందుచేత, విజ్ఞాన సర్వస్వరూప మున దగిన ఎంగెల్సు తన సుస్పష్ట గతి తార్కిక దృక్పథంలో డుహ్రింగు రచనలను తరచితరచి వాటి బండారాన్ని బయటపెట్టి, అవి అవకతవకలని ఋజువు చేయుటమే కాక, అదే సమయంలో అంతకన్న ముఖ్యంగా శాస్త్రీయ కమ్యూనిజాన్ని ఉత్తమంగా వివరించి, అధునిక శాస్త్రాలన్నింటిని మార్క్సు ప్రవచించిన భౌతికవాద దృష్టిలో పరిశీలించి, సాంఘిక విప్లవమూకుండి జనించే ప్రత్యక్ష సమస్యాపరిష్కారమార్గ ప్రవర్తనలో వాడెంత వుపయోగపడింకో నేటికీ అంత ఉపయోగకరంగా వున్నట్టి గొప్ప శాస్త్రీయ గ్రంథాన్ని లోకానికి ప్రసాదించాడు.

అందులో మొదట్లో, చారిత్రిక భౌతికవాద సమగ్రపరిశీలనచేసి తానూ, మార్క్సు ఆవలంబించిన గతి తార్కిక విధానాన్ని వివరించి, విజ్ఞాన, తత్వశాస్త్ర రంగాలలో దానిఅర్థస్థానాన్ని నిరూపించాడు. భౌతి

క, వృక్ష, శారీరక శాస్త్రాలలోను, చరిత్ర, తత్వశాస్త్రం మొదలైన రంగాల్లోను ఉదాహరణలతో ఎంగెల్సు పాతలోనే క్రొత్త మొలకెత్తుతుందనే ప్రాంతపద్ధతి పరిపక్వదశను చేరుకోగానే క్రొత్తపద్ధతి తప్పకదానిస్థానాన్నాక్రమిస్తుందనే గతి తార్కిక సూత్రాన్ని నిరూపించాడు,

"మరి గతితార్కిక విధానం విషయం మట్లాకాదు. అదిగ్రహించేచరాచర వస్తుజాలము, వాటి ప్రతిబింబాలు, భావాలు, ముఖ్యంగా భావాల పరస్పరసంబంధాలు, భావక్రమము, కదలిక, ఉత్పత్తినశింపులు మొదలైన వివిధ విధానాలన్నీ కూడ గతితర్క పద్ధతిని పూర్తిగా బలపరుస్తాయి. గతితార్కిక వాద ప్రాశస్త్యాన్ని నిరూపించే విషయాలు ప్రకృతిలో. ఎన్నైనా వున్నాయి.

"విశ్వాన్ని, దానియొక్క, మానవజాతియొక్క పరిణామాన్ని, మానవుని మనస్సుపై యీపరిణామం ప్రసరించే ప్రభావాన్ని సరిగా చిత్రించటానికి ఒక్క గతి తార్కిక విధానంలోనే సాధ్యమౌతుంది. ఈపద్ధతిలోపరిశీలించేటప్పుడు అభివృద్ధి కర, అభివృద్ధి నిరోధక మార్పుల, సాధారణ ఘటనా, ప్రతిఘటనల, ఉత్పత్తి, వినాశనము, మాత్రం సర్వదా దృష్టిలో నుంచుకోవాలి." "గతితార్కిక విధానమంటే ప్రకృతిలోను, మానవ సమాజంలోను, భావంలోను, సమస్తవస్తుజాలంలోను నిరంతరగతి, పరిణామ మాత్రం తప్ప వేరేమీ కాదు.

ఆయన తన సహజ ప్రతిభా శక్తులను ప్రయోగించి విడదారిన ద్వేషంతో చులకపు దెబ్బలవలె నిశితంగా తగిలేపదాలతో "నీతి సత్యం న్యాయాలకు సంబంధించిన 'శాశ్వత' సూత్రాలను" నమ్మమని మనకబోధించే కపట సోషలిస్టులను (యీనాటికీ ఆ సమద్య లట్టివారుకేం పోలేదు') తునా తునకలుగా ఖండించాడు. "నీతి నియమాలకి శాశ్వత సూత్రాలపై ఆధారపడి వదనీ, దేశ, కాల, చరిత్రల మార్పులతో దానికెట్టి సంబంధమూ లేదనే సాకులతో, అది శాశ్వతం, అత్యుత్తమం, మార్పులేనిది అనే మూఢసిద్ధాంతాన్ని మనపై రుద్దటానికి జరిగే ప్రయత్నాన్ని గర్హించుకోవని కోరుతున్నాము. అదెంత మాత్రం కాదంటాము. ఆయా కాలాల్లో, ఆయా దేశాల్లో గల ఆర్థికపరిస్థితులనుబట్టి యింతవరకు నీతి నియమాలలో మార్పుచెందుతూ వస్తూందని మా [illegible].

"ఈనాటి వరకూగల సమాజ చరిత్రయంతా వర్గకలహాల చరిత్రయే కాబట్టి నీతి నియమావళి కూడ యెప్పుడూ ఒకవర్గానికి మాత్రమే సంబంధించి యుంటోంది. అధికార వర్గంయొక్క పెత్తనాన్ని, ప్రయోజనాలను అది బలపరచనైనా బలపరిచేది; లేక పీడితవర్గం తగినంత బలపడగానె అది పీడనకు వ్యతిరేకంగా జరిపే తిరుగుబాటును, పీడితవర్గ భావి ప్రయోజనాలనైనా బలపరచేది."

"నేటి సమాజంలో కృషిఫలితాల ప్రస్తుత విభజన విధానంవల్ల ఒక వంక దిక్కులేని దైన్యం, అగర్భదారిద్ర్యాలు; వేరొక వంక అతుల ఐశ్వర్య భోగ విలాసాలు అనే వైరుధ్యాలు యేర్పడిపోయాయి. ఈ కృషి ఫలిత విధానం అన్యాయమైనదని గుర్తించి ఏనాటికైనా న్యాయంగా జరగాలని గుర్తించటం కన్న విస్తృత విజ్ఞానానికి ఏ సూచన వేరేదీవుండదు. ఆవిధంగా కనక గుర్తించక పోయినట్లయితే మనమీ దుర్గతిలోనే చాలకాలం కొట్టుమిట్టాడ వలసివస్తుంది...... ...

"వేరు మాటల్లో చెప్పాలంటే, ప్రస్తుత పెట్టుబడిదారీ వుత్పత్తివిధానంలో వినియోగింపబడుతున్న ఉత్పత్తిశక్తులు, వానిపైనాధారపడే విభజన విధానము కూడ ఉత్పత్తివిధానానికి పూర్తిగా విరుద్ధంగా తయారయాయి. వర్గభేదాలను సమూలంగా సమయించే వుత్పత్తివిభజన విధానాల్లో సంపూర్ణ పరివర్తనమే కనుక రాకపోతే ఆధునిక సమాజమే కూలిపోయేటంత అధికంగా వున్నదా వైరుధ్యం. పీడిత కార్మికవర్గం నానాటికీ యీ యదార్థవిషయాలను గుర్తించి తీరుతుంది. ఆధునిక సోషలిజంయొక్క విజయంపై కార్మికవర్గ విశ్వాసంపైన చెప్పినయదార్థ విషయ గ్రహణంపైననే ఆధారపడుతుంది గాని యే చాదస్త పండిత ప్రకాండుని న్యాయాన్యాయవిచక్షణపైనా ఆధారపడదు."

వర్గదాస్య క్రమాన్ని తెల్సుకోవాలంటే రాజకీయ పరిస్థితుల్లో అది గోచరిస్తుందనీ, వర్గ విభేదాలకు మూల కారణం రాజకీయ క్రియేననీ, ఆర్థిక కారణాలు అంత ప్రధానమైనవి కావనీ డుహ్రింగ్ చేసే వాదలను ఖండిస్తూ దౌర్జన్యపు దొంగతనాల వల్లనే కాక పురాతన తెగల సమాజాలలో గొప్ప వస్తువులను పుష్కలంగా లేకపోవుట వల్లనే——యీ కారణం మూలంగా

నే సరుకుల ఎగుమతి, అవసరమైన వస్తువులను కాక ఎగుమతిచెయ్యటానికి గిరాకైన వస్తువులను ఉత్పత్తిచెయ్యటం కూడ ప్రారంభమయాయి—వర్తకత ఆస్తి ఉదయించిందని ఎంగెల్సు నిరూపించారు.

దానితో విభజన విధానాలుకూడ మారిపోవటంవల్ల వ్యక్తులఆస్తి ప్రమాణాలలో భేదాలు పెరిగిపోయాయి. ఆదిమ కమ్యూనిస్టు సమాజం అనేక శతాబ్దాల పాటు సైతం వచ్చిన నాశనము తప్పించుకోగలిగింది గాని అభివృద్ధిచెందిన పారిశ్రామిక వస్తూత్పత్తికి తట్టుకోలేక త్వరలోనే కూలిపోయింది.

ప్రెంచిబడిదారీ విప్లవం భూస్వామ్య బంధాలన్నింటినీ తెగత్రెంచివేసింది "బూర్జువా సత్తిపోయిన పాతరాజకీయ వ్యవస్థను తొలగించి వేసి నూతన ఆర్థికవిధానం అమరి, అభివృద్ధి చెందగలిగిన రాజకీయ పరిస్థితులను కల్పించుట ద్వారా మాత్రమే యిది సాధ్యమైందిగాని, హెర్ డుహ్రింగ్ సూత్రం ప్రకారం ఆర్థికవిధానాన్ని రాజకీయ పరిస్థితులకనుగుణ్యంగా అమర్చటం వల్ల ఎంతమాత్రం కాదు ఇట్టి రాజకీయ వాతావరణంలో దాని అవసరాలకు తగిన శాసనవాతావరణంలో ఆర్థికవిధానం 1789 నాటికే ప్రెంచిబడిదారీ వర్గం దాదాపు పూర్తిగా ప్రభువర్గ స్థానాన్నాక్రమించేటంత శీఘ్రంగా అభివృద్ధిచెందింది. అది నానాటికీ సామాజికంగా అనావశ్యకంగానే కాక అటంకంగాకూడ తయారవుతోంది. అది ఉత్పత్తి కార్యక్రమానికి నానాటికీ దూరమై పన్నులు వసూలుచేసుకునే పూర్వప్రభువర్గం వలెనే ఆదాయం వసూలుచేసుకునే వర్గంగా తయారౌతోంది. అది తనస్థితిలో యీమార్పునూ కార్మికవర్గమనే ఒక క్రొత్తవర్గ ఉత్పత్తిని యేమాత్రపు గారడీ, బలప్రదర్శనమూ చేయకనే శుద్ధ ఆర్థికపద్ధతిలో సాధించింది."

మార్క్సు, ఎంగెల్సులు ప్రతిపాదించిన సూత్రాలన్నింటిలోను చారిత్రిక భౌతికవాదమే అత్యధికంగా ఖండించబడిన సూత్రమనుకుంటాను. అందుచేత, "కారల్ మార్క్సు జీవితం, ఉపదేశాలు" అనే పుస్తకమునుండి పైవిషయానికి సంబంధించిన యీక్రింది భాగాన్ని పొందుపరచటం అప్రస్తుతం కాదని తలుస్తున్నాను.

"ఒకానొక చారిత్రిక దశలో ఒకవ్యక్తి ఫలానా విధంగా పోటుబడ్డాడన్నప్పుడు తనస్వంత లాభంకొరకు మాత్రమే అతను పోటుబడ్డాడని

కాను మాపుద్దేశం. పైగా వ్యక్తుల ఉత్సాహాశయాలు ధర్మాలను గుర్తించే వారిలో భౌతిక వాదులమైన మేము ముందుంటాం.

"మార్క్సుయొక్క చారిత్రక భౌతిక వాద దృష్టిని పూర్తిగా అంగీకరించే శాస్త్రీయ భౌతిక వాదులే పైవిధంగా తమ ఆశయాదర్శాలకొరకై స్వప్రయోజనాలను కూడ త్యాగం చేసిరి, చేసినవ్యక్తుల్లో అగ్రగణ్యులు. సాంఘిక విప్లవానికి తమ ఉత్తమాదర్శంకొరకై స్వీయ రక్తబలిదానం చేసిన, నేటికీ చేయు సముద్యుక్తులైన లెక్కకు మిక్కుటమైన రష్యన్ సోషలిస్టుల సంఖ్యాధిక్యతను దాహరణగా చూపితే చాలనుకుంటూ ఈసందర్భంలో,

"భౌతికవాది ప్రత్యేకత భావశూన్యత్వంగాని. యితరులకు భావాలుంటాయనే విషయాన్నంగీకరించక పోవడం గాని కాదు. ఒకవిషయముంది. దాని మూలకారణమేమిటి? ఈఆశయాలు, ఉత్సాహాలు ఎక్కడనుండి, ఏ కారణాలవల్ల ఉదయించాయి? ఈప్రత్యేకదశలో యీప్రత్యేకఆశయాలు నీతిసూత్రాలు, భావాలే వుండటానికి కారణమేమిటి? అనే యదార్థ కారణ విచారణ చేసేవాడే భౌతికవాది.

"ఒకవంక పల్లెత్తు మాటాడకుండా మనమీనాడు జీతానికి బానిసత్వమనే—ఇచ్ఛాపూరిత బానిసత్వాన్నంగీకరిస్తున్నాము కదా, మరి మనమెందుకుగాను పూర్వపు నరభక్షణ. బానిసత్వ, దాసత్వ పద్ధతులను తలచుకొని కంపించి పోతాము? ఉత్పత్తి శక్తులుస్వల్పంగాను, పురాతనంగాను ఉన్నందువల్ల ఆరోజుల్లో యుద్ధంలో పట్టుబడ్డ ఖైదీలుగాని, దారితప్పివచ్చిన మానవులుగాని విశేషల లాభకరంగా వినియోగపడటం కష్టం వారివల్ల యితర వుపయోగం లేదు—వారినలా వదలటమంటే సమాజానికి మోయలేని పెనుభారాన్ని పైన వేసుకోవటమన్నమాట.

"నరమాంస భక్షకుడు తానుచేసే పని తప్పని నిర్ణయించలేడు. అతని భావాలు, నైతిక విశ్వాసాలు, ఆఖరికి మానవిక తత్వం కూడ తోటి మానవులను భక్షించడం సహజమైన, నీతిబద్ధమైన పనిగా అంగీకరించాయి. నరమాంసభక్షకుడా విధంగా ఆలోచించటమేవిధంగా సాధ్యమైందని పరిశీలిస్తే దానికి కారణం అతను నివసించిన సాంఘిక పరిస్థితుల్లో మనకు గోచరిస్తుంది. కొన్ని పురాతన సమాజాలలో ఆచారంగా అమలుజరిగిన బలిహ

వ (స్త్రీ) శిశువుల హత్యలకు కూడ—వారితర సమయాలలో తమబిడ్డలను విశేషంగా ప్రేమిస్తూనే వుండేవారు—పై కారణమే అన్వయిస్తుంది.

"కాని ఉత్పత్తి శక్తులభివృద్ధికాంది, తత్కారణంగా బ్రతుకు తెరువులుకూడ వృద్ధిచెందిన కొలదీ జనాభా పెరుగుదలభారంగా కాక బహుప్రయోజనకరంగా తయారవుతుంది. దానితో మానవజీవితం పవిత్రమైనదనీ తోటి మానవులను భక్షించటం ఘోరమైనదనే ఒక క్రొత్త ఆశయం మొలకెత్తి, ప్రబలంగా వృద్ధికాంది, చివరకు పాతభావాన్ని పూర్తిగా రూపుమాపి దానిస్థానాన్నాక్రమిస్తుంది. కాని ఆభావనికి మూలకంద మేమిటి? అది తలయెత్తటాన్ని సాధ్యంచేసిన శక్తియేమిటి? నైతిక దృష్టిలో, తెలియకుండానే తరచుగస్తూండే యీమార్పు క్రమానికి కారణమేమిటి? ఆరోజుల్లో ఉత్పత్తిశక్తుల అభివృద్ధి, తదుపరి సమాజంలో ఉత్పత్తివిధానంలోని మార్పులే దీనికి కారణం.

"మన మావిధంగా నిసుగులైన శిశువులను హత్యచెయ్యం కాని, వాళ్లని పెరగనిచ్చి, శారీరకంగాను, మానసికంగాను శక్తిసంపన్నులుగా తయారు చేసుకునేమాత్రమూ శ్రద్ధ తీసుకోలేక, వారికి సదుపాయాల ఆరోగ్యకర పరిసరాల్లో కులాసాగా ఆడుకోనటమో లేక విద్యాలయాల్లో విద్యాసముపార్జనమో చేయవలసిన లేత వయస్సులో వారిని కర్మాగారాల కుళ్లు కంపులో వదలి, విసుగు విరామంలేని నిరంతరశ్రమకు గురిచేసి వారిశరీరాన్ని మనస్సును, తుదకు ఆత్మనుకూడ నలగగొడతాము, దయాపరులం, కమనీయ హృదయులం, నీతిమంతులం అయిన మనం మానవజాతిలో విశేషభాగానికి జీవితాన్నానందమయం చేసేందుకు కావలసిన వస్తువులేవీ లేకుండాపోచేస్తున్నాం'—అందుకు మననీతి సూత్రాలుగాని, మనమతాలుగాని ఏమాత్రం అడ్డురాలేవు, సరికదా తోడ్పడ్తాయి కూడ! దీనికి కారణమేమిటి? వ్యక్తిగత శ్రామికుని స్థితిఎంతహీనంగా వుండనీగాక, ప్రస్తుత వుత్పత్తివిధానంలో చౌకబారు శ్రమ ఎంతైనా కావలసిరావటమే దీనికి కారణం,

"వ్యక్తిగత ఆస్తి, దొంగతనాలను గురించి శాసనాలను చేసుకుని, మనం [illegible] జరుపుతూవుంటాము. కొన్నినీతిసూత్రాలను నిర్వచించుకుని వాటిని పాటిస్తూవుంటాము. ఈశాసనాలు, నీతిసూత్రాలు అనుల్లంఘనీయాలనీ వ

ప్రకృతము కాని, అధికసంఖ్యాకుల శ్రమ ఫలితాన్ని అల్పసంఖ్యాకులు దోచుకోవటాన్ని మనం సాగనిస్తున్నాము. పైగా అట్టి పనిని చట్టబద్ధము న్యాయము, ధర్మమైనదిగా పరిగణిస్తున్నాము. దీనికి కారణమేమిటి? మార్క్స్ ఋజువు చేసినట్లుగా పాలకవర్గం యొక్క నీతి నియమాలు, చట్టాలే మనకు తెలియకుండా సమాజ మంతటిపైన రుద్దబడుతున్నాయి. అట్టి వాతావరణంలో పెరుగుతూన్న మనం అవి సహజమైనవేనని భావిస్తున్నాము. కాని నిజానికి పారిశ్రామిక పరిస్థితుల ఫలితంగానే అవి పవిత్రంగా పరిగణింపబడుతున్నాయి.

"కాని మనలో చాలమంది యీసంస్థలపై తిరగబడుతున్నాం. సాంప్రదాయాల కనుగుణ్యంగా వున్నాయనో, పాలకవర్గ ప్రయోజనాలతో ఏకీభవించాయనో అన్నంతమాత్రాన యీసూత్రాలన్నీ నీతిబద్ధము, న్యాయము అయినవని మేమంగీకరించబోమని గొంతెత్తి చాటుతున్నాం. ప్రస్తుత సమాజంలోని చెడుగులన్నీ తొలగుగా పాతిపెట్టబడే నూతనసమాజ నిర్మాణార్థమై మా సర్వస్వాన్నీ త్యాగం చేయటానికై మేము సర్వసిద్ధులుగా వున్నాం. అయితే యీభావాలు, ఆశయాలు, ఉత్సాహం మాలో పోసుకోవటానికి కారణమేమిటి? సోషలిజం రూపం ధరించిన మానవత్వాలను పొటమరింప చేసిన శక్తియేమిటి?"

పెట్టుబడిదారీ విధానానికి కాలం చెల్లిపోవటమే దీనికి కారణం; మార్క్స్, ఎంగెల్సులు అతి నిపుణంగా నిరూపించినట్లు ఉత్పత్తివిధానంలోని పురోగతులు, పారిశ్రామిక పద్ధతులు అతితొందరగా ప్రస్తుత పెట్టుబడిదారీ విధానంతో సమన్వయం కుదరనంత విరుద్ధంగా అభివృద్ధి చెందటమే దీనికి కారణం.

పెట్టుబడిదారీ విధాన జనితమైన జీవితపద్ధతి, పట్నాలలో విస్తారజన సమీకరణ, కర్మాగారాలలో బహుళ కార్మికజన కేంద్రీకరణ పారిశ్రామికాభివృద్ధి కారణంగా అంతకంతకు వృద్ధిచెందే కేంద్రీకృత, సాముదాయక వుత్పత్తి పద్ధతులు, కొద్దిమంది కలవారి అంతులేని భోగవిలాసాలు, ప్రక్కనే అనేకమంది లేనివారి ఆకలి, దీనారావాలు—యివీ యిట్టివే యిక్కడ చెప్పకొనటానికి అవకాశంలేని అనేక యితర పరిస్థితులే మాలో క్రొత్తఆశయా

లను, శక్తులను, ఉత్సాహాన్ని రేకెత్తించాయి. పాతలో కొత్తయొక్క బీజాలప్పుడే పొటమరిస్తున్నాయి. కొత్తఆశయాలు పాతవాటి స్థానాన్నాక్రమిస్తున్నాయి.

పెట్టుబడిదారీ విధానవినాశం, సోషలిస్టు సమాజస్థాపనం తప్పక జరిగి తీరుతుందని మేము చెప్తున్నామంటే దాని అర్థం మనం చేతులుకట్టుకు కూర్చుని, కంబళ్లుకప్పుకుని, నోరావలిస్తే సోషలిజమనే ఫలం దానంతటది మనవొళ్లో పడుతుందని మావుద్దేశం కాదు! మనం చేతులుముడుచుకు కూర్చోక 'తప్పక' ప్రయత్నిస్తామనే మా ఉద్దేశ. ప్రతిపెట్టుబడిదారీ దేశంలోను నానాటికీ అధికసంఖ్యాకులు మనం ప్రస్తుతం నివసిస్తున్న సమాజవిధాన విప్లవ రూపాన్ని గుర్తించి తిరుగుబాటు శక్తులలో చేరి తీరుతారు. ఉత్పత్తిరంగం లో నానాటికీ అధికతరంగా అవలంబింపబడుతున్న సాముదాయికత్వం, ఉత్పత్తికై వినియోగపడే కార్మికుల సాన్నిహిత్యానికి సంఘీకరణకు దారితీస్తోంది. మొదట, యీసంఘీకరణ కొన్ని ఆర్థిక హక్కులకొరకై మాత్రమే ఉపయోగపడినా తర్వాత మాత్రం రాజకీయాధికారాల కొరకు, ఉత్పత్తి శక్తులకు తలయొగ్గి దాసోహం చేసే పరిస్థితులనుండి విముక్తమై, వాటిని తమయాజమాన్యం లోనికి తెచ్చుకొనేందుకు వుపయోగపడుతుంది. ముక్తసరిగా చెప్పాలంటే, సోషలిజం వచ్చేందుకు ఆర్థిక పరిస్థితులు పక్వమవగానే కార్మికుల పెట్టుబడిదారీ మానసిక తత్వమే సోషలిస్టు మానసికతత్వం గా తప్పక మారిపోతుంది.

ఈమార్పుయొక్క అవసరాన్ని యెంతఅధికంగా అర్థంచేసుకుంటూ, సమాజ చారిత్రకాభివృద్ధి కనుగుణ్యమైన సోషలిస్టు ఆశయాలకొరకు ఉత్సాహంతో యెంతఅధికంగా కృషిచేస్తామో అంతత్వరగా యీమార్పు సాధింపబడుతుంది.

అందుచేతనే భౌతికవాది యెన్నడూ కర్మసిద్ధాంతాన్నంగీకరించడు. అతను సాధ్యాసాధ్యాలను గుర్తించే హేతువాది. ఊహాజనిత సామ్యవాదులవలె అతనెన్నడూ సాధ్యాసాధ్యాలను పరిగణించకుండా శుష్క సానుభూతితో ఆడంబరమైన ప్లానులువెయ్యడు. తప్పక ఫలించి తీరుతుందని తనకునమ్మకం ఉన్న నిర్దిష్టమైనబాటలోనే అతను నిబ్బరంగాపయనిస్తాడు.

పైగా తన పోరాటపక్షగులను నిర్ణయించుకునేముందు కూడ అతను ఆర్థిక, చారిత్రక పరిస్థితులను లోతుగా పరిశీలిస్తాడు. ఆసందర్భంలో, కార్మికులు తయారుచేసే అదనపు విలువలకు తగిన ప్రతిఫలం యివ్వకనే పెట్టుబడిదారులు దోచుకోవటమే పెట్టుబడిదారీ విధాన ప్రత్యేకత యనీ, అందుచేత పెట్టుబడిదారీ, కార్మిక వర్గాలమధ్య విశేష వైరుధ్యముందనీ అతను గుర్తిస్తాడు.

పెట్టుబడియొక్క దాసత్వమునుండి తనను తాను విముక్తి చేసుకోటానికి కార్మికవర్గమే అధికంగా కృషిచేయవలసి యుంది. అందుచేత శాస్త్రీయ సామ్యవాది ప్రధానంగా కార్మికులకే ప్రబోధన్ని చేస్తాడు పైగా, సమాజంలోని జీవితపక్షగులు పరిశీలించినట్లయితే సమూహాలుగా విడిపోయే కార్మికులకే సోషలిస్టు సిద్ధాంతాలు బాగా నచ్చుతాయని మనకు సులభంగా బోధపడుతుంది. వారివారి జీవితపరిస్థితుల ననుసరించి కార్మికుల స్వాతంత్ర్యమతం పెట్టుకొని పనిచేసే చిన్నరైతు, చిన్నదుకాణదారుల లేక వ్యక్తిగత వ్యాపారుల మానసిక పరిస్థితులేవిధంగా వుంటాయో యిప్పుడు పరిశీలిద్దాం.

రైతు మారుమూల పల్లెల్లో ప్రపంచానికి, తోటి మానవులకు సంబంధం లేకుండా జీవిస్తుంటాడు. పైగా యీవిశాల విశ్వాన్ని గురించి అతనికి తెలిసినది చాల స్వల్పం. అసలు తెలుసుకోవాలని కూడ ప్రయత్నించడు. అందుచేత అతని భావాలు చాల సంకుచితంగా వుంటాయి. తనస్వంత భూఖండంపై కృషిచేసి పండించుకు తినే రైతుకు యితరులతో కలవాలనే భావమే కలగదు. సాముదాయికత్వం, సాముదాయిక యాజమాన్యం అనేమాటలు వినబడగానే తనజీవితాధారమైన భూఖండమెక్కడ పోతుందోనని భీతి కలుగుతుంది. సోషలిస్టు ప్రచారమంతటికీ భ్రమగా కనుపిస్తుంది. పెద్దపెద్దభూస్వాముల బ్రహ్మాండమైన కమతాలలో వతనువాళ్లుగా పనిచేసే రైతుల విషయం వేరన్నమాట నిజమేగాని సర్వసాధారణంగా సోషలిస్టు ప్రచారం రైతులలో బాగా ప్రచారం కాదు.

ఇంక చిన్నదుకాణదారుడి విషయం పరిశీలిద్దాం. అతను రైతుకన్న కొంత అధికంగా సామాజిక జీవితం గడుపుతాడు కనుక అతని భావాలు కొంత విశాలంగావుంటాయి. స్వల్ప ఆస్తి వుండటంవల్ల సమాజంలో అతని

కొక విధమైన భద్రత కనిపిస్తుంది. ఒకవంక తన ఆస్తిపోయి రెక్కాడితేగాని డొక్కాడని కార్మిక శ్రేణిలో కలిసిపోతానేమోనని నిరంతర భయాందోళనలతో వేగుతున్నా, మరొకవంక యెన్నటికైనా ఆస్తిని వృద్ధిచేసుకుని ఉన్నత సమాజశ్రేణిలో కలియలేక పోతానా అని పగటి కలలు కంటూంటాడు. పెద్దపెట్టుబడిదారులనతడసహ్యించుకుంటాడు; కాని వారిపట్ల అతని అసహ్యంకన్న ద్వేషం అధికంగా వుంటుంది. వారికి వ్యతిరేకంగా ఒక్కొక్క మారాతను తిరుగుబాటుదార్లతో చేతులుకలపవచ్చుగాని, అది కూడ స్వప్రయోజనార్థమే చేస్తాడు. మొరటు మనుష్యులైన కష్టజీవులతమ మురికిచేతులను 'తన' ఆస్తిపైకూడ యెక్కడ వేస్తారో ననే భయంతో పోరాటం మరింత ముందుకుపోకుండా నిరోధించుతూ అభివృద్ధి నిరోధకంగా ప్రవర్తిస్తాడు. కాబట్టి చిన్నపెట్టుబడిదారులలో కూడ సోషలిస్టు ప్రచారమేమంత బాగా కొనసాగదు.

అందుచేతనే. ఛోటా పెట్టుబడిదారీ వర్గమెప్పుడూ పోరాటసమయంలో కార్మిక వర్గానికి మోసగిస్తూ వస్తోంది. అయితే, యీవర్గానికి సంబంధించిన వ్యక్తులుగాని, ఉన్నత వర్గాలకు సంబంధించిన వ్యక్తులుగాని కొందరు కార్మిక వర్గవిముక్తిపోరాటంలో పాల్గొనటానికి అవకాశంలేదని, తమకుగల అధికతర విజ్ఞానావకాశాల సాయంతో, ఉద్యమానికి అధికంగా తోడ్పడటానికవకాశం లేదనిగాని నా వుద్దేశం కాదు. కాని వారు ముందు మానసికంగా తమవర్గ దృక్పధాన్ని, ప్రయోజనాలను పూర్తిగా విసర్జించి, చైతన్యవంతులైన కార్మికుల ఆశయాలన్నింటినీ సంపూర్ణంగా ఆమోదించిన వారైతేనే అది సాధ్యమవుతుంది.

కార్మికుని విషయమో! అతనికి వ్యక్తిగత ఆస్తి అనేదేమీ వుండదు (వ్యక్తిగత ఆస్తి అంటే వ్యక్తికి చెందిన మామూలు వస్తువులు కావు, ఇతరుల శ్రమశక్తిని దోచుకొని దానివల్ల లాభాలు గడించేందుకుపయోగపడే వ్యక్తిగత స్వత్వంలో గల ఉత్పత్తి, మారక సాధనాలే వ్యక్తిగత ఆస్తియని నా వుద్దేశం.) అందుచేత వాటిపట్ల అతని మమకారం నామమాత్రంగా మాత్రమే వుంటుంది. వ్యక్తిగత ఆస్తిపద్ధతిని అతను నమ్ముతాడు; దాన్నిచూచి భయపడతాడు; అట్టిది తనకికూడ కావాలని మొదలైన కోరికలుంటాయి;

కాని దానిని తనది కానట్లుగా అంటీముట్టకుండా చూస్తాడు. వ్యక్తిగత ఆస్తిలేని సమాజాన్ని తెలుసుకొని యితరులవలె యితడెన్నడూ భయభీతుడు కాడు తనకెట్టి వ్యక్తిగత ఆస్తిలేదు. కాన యితడే వ్యక్తిగత ఆస్తిలేని సమాజ నిర్మాణాన్ని తడు త్వరగా అంగీకరిస్తాడు. కోటి కార్మికులతో ఏర్పడిన పరిచయం వలన యితని భావాలు విశాలమౌతాయి. యితర కార్మికులందరితోను కలసికాను ఉత్పత్తిలో పాల్గొంటాడు కనుక సాముదాయక ఉత్పత్తి అనే భావమితని కతిసహజంగా గోచరిస్తుంది. ఉత్పత్తియొక్క సాముదాయక స్వత్వమనే భావంఅనే మెట్టును సులభంగా యితనెక్కగలుగుతాడు.

స్వీయ ప్రయోజనార్థమై యజమానులే మరలు మూసిన కార్మికుని మనస్సులో తమ ప్రయోజనాలకొరకు కార్మికులు మాత్రమేల ఏకం కారాదు? అనే ప్రశ్న ఉదయిస్తుంది. నాయకులూ సంఘాలను ప్రారంభిస్తారు. కర్మాగారంలోను, పట్నంలోను మానవసాధ్యమైన మహా కార్యాలను పరికించి, ప్రకృతి శక్తులను నానాటికీ మానవుడెల్లా లొంగదీసుకుంటున్నాడో కార్మికుడు గుర్తించి, మానవాతీత శక్తులన్న భయమును మాని స్వప్రయత్నంపై ఆధారపడ నారంభిస్తాడు.

విద్యావ్యాప్తిమొదలైన యితర ప్రచారాన్నంతటిని ముఖ్యంగా కార్మికులమధ్య చేసినప్పుడే అత్యధికంగా పోషిస్తు ఆదర్శాలు, ఆశయాలు ఫలిస్తాయి. అందుచేతనే శాస్త్రీయ సామ్యవాదం కార్మిక జనసామాన్యం త్వరలోనే సోషలిజాన్ని స్వీకరించగలుగుతారని నొక్కి వక్కాణించింది. అట్టి జనసమూహాన్ని సామ్యవాదానికి తెచ్చుటకై యితరవర్గాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయకనే ప్రధానంగా కార్మికవర్గంలో తమ ప్రచారాన్ని తీవ్రతరం చేస్తారు.

రవాణా సౌకర్యాలు పెరిగి, గ్రామాలకు, పట్నాలకు సన్నిహిత సంబంధాలు ఏర్పడటంతో పల్లె ప్రజల్లోకూడ సోషలిస్టు ప్రచారం చేయుటకు అవకాశాలు పెరుగుతున్నాయి. కాని సోవియట్ రష్యా ఉదాహరణ చూచినట్లయితే రైతు సమిష్టి వ్యవసాయ పద్ధతులను చివరకు అంగీకరించినప్పటికీ కార్మికులు పరిశ్రమలను, గనులు, కర్మాగారాలు రైల్వేలు మొదలైన వాటిని జాతిపరం చెయ్యటాన్ని అంగీకరించినంత సులభంగా రైతులు సోష

లిస్టు పద్ధతిలో వ్యవసాయాన్ని కొనసాగించటానికంగీకరించరని మనకు బోధపడుతుంది.

## ప్రకరణం 16.

# ప్రథమ ఇంటర్నేషనల్‌లో చీలికలు, మార్క్స్ మరణాల అనంతరం

ప్రథమ ఇంటర్నేషనల్‌లో మార్క్స్—బకునిన్‌ల కలతలతో బయటపడిన చీలికలవలన దాని కార్యస్థానం న్యూయార్కుకు మార్చబడిన తరువాత మార్క్స్, ఎంగెల్సులు యూరప్, అమెరికా ఖండాల సోషలిస్టు, కార్మికోద్యమాలకు సలహాదారులుగా పనిచేస్తూనే సిద్ధాంత గ్రంథరచనకు తీవ్రంగా పూనుకున్నారు. వారా దశలో వ్రాసిన జాబులు, కరపత్రాలు, ప్రణాళికల సంఖ్యాధిక్యతను కనుక చూచినట్లయితే వారివద్దకు మంత్రాంగా తెల్సుకుందామని వచ్చిన వారెవ్వరూ ఖాళీచేతులతో, సరిగా చెప్పాలంటే ఖాళీ బుర్రలతో తిరిగి వెళ్ళలేదని స్పష్టంగా బోధపడుతుంది.

1883 లో మార్క్స్ మరణంతో యావత్తర కార్యభారమంతా ఎంగెల్సు భుజస్కంధాలపై పడింది.

మార్క్స్ చనిపోయినాటికి అప్పుడే ఎంగెల్సు వయస్సు అరువది మూడేండ్లు. అయినప్పటికీ అతిపట్టుదలగా ఆయన తనయొక్క, మార్క్స్ యొక్క సిద్ధాంతాలను వ్యతిరేకుల దాడినెదుర్కొని బలపరచటమే కాక, వ్యాసాలు, కరపత్రాలు రచించుటద్వారా—ఆనాటి ముఖ్య సమస్యలను చారిత్రక భౌతికవాదదృష్ట్యా పరిశీలించి వాటికి పరిష్కారమార్గాలు చూపటమే కాక, తన తాత్విక, చారిత్రక పఠనాన్ని, పరిశీలనను కొనసాగించి, దేశదేశాల సోషలిస్టు, కార్మికోద్యమాలకు సలహాదారుడుగా తోడ్పడి ప్రప్రథమ, ప్రధాన బాధ్యతగా తానెంచి ప్రారంభించిన మార్క్స్ 'పెట్టుబడి' గ్రంథ తృతీయభాగ పూరణంకూడ చేశాడు. 'పెట్టుబడి' యొక్క మూడవ భాగానికి 1894 లో పీఠిక వ్రాస్తూ అందులో మార్క్స్ మరణానంతరం తన జీవితాన్ని గురించి ఎంగెల్సు స్వయంగా వర్ణించుచున్న భాగాన్నిక్క

ద వ్యవహరించడం కన్న మార్క్స్ మరణానంతరపు ఎంగెల్సు జీవితాన్ని గురించి వివరంగా చెప్పడం కష్టమనుకుంటాము. పైగా, దానివలన మహాగ్రంథమైన 'పెట్టుబడి' రచనలో ఎంగెల్సు కున్న పాత్రాధిక్యత కూడా మనకు తెలియవస్తుంది

"ఒకటి విషయం, నా కంట్లజబ్బు వలన అనేకఏండ్లుగా అనుకున్నంత వ్రాయలేక పోతున్నాను. ఈనాటికీ కల్పిత కాంతి సహాయంతో కొద్దిగా వ్రాస్తాను అంతే తప్ప హెచ్చుగా వ్రాయటానికి సాధ్యం కాకుండా వుంది.

"ఇదిగాక, మార్క్స్ యొక్క, నా యొక్క పాతరచనల పునర్ముద్రణలు, అనువాదాలు, దిద్దుబాట్లు, భూమికలు, అనుబంధాలు వీటన్నిటితో రకు తగిన ప్రత్యేక గ్రంథావలోకనం మొదలైన పనులన్నీ వచ్చాయి. ముఖ్యంగా 'పెట్టుబడి' ప్రథమ భాగ ఆంగ్లానువాద, 'పెట్టుబడి' మూడవభాగ రచనలకై నా కాలంలో చాలభాగం వినియోగింపబడింది. తృతీయభాగ పూరణకు అధిక బాధ్యత నాదే. గత పదిసంవత్సరాలలో సోషలిస్టు వాఙ్మయంలో వచ్చిన బ్రహ్మాండమైన అభివృద్ధి, ముఖ్యంగా మార్క్స్ యొక్క, నాయొక్క ప్రథమరచనల అనువాదాల సంఖ్య చూచిన వాళ్లెవరూ అన్ని భాషానువాదాలకు సహాయం చేసి, దిద్దుబాట్లను చేసినందుకు (నేనే అభినందించుకున్నట్లు) అభినందించక మానరనుకుంటాను.

సోషలిస్టు వాఙ్మయాభివృద్ధితో పాటు అంతర్జాతీయ కార్మికోద్యమం కూడ యితోధికంగా వృద్ధిచెందింది. దానితో నా బాధ్యతలు కూడ పెరిగాయి. మార్క్స్, నేను ఉద్యమంలో ప్రవేశించిన నాటినుండి దేశదేశాల సోషలిస్టుల, కార్మికుల జాతీయోద్యమాలతో సన్నిహిత సంబంధాలు పెట్టుకునే బాధ్యతవహించాం. మార్క్స్, జీవించి యున్నంతవరకూ పై భారమంతా తానొక్కడే వహించి యున్నాడు కాని తర్వాత నానాటికీ పెరుగుతూన్న ఆ కార్యభారమంతా నా ఒక్కనిపైననే పడింది.

"ఈలోగా వివిధదేశాల లేబరుపార్టీలమధ్య ప్రత్యక్ష సంబంధాలు పెట్టుకునే పద్ధతి ప్రారంభమై, నానాటికీ అదృష్టవశాత్తూ ఆ సదాచారం వృద్ధి చెందుతోంది. అందుచేత నాపై నున్న బాధ్యత కొంతవరకు తగ్గినా,

నా సిద్ధాంత పరిశీలనా కార్యభార దృష్టితో నాపైనున్న భారమింకా అధికమేనని చెప్పాలి, కాని ఏబదియేండ్లకు పైగా విప్లవోద్యమంలో పాల్గొన్న నావంటి వాడెవడూ విప్లవ కార్యకలాపాలను అవశ్యాచరణీయమైన విధిగా యెంచి వెంటనే నిర్వర్తించక, వాయిదాలు వేసి తప్పించుకో జాలడు. 16-వ శతాబ్దంలో వలెనే, ప్రజల్లో అపూర్వచైతన్యం వెల్లివిరుస్తున్న మా కాలంలో కూడా ప్రజల కార్యకలాపాలలో పాల్గొనక బయటనుండి శుష్క సిద్ధాంతాలు వల్లించే పెద్దమనుష్యులెవ్వరూ అభివృద్ధినిరోధకుల పక్షంలోనే తప్ప ప్రజాపక్షంలో కలికానికైనా కనిపించరు. అందుచేత వారిని అభివృద్ధినిరోధకుల హంగుదారులనాలే తప్ప, శాస్త్రీయ సిద్ధాంత కర్తలనటం తగదనుకుంటాను.

"లండన్ నివాస కారణంగా శీతకాలంలో ఉత్తరప్రత్యుత్తరాల ద్వారాను, వేసవిలో ఉద్యమ కార్యకర్తలతో ప్రత్యక్ష సంభాషణల ద్వారాను మాత్రమే పార్టీతో సంబంధం పెట్టుకో గలుగుతున్నాను.

"ఈ కారణంచేతను, అంతకంతకధికంగా కొత్తదేశాలను వ్యాపించుతున్న మా ఉద్యమంతోను, అంతకన్న హెచ్చుగా పెరుగుతున్న పార్టీ పత్రికలతోను సంబంధం కలిగియుండవలసిన కారణంచేతను, కొన్ని పనులు శీతకాలానికి ప్రత్యేకించ వలసివస్తోంది.

"డెబ్బదియేండ్లు దాటినవారి మానసిక శక్తియుక్తులు మాగగించి పని చెయ్యటంలో వెనుకటి చురుకుదనం వెనుకపడుతుంది. అందుచేతనే ఒకశీత కాలంలో పూర్తి చెయ్యలేకపోయినపని మరుసటి ఏడు శీతకాలం వరకు ఆపి వేయవలసి వస్తోంది.

"ముఖ్యంగా అతిక్లిష్టమైన అయిదవ ప్రకరణం విషయంలోయిదేజరిగింది.

"నేను పైన చెప్పిన విషయాలనుబట్టి 'పెట్టుబడి' గ్రంథ ద్వితీయ భాగాన్ని సంపాదించటానికీ, తృతీయ భాగాన్ని సంపాదించటానికీ చాలతేడావుందని పాఠకులు గుర్తిస్తారనుకుంటాను. తృతీయ భాగ పూరణానికి నాదగ్గరగల ఆధారమల్లా ప్రాథమిక చిత్తుప్రతి మాత్రమే. అదికూడ చాలఅసమగ్రంగా వుంది.

"ఈవిధ ప్రకరణాల లోని మొదట పేజీలు కొన్ని మాత్రం విశదంగా

ను. మంచి శైలిలో నిండున్నాయి. కాని చదివేవారికి వివరణ అసమగ్రంగాను, సంక్షిప్తంగాను వుంది. వాదన క్రమంలో యెక్కడ పొందుపరచాలో అనే విషయం భావి నిర్ణయానికి వదలిన యితర విషయ చర్చ కనిపిస్తుంది. మనస్సులో పుట్టిన భావాలను వచ్చినవి వచ్చినట్లుగా కాగితంపై పెట్టినదీర్ఘ, సమ్మిశ్ర వాక్యాలు గోచరిస్తాయి. అనేకచోట్ల గస్తూరీ, విషయ వివరణ పద్ధతిచూచి రచయిత అధికశ్రమచేత అప్పటికప్పుడే అనారోగ్య ప్రభావానికి లోనవుతూన్నట్లు మనకు స్పష్టంగా గోచరిస్తుంది. ఈ అనారోగ్య కారణంగానే మొదట్లో మార్క్స్ రచనా న్యాసంగాన్ని కష్టంతోను, తర్వాత అప్పుడప్పుడు పూర్తిగా ఆపివేస్తూనూ కొనసాగించాడు.

“1863–1867 సంవత్సరాల మధ్య కాలంలో మార్క్స్ ఒక్క ‘పెట్టుబడి’ గ్రంథ ద్వితీయ, తృతీయ భాగాలకు ప్రాథమిక చిత్తుప్రతులు వ్రాయటమే కాక, ప్రథమ భాగ శుద్ధ ప్రతిని ప్రచురణకు తయారుచేసి యివ్వటమే కాక. అంతర్జాతీయ కార్మిక సమితి స్థాపనా, వ్యాపనా కార్యకలాపాలలోకూడ విశేషంగా పాల్గొన్నాడంటే ఆశ్చర్యకరమైన విషయంగా కనిపిస్తుంది. ఇట్టి విశేష కార్యభారం చేతనే ఆయన అనారోగ్యానికి గురిఅయ్యాడు. ద్వితీయ, తృతీయ భాగాలకు మెరుగులు దిద్ది శుద్ధప్రతుల తయారుచెయ్యలేక పోవడానికి కూడ యీ అనారోగ్యమే అటంకమైంది.’

## ప్రకరణం 17.

# కుటుంబం, దానిపుట్టుపూర్వోత్తరాలు

“కుటుంబం, వ్యక్తిగత ఆస్తి. రాజ్యాంగం; వాటిపుట్టు పూర్వోత్తరాలు” అనేవిశేష ప్రఖ్యాతిగాంచిన తన గ్రంథాన్ని ఎంగెల్స్ 1884 లో ప్రచురించాడు.

ఆ గ్రంథ ప్రథమ ముద్రణయొక్క పీఠికను స్వీయసహజ వినయంతో యీవిధంగా ప్రారంభించాడు; “ఈ గ్రంథ రచన, మార్క్స్ మహాశయుడు చనిపోతూ నాకప్పగించిన కార్య పూరణయని చెప్పవచ్చును. మోర్గన్ చేసిన పరిశోధనలను స్వయం—కొంతవరకు మా యిద్దరి—చారిత్రక భౌతి

కవాద దృష్టితో పరిశీలించి వాటిపూర్తి ప్రాధాన్యతను లోకానికి చాటి పనిని మార్క్సు తలపెట్టుకుని యున్నాడు నలుబదియేండ్ల క్రితం, మార్క్సు రూ చారిత్రక భౌతికవాద సిద్ధాంతాన్నికే కనిపెట్టాడో మోర్గన్ కూడ అదే సిద్ధాంత నిర్ణయానికి వచ్చియున్నాడు; అనాగరికతకు నాగరికతకు మధ్యగల తేడాపాడాలను చూపటంలో ముఖ్య విషయాలలో మార్క్సు నిర్ణయాలకే సరిగా మోర్గన్ కూడ చేరాడు. మార్క్సుయొక్క 'పెట్టుబడి'ని జీతానికి పనిచేసే జర్మన్ అర్థిక శాస్త్రవేత్తలు నిర్లక్ష్యంచేసి అణచివేయ దానికి ప్రయత్నించి, అది సాధ్యంకాక దానిలోని భాగాలను యేవిధంగా దొంగిలించ పూనుకొన్నారో, ఇంగ్లచరిత్రకారులు మోర్గన్ యొక్క "పురాతన సమాజం" విషయంలో కూడ సరిగా అదేవిధంగా ప్రవర్తించియున్నారు. నాగచన, మృతజీవినైన నాప్రియమిత్రుడు చేయలేని పనికి, కొంతమైన ప్రత్యామ్నాయం మాత్రమే నని విన్నవించుకున్నాను."

ఈయీ చిన్న పుస్తకంలో పై గ్రంథ సమీక్ష చెయ్యడంకష్టమే అయినప్పటికీ దాని ప్రాశస్త్యం, ప్రాధాన్యతల దృష్ట్యానుబట్టిసాధ్యమైనంత సంగ్రహంగా యిక్కడపొందుపరచ ప్రయత్నిస్తాను.

మోర్గన్ పరిశోధనలోని లోపాలను పూరించి, గణాల, కుటుంబాల అభివృద్ధిని గురించిన "పురాతన సమాజం"లోని విలువైన విషయాలనభివృద్ధిచేసి దానికి చారిత్రక భౌతికవాద సిద్ధాంతాన్నన్వయించి, ఎంగెల్సు సమాజంయొక్క ఆర్థికాభివృద్ధితో పాటు పురాతన గుంపుపెండ్లి పద్ధతినుండి నేటిఏకభార్యా భర్తృత్వ పద్ధతికి కుటుంబ వ్యవస్థ యేవిధంగా మార్పుచెందుతూ వచ్చిందో దీనిలో వివరించారు.

దేశ కాలాలను, పాలకవర్గ ప్రయోజనాలను అనుసరించిజనించిన ప్రతియితర వ్యవస్థవలెనే నేటికుటుంబ వ్యవస్థకూడ; అది ప్రస్తుతప్రత్యేక సంఘానికి తగినదైనా కాదా అనేదిగోచర లేకుండానే, స్త్రీపురుషులమధ్య పుదరలిసిన సహజమైనటువంటి, పవిత్రమైనటువంటి వ్యవస్థగా పరిగణింపబడుతోంది.

ప్రతియితర సాంఘిక వ్యవస్థలవలెనే కుటుంబవ్యవస్థకూడ దీర్ఘచరిత్రయుంది. సామాజికాభివృద్ధితోను, వ్యక్తిగత ఆస్తివిధానాభివృద్ధితోను అది

అభివృద్ధి చెందుతూ వచ్చింది. అటువంటి సామాజికదశలో అతి పురాతనమైన గుంపుపెళ్ళి పద్ధతివ్యాప్తిలో యుండేది.

సమాజం అటువంటి దశనుండి అనాగరిక దశను చేరుకునేసరికి జంట పెళ్ళిళ్ళు అమలులోకివచ్చాయి. ఈ పద్ధతిలో ఒక పురుషునకొక ప్రధానభార్య యుండేది. ఆ స్త్రీకాపురుషుడు ప్రధానభర్తగా వుండేవాడు. బంధువుల మధ్య వివాహాలు నానాటికీ నిషేధింపబడుతూ వచ్చాయి. కాని సమాజం గణాలుగా విభజింపబడి యున్నంతకాలం ప్రస్తుతం మనం చూస్తున్న వివాహవ్యవస్థ లేనేలేదు.

పైగా ఆనాటి కమ్యూనిస్టు కుటుంబ వ్యవస్థలోని స్త్రీలందరూ లేక చాల మంది ఒకేగణానికి చెందియుండేవారు. వారిభర్తలు మాత్రం వివిధగణాలనుండి వచ్చేవారు. పైగా ఆ కుటుంబాలలో స్త్రీల ప్రాధాన్యత చాల అధికంగా వుండేది. స్త్రీలు ప్రస్తుతంవలె పురుషులకు దాస్యం చెయ్యటం మాటలకైనా కలికానికైనా కనిపించేది కాదు. ఆర్థర్ రైట్ అనబడే ఎన్నేళ్ళు యీ క్రైస్తవమతాన్ని సంఘంలో ప్రచారంచేశాడు, "సర్వసాధారణంగా గృహ యాజమాన్యమంతా కుటుంబంలోని స్త్రీ ముఖ్యుల చేతుల్లో వుండేది, ...... యింటిలోని సరుకులన్నీ అందరికీ చెందినవి. కి, విరామం, విశ్రాంతి లేకుండా గాడిదలవలె చాకిరీ చేసి ఆహారం సమకూర్చలేని దురదృష్టవంతుడైన భర్తగాని, ప్రియునిగాని మాత్రం పాపం బాధపడకతప్పదు. ఇంటిలో అతనికి ఎందరుబిడ్డలున్నా లెన్ని సామానులతనివైనా అతనిపై ముసుగువేసుకొని నడువమని ఆజ్ఞాపించబడినట్లయితే వెంటనే పోవలసిందే. ఒకవేళ ఉల్లంఘించ నిరాకరిస్తాడా, అతనిపని చెడిందన్నమాటే!...... దాని తర్వాత తన స్వగణాన్ని చేరుకోవటమో, లేక వేరొక గణంలో తిరిగి వివాహసంబంధ మేర్పర్చుకోవటమో చేసేవాడు తెగలలోకూడ, గణాలలో వలె స్త్రీలదే పెత్తనం వారే, అవసరమైతే తెగ నాయకుని 'కొమ్ములూడగొట్టి' (అంటే అతనినాయకత్వానికి స్వస్తి చెప్పి) అతనిని సాధారణ సైనిక శ్రేణిలోకి పంపటానికి కూడ సంకోచించేవారు కారు.

కాని, ఐశ్వర్యాభివృద్ధితోను వ్యక్తిగతఆస్తి విధానారంభంతోను యీపరిస్థితులన్నీ, మారిపోయాయి.

ఒకగణంలోని వివిధ స్త్రీ పురుష సభ్యులు వివాహం చేసుకోరాదనే నియమమున్నప్పటికీ, తల్లిదండ్రులు గతించి, వారిఆస్తికి వారసురాలైన యువతి మాత్రం ఆమె ఆస్తితో పరగణానికి పోకుండా వుండేందుకుగాను స్వగణంలోనే వివాహం చేసుకునే హక్కు కల్పించబడ్డ విషయం చూచినట్లయితే గణాల సమాజ చివరిదశ వచ్చేసరికే ఆస్తి సమస్య యెంతప్రాముఖ్యత వహించినదీ మనకు తెలుస్తుంది. వారసత్వ శాసనాలెంత మారినప్పటికీ ఆస్తి పెరగణానికి పోగూడదనే సూత్రం మటుకు అమలు జరుపబడుతూనే వస్తోంది

గణసమాజ నిర్మాణాన్ని గురించి ఎంగెల్సు యీవిధంగా వ్రాశాడు: "గణసమాజ నిర్మాణంయెంత అద్భుతమైనది! బిడ్డలమనస్సువలె ఎంతసరళమైనది! సైనికులు, పోలీసులు, సి. ఐ. డీలు, ప్రభువులు, రాజులు, రాయబారులు, గవర్నర్లు, న్యాయమూర్తులు, జైళ్ళు, కేసులు మొదలైన వేవీ లేకపోయినప్పటికీ సమస్త కార్యాలు సక్రమంగా జరిగిపోతుండేవి. గణాలలోగాని, తెగలలోగాని వచ్చేతగవులన్నీ తమలోతామే పరిష్కరించుకునేవారు. గత్యంతరం లేనప్పుడు మాత్రమే రక్తవ్యయంతో కూడిన ప్రతీకారం జరిగేదినాగరకతలోని లాభనష్టాల మాట అటుంచి యీనాడుఅమలులోనున్న ఉరిశిక్ష విషయం కనుక చూచినట్లయితే అది వారు రూపంలో ప్రాణహరణ ప్రతీకారం తప్ప మరేమి కాదు, నేటికంటె అనాడు పరిష్కరింప బడవలసిన సమస్యలధికంగా వుండినప్పటికీ ఒక్కొక్క గృహంలో అనేక కుటుంబాలు కలసి సంయుక్తంగా కమ్యూనిష్టు పద్ధతిలో నివసించేవి. భూమి అంతా తెగయొక్క సంయుక్త యాజమాన్యం క్రింద వుండేది. చిన్నచిన్న తోటలు మాత్రమే కుటుంబాలకు తాత్కాలికంగా ఒసగబడేవి. అయినప్పటికీ నేటి శాఖోప శాఖలతో కూడిన క్లిష్ట పరిపాలనా యంత్రాంగం అవసరం అనాడెంత మాత్రం లేకపోయింది. సంబంధిత వ్యక్తుల, గణాల, తెగలచేతనే నిర్ణయాలు చేయబడేవి. తరుమగా పూర్వ శతాబ్దాల సాంప్రదాయానుగుణ్యంగా నిర్ణయాల జరిగి పోతూండేవి. ఆసమాజంలో పేదలుగాని, వాంఛలీడేరని బాధితులుగాని ఉండటానికి అవకాశంలేదు.—గణసమాజపు సంయుక్త కుటుంబాలలో ముసలివారు, రోగులు. యుద్ధంలో వికలాంగులైన

వారు సరియైన రక్షణ పొందేవారు— స్త్రీలతో బాటు ఆ సమాజంలో సర్వ జనులూ సమానత్వాన్నీ, స్వతంత్రాన్నీ అనుభవించేవారు.''

గణసమాజపు వ్యవస్థలన్నీ ఏ తెగకా తెగలోనే తప్ప ఇతర తెగలలో గౌరవింపబడేవి కావు. తరుచు తెగలమధ్య పోరాటాలు జరుగుతుండేవి. వ్యక్తిగత ఆస్తివిధానాభివృద్ధిలో వారసత్వశాసనాలు మారి, కొంత కాలానికి తండ్రినుండి కొడుకులకు ఆస్తిహక్కు సంక్రమించే పితృస్వామిక శాసనం అమలులోనికి వచ్చింది. దానితో కొన్ని కుటుంబాలకు అధికాధికారాలు సంక్రమించాయి. ఉత్పత్తి సాధనాలు, వాటితోబాటు ఐశ్వర్యోత్పత్తికి కావలసిన శ్రమ పెరగడంతో బానిసత్వం వాడుకలోకి వచ్చింది. దానితో కుటుంబం పితృస్వామిక రూపంలోకి, ప్రస్తుతకుటుంబ ప్రాథమిక రూపంలోకి మారి బలపడటం తత్ఫలితంగా గణసమాజపు కుటుంబ పద్ధతి నానాటికీ బలహీనపడి చివరకు కలవర్గాలు, లేనివర్గాలను దోపిడీ (వ్యక్తిగత బానిసలుగా గాని, కూలీలుగాని) చేసే ప్రస్తుత సమాజ ప్రాథమిక దశకు తావిచ్చి నశించిపోయింది.

గ్రీకు సమాజం గణ విధానమునుండి, రాజకీయసమాజంగా ఏవిధంగా పరిణామం చెందినదీ వ్రాస్తూ మోర్గన్ దీనికంతకూ వ్యక్తిగత ఆస్తియే మూలశక్తి యన్నాడు. "ఆస్తియే మార్పును కోరే శక్తి, పౌరజీవితము, వ్యవస్థలు. బ్రహ్మాండమైన నగరాలలో ఐశ్వర్య కేంద్రీకరణము, వీటివలన జీవిత విధానంలో కలిగిన విశేషమైన మార్పులే గణసమాజపు వ్యవస్థలను నిర్మూలించేందుకు మార్గాన్ని సుగమం చేశాయి."

ప్రకరణం 18.

# సమాజంలో స్త్రీల స్థానం

దీనితో సామాజిక వ్యవస్థలో కార్యంగా గృహం యొక్క ప్రాధాన్యత తరిగి, సంఘం యొక్క సామాజిక జీవితం కొత్తపరిశ్రమల్లోనికి మారుటవల్ల వాటి ప్రాధాన్యత పెరిగింది. ఇదివరకు మాదిరిగానే జీవనోపాయాల కొరకు కృషిచేయవలసిన పురుషుడు మనుషులకు, భూమిని మున్నే పరికరాలకు, తర్వాత తర్వాత బానిసలకు యజమానిగా మారి పూర్వంలాగ

కుటుంబ జీవితం సామాజిక కార్యం కాక, పూర్తిగా వ్యక్తిగతమైనదిగా మారిపోవటంచేత సమాజంలో 'ప్రథమ' స్థానాన్నాక్రమించు కోవటం, స్త్రీకి 'ద్వితీయ' స్థానం లభించుట జరిగింది.

అదే సమయంలో పురుషుడు తన సంతానానికే ఆస్తి సంక్రమించాలనే వాంఛతో—తన సంతానమెవరో తన కిప్పుడు తెల్సుతు గాన—తన మాతృక అధికారాలను వినియోగించి వారసత్వ శాసనాలను తల్లినుండి కాక తండ్రినుండి సంక్రమించే పద్ధతికి మార్పించి కుటుంబంలోను, సమాజంలోను తన స్థానాన్ని మరింత బలపరచుకున్నాడు. చరిత్రగతిలో ఒక్కొక్కదశలో యేయితరవర్గం వలెనే స్త్రీవర్గం కూడ (పురుషునికన్న) హీనత్వ కారణంగా కాక జీవనోపాయాలు ఎవరి చేతుల్లో వున్నాయి, వ్యక్తిగత ఆస్తియే విధంగా వృద్ధిచెందింది అనే విషయంపై ఆధారపడియే అధికార చ్యుతిని పొందింది.

స్త్రీల సమస్యలను చెప్తూ ఎంగెల్స్ విధంగా అన్నాడు. "మన కాలపు బ్రహ్మాండమైన పరిశ్రమలే తిరిగి స్త్రీలకు సామాజికోత్పత్తిలో పాల్గొనే అవకాశం కల్పిస్తాయి.........కుటుంబపు పని పాటలు వారు చేస్తూ సామాజిక పరిశ్రమలలో వారేమీ సంపాదించుకోలేక పోతారు. అట్లు కాక స్వతంత్రంగా జీవించే వుద్దేశంతో పరిశ్రమల్లో వారు పాల్గొనదల్చుకుంటే కుటుంబ కార్యాలు చేసుకోలేక పోతారు. ఒక్క మిల్లులలోనే కాక, వైద్య వ్యాయామశాఖలతో సహా అన్ని వ్యాపార రంగాలలోను వారు ప్రవేశిస్తారు.

"ఆధునిక కుటుంబం కొన్ని సమయాల్లో ప్రత్యక్షమైనట్టువంటి మరి కొన్ని సమయాల్లో పరోక్షమైనట్టువంటి స్త్రీయొక్క గృహదాసత్వంపై ఆధారపడి వుంది. మరి ఆధునిక సమాజమిట్టి ఏక భార్యాభర్తృత్వ కుటుంబ ఖండాలతోనే నిర్మింపబడింది. సర్వ సాధారణంగా కుటుంబంలోని పురుష వ్యక్తి కృషిచేసి, సంపాదించి కుటుంబ పోషణచేసుకొంటాడు. అందుచేత అతను పెత్తనం చెలాయించటానికి వేరేవిధమైన శాసనబద్ధాధికారమూ అవసరంలేదు. కుటుంబంలో పురుషుడు పెట్టుబడిదారీ వర్గానికీ, స్త్రీ కార్మిక వర్గానికీ ప్రాతినిధ్యం వహిస్తారు.........బహిరంగ పరిశ్రమలన్నింటిలోకూ స్త్రీలను యావన్మందినీ తిరిగి ప్రవేశపెట్టటమే స్త్రీల నీదాస్యాన్నుండి

విముక్తి చెయ్యటానికి ముఖ్యమార్గంగా కనిపిస్తోంది. సమాజంలో ఏకభార్యా భర్తృత్వకుటుంబం పారిశ్రామిక ఖండంగా పనిచెయ్యటం మానివేసిన నాడే యిది సాధ్యమవుతుంది............

ఏక భార్యా భర్తృత్వానికి మూలకందమైన ఆర్థికవిధానాన్ని దాని ఫలితంగా అమలులోనికి వచ్చిన వ్యభిచారాన్ని నిర్మూలించే టటువంటి సామాజిక విప్లవదశకు ప్రస్తుతం మనం చేరుకుంటున్నాము. ఒకవ్యక్తి—అందులోనూ పురుషవ్యక్తి—చేతిలో విశేష ధన సమీకరణ జరుగటంవల్ల, అతడు తన సంతానానికే ఆ ఆస్తి నంతనూ సంక్రమింప చేయ ప్రయత్నించటం వల్లనే ఏక భార్యాభర్తృత్వం ప్రారంభమైనది. దీనివల్ల ఏకభర్తృత్వం స్త్రీ పట్ల అవసరమైంది, పురుషుడు అవశ్యంగా ఏకపత్నీకుడై వుండవలసిన అవసరం కనిపించలేదు.........రాబోయే విప్లవ ఫలితంగా వారసత్వంగా సంక్రమించే ప్రత్యేక ఆస్తిలో శాశ్వతమైన, అతి ముఖ్యమైన భాగమైన—ఉత్పత్తి సాధనాలు సమాజపరం చేయుటచే వారసత్వ హక్కు నిర్వీర్యం చేయబడుతుంది.''

ఏక భార్యాభర్తృత్వ విధానానికిగల ఆర్థిక కారణాలు అంతరించి పోయాక కూడ అదివుంటుందా అన్న జోస్యపు ప్రశ్నకు ఊహాగానం ఉపయోగరహిత మనే కారణంతో ఎంగెల్సు జవాబివ్వ నిరాకరించి, కమ్యూనిజం రాకతో వ్యభిచారానికి గల ఆర్థిక కారణాలు లుప్తమైపోతాయి కనుక అదిమాత్రం తప్పనిసరిగా అంతరించి పోతుందని చెప్పాడు. ఏక భర్తృత్వం స్త్రీలంపై విధింపబడినట్లయితే చరిత్రలో ప్రథమ పర్యాయంగా పురుషుల పైకూడ సమంగా ఏకపత్నీత్వం విధింపబడుతుంది.

పోలెవరిత వృధాశ్రమలతో కూడుకున్న నేటి చిన్నచిన్న కుటుంబాలు రూపుమాపి పోవటమే కాక, చట్టబద్ధమైన, చట్టవిరుద్ధమైన సంతానమంతా వానాటికీ ప్రభుత్వమునుండి అధికతర ఆదరణము, రక్షణపొందుటమే కాక చరిత్రలో ప్రథమపర్యాయంగా స్త్రీ పురుషులు కలిసి ఒకరితోకరు అనుకూలంగా జీవించటానికి వారిమధ్య గల ప్రేమానురాగానుభవాలు తాక వేరు కారణాలేమీ వుండవలసిన అవసరం లేని దివ్యపరిస్థితు లేర్పడ్తాయి.

ఇట్టిపరిస్థితులు సిద్ధాంతరూపం లోనే కాక ఆచరణరీత్యా సామాజిక

సమిష్టి సిద్ధాంతంపై జాతీయార్థిక విధాన మాధారపడియున్నట్టి ఒకవేళ సోషలిస్టు దేశమైన సోవియట్ రష్యాలో దాదాపు సంపూర్ణంగా సాధింపబడటం వింతవిషయమేమీ కాదు.

భావిలో స్త్రీ పురుషులు తమ జీవిత విధానాన్నే విధంగా ఏర్పాటు చేసుకుంటారనే విషయం చెప్తూ ఎంగెల్సిలా అన్నాడు; "ధనంతో గాని, యితర ఆర్థిక శక్తి సాధనాలతో గాని స్త్రీ సంయోగాన్ని ఎన్నడూ ఎట్టి పరిస్థితులలోనూ కూడ పొందజాలని పురుషులూ, ప్రేమ వినా యితర ఏ కారణం వల్లగాని పురుషులకు లొంగవలసిన అవసరం లేని, ఆర్థిక యిబ్బందుల భయంతో తమ ప్రియులతో కలియలేని దుస్థితి లేనటువంటి స్త్రీలూ గల ఒక నూతన తరం బయలుదేరి అభివృద్ధి చెందిననాడే యీ విషయం నిర్ణయింప బడుతుంది. అట్టితరమే తయారైననాడు వారి భావాలకూ, యీనాటి మన భావాలకూ పొందూ పొలికా వుండవనుకుంటాను. అప్పుడొక క్రొత్త కార్యాచరణ విధానం, ప్రజాభిప్రాయం అమల్లోనికి వస్తాయి. ఈ విషయమై యింతమాత్రమే చెప్పదలచుకున్నాను.

ఐశ్వర్య కేంద్రీకరణ ఫలితంగానే, ఆస్తిపైన, ఉత్పత్తి సాధనాలపైనా వ్యక్తిగత స్వత్వమూ, వ్యక్తిగత స్వత్వమును నిలవరిచే వెన్నంటియుండు వర్గభేదాలు పురుషజాతికి స్త్రీజాతి దాస్యం చెయ్యడం సంభవిస్తాయి. కానైతే వ్యక్తిగత స్వత్వం భస్మాసురవరం లాంటిది, చివరకు దానినదే నాశనం చేసుకుంటుంది. వ్యక్తిగత ఆస్తి, వర్గపెత్తనాల వలన జనించే సమస్యలు అంతకంతకు క్లిష్టతర మౌతాయి. పెద్దపెద్ద పట్నాలూ, నగరాలు తయారయాయి. వాటిలోని బ్రహ్మాండమైన కర్మాగారాలలోను, ఫాక్టరీలలోను వేలాదిగా కార్మికులు కేంద్రీకరింపబడి తమ హక్కులకోసమై సమీకరింపబడ్డారు. మరల వచ్చే వాణిజ్య సంక్షోభాల కారణంగా నిరుద్యోగం ప్రబలింది. ఒకవంక దిక్కులేని దైన్యమూ, దాని ప్రక్కనే అశ్రుతపూర్వమైన భోగవిలాసాలూ గోచరమౌతున్నాయి. వ్యక్తిగత ఆస్తిపరులకు సాముదాయిక ఉత్పత్తి పద్ధతులంగీకరించక తప్పటంలేదు—ముక్తసరిగా చెప్పాలంటే పారిశ్రామిక జీవితలక్షణాలన్నీ ఉత్పత్తి. మారక విధానాలలోని వ్యక్తిగత స్వత్వానికి, దానితోబాటు వర్గ, పురుష పెత్తనాలకు అతిశీఘ్రంగా చితిని పేరుస్తున్నాయి.

అయితే, యిదంతా తప్పక జరిగి తీరుతుందని నేను ధీమాగా చెప్తున్నానంటే నా వుద్దేశం మనమంతా యేమీ చెయ్యకుండా చేతులు ముడుచుకూర్చోవాలని యెంతమాత్రం కాదు. సమాజంలో ఏపనికైనా మానవులే సాధిస్తారు. కాని వీరి మానసిక తత్వం మాత్రం తమ కాలపు ఆర్థిక పరిస్థితుల వలన మలచబడుతుంది; తిరిగి వీరి మానసికతత్వం ఆర్థికపరిస్థితులపై ప్రభావంచూపి వాటిని మారుస్తుంది.

స్వస్వీయ ప్రయోజన రక్షణార్థము, ఒకవిధంగా అనుద్దేశ పూర్వకంగాను కార్మికులు నిరంతర వర్గపోరాటం జరుపవలసివస్తుంది. ఆర్థిక పరిస్థితుల ప్రభావ కారణంగా వీరిలో కొందరు యీవర్గపోరాట ప్రభావాన్ని వ్యక్తిగత ఆస్తిని రద్దుచేసి, సోషలిస్టు ప్రజారాజ్యాన్ని, చివరకు కమ్యూనిజాన్ని స్థాపించ వలెననే ఆశయాన్ని గుర్తిస్తారు. ఈపవిత్రాశయార్థమై మన మెంత అధిక చైతన్యంతోను, పట్టుదలతోను కృషిచేస్తామో అంతతొందరగా వర్గ పెత్తనాన్ని రూపుమాపి, సామాజిక విధానాన్ని నానాటికీ వృద్ధిచెందుతున్న నేటి విస్తార ఉత్పత్తి శక్తులకను గుణ్యంగా తయారుచేయ గలుగుతాము.

## ప్రకరణం 19.

# ప్రభుత్వం

ఎంగెల్సు గ్రీసులోని గణ సమాజ పతన ఫలితాన్ని వివరిస్తూ, ఉత్పత్తి చేసే శ్రమజీవులు స్వోపయోగార్థమై కాక, మారకానికై వస్తువులు తయారు చేయటంతో అవియేవిధంగా సరుకులుగా మారుతాయో, వాటిపై శ్రమజీవుల పెత్తన మేవిధంగా వారికి తెలియకుండానే క్రమంగా సడలిపోయిందో వర్ణించాడు. దానిఫలితంగానే సమాజావసరాలతో యేమీ సంబంధం లేకుండా మారకంకొరకై ఉత్పత్తి జరగటమూ, ఉత్పత్తిచేసే శ్రమజీవులు ఉత్పత్తి సాధనాల యాజమాన్యంకు లొంగి దాసిత్వము చేయుటమూ; స్వప్రయోజనార్థమై వ్యక్తులు విడిగా భూమిని పంచిడ ప్రారంభించటమూ దానితో భూమిపై కొలదిమంది వ్యక్తుల అధికార ప్రాబల్యాలు, పెచ్చు-ముం

లకి భూమిపై హక్కు తొలగిపోవటమూ సంభవించాయి.

సరుకుల వుత్పత్తితో, ఇతర సరుకులన్నింటికీ మారకపు సరుకుగా ఉపయోగించే డబ్బు అనే సాధారణ సరుకు తయారైంది. దానితో, సరుకుల ఉత్పత్తి, పంపిణీ, మారకాలు వృద్ధియగుటకు అవకాశాలు పెరిగాయి. దీనితో క్రొత్త సాంఘిక రాజకీయ పద్ధతులు అమల్లోనికి రావలసిన అవసరం కలిగింది. క్రొత్త ఉత్పత్తి విధానాలకు గణసమాజం అనువుగా లేకపోయింది. సమాజంలో శాంతి భద్రతలను కాపాడటం గాని, నూతన ఉత్పత్తి శక్తులను విస్తారంగా వృద్ధిచెయ్యటం గాని, సరుకుల వుత్పత్తిపైన, వర్గవైరంపైన ఆధారపడిన సమాజంలోని ఋణదాతకు, ఋణగ్రస్తునకు గల సంబంధాలను, ఇతర క్లిష్ట సంబంధాలను సక్రమంగా కొనసాగించటంగాని గణసమాజంలో ఇక ఏమాత్రం సాధ్యం కాలేదు. అందుచేత ప్రభుత్వయంత్రం ఆవిర్భవించింది.

ప్రభుత్వయంత్రం మీనాటికీ దేవతా సమానంగాను, శాశ్వతమైనదిగాను పరిగణింపబడుట వల్ల, పరిస్థితుల కనుగుణ్యంగా ఎప్పుడైనా, యెక్కడైనా స్వల్పమైన మార్పులు చెయ్యటం తప్ప దానిని కదపటం సాధ్యము, సత్యము కాదనే భావం ప్రజల్లో ప్రబలియుండటంవల్ల ప్రభుత్వాన్ని గూర్చిన ఎంగెల్సు భావాలనిక్కడ కొంత వివరంగా పొందుపరచట మవసరమనుకుంటాను. శౌర్య ప్రతాపాల కాలవాలమైన పూర్వకాలపు గ్రీసులో గణసమాజాన్ని పునాదులతో కదిపివేస్తున్న శక్తులను గురించి ఎంగెల్సు చర్చిస్తూ ఈ విధంగా పితృస్వామిక కుటుంబాల చేతుల్లో ఐశ్వర్య సమీకరణ జరిగి తదనుగుణంగా చేయబడిన వారసత్వశాసనాల ఫలితంగా గణాధికారాల కన్న కుటుంబాధికారాలే అధికంగా పెరిగాయో. దానితో కుటుంబాల అనువంశిక అధిక్యత, ప్రభువర్గ ప్రాదుర్భావం జరిగాయో, వివరించాడు. ఐశ్వర్య కేంద్రీకరణావకాశాలు పెరగటంతో, మొదట్లో యితర తెగలకు చెందిన యుద్ధఖైదీల, తర్వాత తర్వాత స్వంత తెగలోని పేదలబానిసత్వం ప్రారంభమైంది.

ఎంగెల్సు విధంగా వ్రాశాడు; " ముక్తసరిగా చెప్పాలంటే ధనం మహాద్భాగ్యంగా కొనియాడబడటం, గౌరవింపబడటం, బలాత్కారపు ధనసేకరణను బలపరచుటకు గాను గణసమాజపు పాత వ్యవస్థలను దూషించటం ప్రారంభిస్తోంది గణ సమాజపు కమ్యూనిస్టు సాంప్రదాయాలకు విరుద్ధంగా

వ్యక్తుల ధనసంపాదన సాధ్యము చేయునట్టి, పూర్వంనించీ నీచంగా పరిగణింపబడిన వ్యక్తిగత ఆస్తిని పవిత్రమైనదిగా ప్రకటించి ఆట్టిపవిత్రమైన ఆస్తియొక్క రక్షణయే మానవ సమాజ పరమాశయంగా ప్రకటించునట్టి, నానాటికీ పెరుగుతూన్న ఐశ్వర్యాన్ని కొలదిమంది వ్యక్తులు నిత్యనూతనమార్గాలలో సమాజామోదంతో దోచుకునే పద్ధతుల నంగీకరించునట్టి, నూతనంగా అభివృద్ధిచెందుతున్నట్టి వివిధ వర్గాలు శాశ్వతమైనవనీ కలవర్గాలకు లేనివర్గాలను దోచుకునే హక్కు కలదనీ అనునట్టి ఒకశక్తి మాత్రమే లోపించినది. ఆలోటును తీర్చుటానికే ప్రభుత్వ వ్యవస్థ ఏర్పరుపబడింది.

ఈవిధంగా తమ కులపెద్దనే పాలక, సైనికప్రధానిధిగా ఎంచుకుని, ఒకొక్క స్వకుల రక్షణకొరకై మాత్రమే ఆయుధాలు కలిగియుండే స్వతంత్ర సాయుధజాతికి బదులు "సమాజాభివృద్ధియొక్క ఒకానొకదశలో సమాజములోనుండియే పుట్టినట్టి ప్రభుత్వవ్యవస్థ" బయల్దేరింది. "ప్రభుత్వవ్యవస్థ జనించిందంటే దానిఅర్థం, ఏ సమాజంలో నైతే అది జనించిందో ఆ సమాజం పరిష్కారసాధ్యం కాని పరస్పర వైరుధ్యాల వలలో చిక్కుకుపోయి, బయటపడలేక తికమక పడుతోందన్న మాట." ఈ పరస్పర వైరుధ్యాల, లేక వర్గాలమధ్య జరిగే సంఘర్షణలు వ్యర్థపోరాటాలలో నిలవాలంటే సమాజానికి అతీతంగా వుంటూన్నట్లు కనబడుతూ, యుద్ధాన్ని ఏలికవర్గపు కనుసన్నల మెలగుతూ దాని యుద్ధావేశాన్ని ప్రశమింపచేసే ఒక శక్తి అవసరమైంది. "సమాజంనుండియే ఆవిర్భవించి, సమాజం పైననే పెత్తనం చేలాయించెడి అట్టి శక్తియే ప్రభుత్వవ్యవస్థ."

గణ సమాజాలలో వలె కాక ప్రభుత్వవ్యవస్థలో "ప్రజలు ప్రాంతీయ విభాగాను గుణ్యంగా సమీకరింపబడుతారు. "గణ, తెగ సమాజాలలో లేనటువంటి సాయుధ వ్యక్తులే కాక జైళ్ళు మొదలైన పలురకముల నిర్బంధ వ్యవస్థల"తో కూడిన "ప్రజాసామాన్యానికి చెందనటువంటి ఒక నిర్మాణయుతమైన బహిరంగ సాయుధశక్తి" ఉండటంకూడ ప్రభుత్వవ్యవస్థ యొక్క ప్రత్యేకతే.

ప్రభుత్వ వ్యవస్థా పరిణామాన్ని ఎంగెల్సు వర్ణిస్తూ "చారిత్రక ప్రభుత్వ వ్యవస్థలు చాలవానిలో సభ్యుల హక్కులు వారివారి ఆస్తిపరిమాణాన్ని

బట్టి వేర్వేరుగా వుండేవి. దీన్నిబట్టి లేనివర్గాలకు వ్యతిరేకంగా కలవర్గాల హక్కులను సంరక్షించేందుకే ప్రభుత్వ వ్యవస్థ నిర్మింపబడిందనే నగ్న సత్యం మనకు స్పష్టంగా కనబడుతుంది.'' వర్గనీతి సూత్రాలూ, వర్గాశయాలూ ఆధునిక ప్రభుత్వ వ్యవస్థలలో ఏవిధంగా గాఢంగా అల్లుకుపోయాయో నిరూపించి, కార్మికవర్గం విముక్తి చెందగానే ఆధునిక ప్రభుత్వ వ్యవస్థనంతనూ సమూలంగా రూపుమాపవలసిన అవసరాన్ని గూర్చి ఎంగెల్సు హెచ్చరించాడు.

"అతఃపూర్వమే తయారై సర్వసిద్ధంగావున్న ప్రభుత్వయంత్రాన్ని విముక్తి పొందిన కార్మికవర్గం కైవశం చేసుకుని స్వప్రయోజనార్థమై వినియోగించుకోటం సాధ్యం కాదు,'' అని 1888 లో వెలువడిన "కమ్యూనిస్టు ప్రణాళిక'' నూతనముద్రణయొక్క పీఠికలో ఎంగెల్సు వ్రాశాడు. కార్మికవర్గ విజయంతో, వర్గ ప్రభుత్వ వర్గ పెత్తనాలు నశించిపోతాయి గాన ఆప్రభుత్వ యంత్రాన్ని, కూడ సమూలంగా నిర్మూలించవలసి యుంటుంది. అంటే, ప్రజాప్రాతినిధ్యసంస్థలను నాశనం చెయ్యటం కాక, కార్మికులకు కపట ప్రాతినిధ్యం వహించే సంస్థలను రూపుమాపి యదార్థ ప్రాతినిధ్య సంస్థా నిర్మాణము, దానితో నిరంకుశత్వ—నిర్మూలనం చెయ్యటమే నా ఉద్దేశం. అప్పుడు ప్రత్యక్షపు ఎన్నికలలో కార్మికులనుండి తమనియోజకవర్గపు ప్రజల యిష్టవ్యతిరేకంగా ప్రవర్తించిన మరుక్షణమే తమ బాధ్యతగల పదవీ స్థానము నుండి వెనుకకు పిలువబడే షరతుపై స్వల్ప వ్యవధులలో యెన్నుకోబడే ప్రతినిధుల సంస్థ లేర్పడతాయి. అట్టి సంస్థలలోని వ్యక్తులు సమాజంలోని యితర సాధారణ సభ్యులకన్న అధికులుగా పరిగణింపబడరు. వారిజీతాలు కూడ అంత అధికంగా వుండవు. వారు తమతమ నియోజకవర్గాల ప్రజలనిష్టానుగుణ్యంగా శాసనాలను చేస్తూ వాటిని యితరులందరితో సమానంగా తాము కూడ తు. చ. తప్పకుండా అనుసరిస్తూ, పూర్వం ప్రవర్తింపబడుతూ వుండినటువంటి నిరంకుశత్వ, జబర్దస్తీలనే భూతాలనుద్వాసన చేస్తారు.

ప్రభుత్వ వ్యవస్థవిషయంలో మన దృక్పథమేవిధంగా వుండాలో బోధిస్తూ ఎంగెల్సు చివర యీవిధంగా చెప్పాడు. ఎల్లకాలాల్లోనూ ప్రభుత్వ వ్యవస్థ లేదు. ప్రభుత్వవ్యవస్థ అంటే యేమిటో, దాని ఆవశ్యకత యేమిటో కూడ తెలియని కొన్ని సమాజాలు పూర్వముండి యున్నాయి. ఒకానొక

చారిత్రక దశలో, సమాజంలో ఉత్పాదకాభివృద్ధి కనుగుణ్యంగా జనించిన వర్గ విభేదాల అవశ్య ఫలితంగా ప్రభుత్వ వ్యవస్థ ఉద్భవించింది. కాని యీనాడు ఉత్పత్తి యొక్క అభివృద్ధి క్రమంలో, వర్గ విభజనావశ్యకత నశించటమే కాక ఉత్పత్తికి ప్రబలమైన సంకెలగాకూడ పరిణమించుచున్న ఒకానొక దశను మనం చేరుకుంటున్నాం. అందుచేత ఎనుకటి విధంగానైతే ఆర్థిక పరిస్థితులఅవశ్య ఫలితంగా వివిధవర్గాలు అమలులోనికి వచ్చాయో యీనాడు కూడ అదే విధంగా వర్గ విభేదాలు రూపుమాసిపోవాలి. వర్గ విభజన నిర్మూలనంతో ప్రభుత్వ వ్యవస్థకూడ రద్దయిపోవాల్సి యుంటుంది. శ్రమజీవుల సమాన, స్వతంత్ర భాగస్వామ్యంతో ఉత్పత్తి వ్యవస్థను కొనసాగించే నూతనసమాజపు రాకతో ప్రభుత్వ యంత్రాంగముకూడ తనకు తగిన స్థలమైన రాట్నం, యిత్తడి గొడ్డలి మొదలైన పురాతన వస్తువులన్నీ వుంచబడే వస్తుప్రదర్శన శాలలో చేర్చబడుతుంది.

ప్రభుత్వ వ్యవస్థ పట్ల కార్మికవర్గ మొత్తం దృక్పథం ఏవిధంగా యుండాలో చెప్తూ 'యాంటి డుహ్రింగ్'లో ఎంగెల్సిలా వ్రాశాడు: "ప్రభుత్వాధికారాన్ని కైవశం చేసుకోగానే కార్మికవర్గం ఉత్పత్తి సాధనాలన్నింటిని ప్రభుత్వపరం చేస్తుంది. కాని దానితో కార్మికవర్గం వర్గభేదాలను, వైరుధ్యాలను, వాటితో ప్రభుత్వ వ్యవస్థనే కాక తనను తానే రద్దుచేసుకుంటుంది. గత ప్రస్తుత కాలాల్లో వర్గవిభేదాలతోను, వర్గ వైరుధ్యాలతోను సతమతమైన సమాజాలన్నింటిలోనూ పాలకవర్గ పెత్తనాన్ని పీడితవర్గాలపై కొనసాగించేందుకుగాను ప్రభుత్వవ్యవస్థ అవసరమైయుండేది.

ప్రభుత్వ వ్యవస్థ పురాతన కాలంలో బానిస యజమానుల చేతుల్లో వుండేది. మరి మన కాలంలో పెట్టుబడిదారుల చేతుల్లోవుంది. అందుచేత చివరకు ఏనాడైతే ప్రజలకందరకూ అది నిజంగా ప్రాతినిధ్యం వహించనారంభిస్తుందో ఆనాడు దాని అవసరం నశించిపోతుంది. ఉత్పత్తిపద్ధతుల్లో నేడుగల అరాచక పరిస్థితుల ఫలితంగా జనించినవర్గ పెత్తనము, వ్యక్తిగత ఉనికికై పోరాటము, ఆట్టిపోరాట కారణంగా ప్రభవించే పొరపొచ్చాలు పోరాటాలూ యేనాడైతే అంతరిస్తాయో ఆనాటినుండి పీడింపబడేవారు కూడ యెవ్వరూ వుండరు. అందుచేత, ప్రత్యేక పీడన మార్గాల అవసరంగాని—

పీడక యంత్రమైన ప్రభుత్వవ్యవస్థ అవశ్యకతగాని ఏమీ వుండదు,

"సమాజం తరఫున ఉత్పత్తి సాధనాలపై పెత్తనం వహించటం ఆఖరిపనిని—యావత్తుసమాజానికీ నిజమైన ప్రతినిధిగా ప్రభుత్వ వ్యవస్థ మొట్టమొదటి, కట్టకడపటి పనిగా చేస్తుంది. ఆనాటినుండి సాంఘిక సంబంధాలపై ప్రభుత్వ వ్యవస్థకుగల సంబంధం దానంతటది అంతరించిపోతుంది, ప్రభుత్వ వ్యవస్థకు వ్యక్తులపైగల పెత్తనం నశించి ఉత్పత్తివిధాన నిర్ణయం, వివిధ శాఖల పరిపాలన మిగులుతుంది "ప్రభుత్వ వ్యవస్థ రద్దుచేయబడదు, దానంతటది కృశించి, నశించిపోతుంది.""

కార్మికవర్గం అధికారంలోకి రావటంతోనే సమాజంలోని వర్గవిభేధాలను రూపుమాపి వేస్తుంది. కార్మికవర్గ నియంతృత్వ రూపేణమటద్వారా పాలకవర్గంగా అదితయారై ప్రస్తుత ప్రభుత్వ యంత్రాన్ని ఛిన్నాభిన్నం చేసి దానిస్థానంలో ప్రస్తుత ప్రభుత్వ వ్యవస్థకు పూర్తిగా విభిన్నమైనటువంటి కొత్తరకమైన ప్రభుత్వయంత్రాన్ని నిర్మించుకుంటుంది కమ్యూనిస్టు దశలోకిపూర్తిగా సమాజం మారేటంత వరకూ యీ ప్రభుత్వవ్యవస్థ 'వంటి' యంత్రంపనిచేస్తూ వర్గవిభేద చిహ్నాలను, పీడక వర్గ ప్రతిఘటనను అవసరమైతే హింసా ప్రయోగంచేసి నిశ్శేషంగా నిర్మూలించి వేస్తుంది కార్మికవర్గం—యికపై కార్మికప్రజారాజ్యమని చెప్పటం సమంజస మనుకుంటాను—బలపడి, పెట్టుబడిదారీ, జమీందారీ శక్తులు నశించిపోయి. పీడిత తాడిత వర్గాలులేని సిసలైన ప్రజారాజ్యంగా మారిన తరువాత యీ ప్రభుత్వ వ్యవస్థ వంటి తాత్కాలిక ప్రభుత్వ యంత్రంకూడ శిథిలమై పోయి దాని స్థానంలో సామాజిక కార్యకలాపాలన్నింటినీ సమన్వయంచేసే ప్రజాప్రతినిధులతో కూర్పడిన కార్యనిర్వాహకవర్గ మేర్పడుతుంది. అనగా కమ్యూనిస్టు సమాజం తర్వాత చరిత్రలో ప్రథమ పర్యాయం దానికన్న వృత్తిమపద్ధతిలో అది సమాజములోనిదే ఒక తెగకో, తరగతికో కాక సమాజాని కంతకూ ప్రాతినిధ్యం వహించి, సర్వసమాజాభీష్టాన్ని నెరవేరుస్తుంది.

ఎంగెల్సు వివరణ, జోస్యం యెంత సరియైనవో రష్యన్ విప్లవమే రుజువు చేసింది. కార్మిక వర్గశక్తి దృఢతర మవాలంటే అది అధికారాన్ని పూర్తిగా హస్తగతం చేసుకోవాలంటే పెట్టుబడిదారీ ప్రభుత్వ యంత్రాన్ని

సంపూర్ణంగా నాశనంచేసి వెయ్యాలి. అపని రోజుల్లో జరిగే పని కానిమాట నిజమే అయినా, ప్రభుత్వయంత్రం పెట్టుబడిదారుల అధికారంలో వున్నంత కాలం దానిని మార్చుకోవటం మాత్రం పిచ్చిపనే అవుతుంది. 1918 తర్వాత యూరపియన్ రాజ్యాలలో జరిగిన విప్లవ ప్రయత్నాలన్నీ విఫలమై పోవటానికి కారణం, వారు తాత్కాలిక ప్రభుత్వ యంత్రాలను నిర్మించుకోక పెట్టుబడిదారీ ప్రభుత్వయంత్రాలకే అతుకులు, మాతుకులు వేసి దాన్నే ప్రయోగించటమే కారణం.

మార్క్సు, ఎంగెల్సుల యీ అభిప్రాయాన్ని రెండవ ఇంటర్నేషనల్ కు చెందిన అవకాశవాదులే విధంగా అపభ్రంశం పాలుచేశారో లెనిన్ వ్రాసిన "ప్రభుత్వం విప్లవం" అన్న గ్రంథంలో సుస్పష్టంగా వివరించబడింది.

## ప్రకరణం 20.

# అంతిమ దినాలు.

హెగెల్ తత్వశాస్త్రానికి తర్వాత జర్మనీలో ఫ్యూయర్‌బాక్ ప్రముఖ భాష్యకారుడుగా పరిగణింపబడేవాడు. ఆయన రచనలలోని నిస్సారాన్ని బట్టబయలు చేస్తూ అవకాశవాదులకు తిన సహాయమైన వాని ఆదర్శవాద మనోయోగాన్ని తీవ్రంగా ఖండిస్తూ తాను వ్రాసిన గ్రంధాన్ని ఎంగెల్సు 1888 లో ప్రచురించాడు. అందులో మార్క్సు, తాను కలసి ప్రతిపాదించిన చారిత్రక భౌతిక వాద సిద్ధాంతాన్ని సరళమైన భాషలో స్పష్టంగా, సంగ్రహంగా ఆయన వివరించాడు.

ఎంగెల్సు మరణానికి కొద్దివారాల క్రితంవరకు ఆయన మేధస్సు నిశితంగా పనిచేస్తూనే వుంది. చనిపోయేముందు కొద్దినెలలముందుకూడ ఆయన నూతన రచనలు చేయాలనీ, మార్క్సు రచనలను సంపాదించాలనీ అనుకుంటూండేవాడు. "1848-50 దశలో ఫ్రాన్సులో వర్గ కలహాలు" అనే మార్క్సు గ్రంథానికి అవతారికలోనే ఎంగెల్సు పీఠిక వ్రాశాడు అదే ఆయనపూర్తి చేసిన అంతిమరచన, అందులో 1850 నుండి 1895 వరకు యూరప్ ఖండ చరిత్ర నంతా సంగ్రహంగానే అయినప్పటికీ సమగ్రంగా ఆయన వివరించాడు, చనిపోవటానికి కొన్నినెలల పూర్వమే దానిని వ్రాసినప్పటికీ అందులోకూడ

ఆయన భావనాపటిమగాని, వాదనాచాతుర్యంగాని, సహజ నిర్దాక్షిణ్యావిమర్శనా శక్తిగాని ఏమాత్రం లోపించలేదు!

మార్క్సువలె ఎంగెల్సు ఉద్రేకత లూగించే ఉపన్యాసకుడు కాడు. 1893 లో జూరిచ్‌లో జరిగిన కాంగ్రెస్‌లోను, వియన్నా, బెర్లిన్ పట్నాల లోను చేసినవే ఆయన అంతిమ వుపన్యాసాలు.

1895 మార్చిలో గొంతులో పుండు బయల్దేరి ఆఏడే అగస్టు 6-వ తేదీన తన దేహాన్ని దహనంచేసి, బూడిదను సముద్రంలో కలిపి వేయమని అంతిమ ఘడియల్లో తన ఆఖరి కోర్కెను వెల్లడించి, ఎంగెల్సు దివంగతుడయ్యాడు. ఎలియనార్ మార్క్సు మొదలైన ఆయన ప్రాణస్నేహితులు కొందరీ అంతిమవిధి కార్యాన్ని నెరవేర్చి, ఎంగెల్సు కతిప్రీతిదాయకమైన యీస్ట్‌బోర్న్ సముద్రతీరానికి పోయి, పడవ నొకదానిని కుదుర్చుకుని సముద్రములోనికి పోయి అగస్టు 27 వ ఎంగెల్సు అస్థికలను వదలి తిరిగి వచ్చారు.

## ప్రకరణం 21.

# ఎంగెల్సు—వ్యక్తి

కష్టాలంటే యేమిటో తెలియనివాడు కాకపోయినప్పటికీ, లండన్ ప్రవాస కాలంలో మార్క్సు కుటుంబమనుభవించిన విపరీత క్లేశాలవంటివిమాత్రం ఎంగెల్సు అనుభవించి యుండలేదు.

ఆయన బహు ఆలోచనా పరుడు, సూక్ష్మగ్రాహి, కుశాగ్రబుద్ధి మేధావులందరి వలెనే పట్టుకున్న ప్రతిసమస్యను. విషయాన్ని సర్వతోముఖంగా సమగ్రంగా మథించి అర్థంచేసుకుంటే గాని విడనాడనటువంటిపట్టుదల గలవాడు అనే విషయాలు యింతక్రితమే వివరించి యున్నాను.

ఆయన పాండిత్యం తత్వశాస్త్రం, చరిత్రలలోనే కాక ప్రకృతి, సైనిక, వివిధ భాషాతత్వ శాస్త్రాలలోకూడ ఊడలు వేసికొనలుసాగింది. మార్క్సువలెనే ఎంగెల్సుకూడ బహుభాషా కోవిదుడు. ఆయనకు పదిభాషలలో మంచి పాండిత్యముంది. ఇబ్సన్ రచనల మూలాలను చదవటానికై ఆయన తన

డెబ్బదవయేట నార్వేజియన్ భాష నభ్యసించాడు! ఎంగెల్సు రూపురేఖావిలాసాలను వర్ణిస్తూ ఆయనకు బాగా పరిచితుడైన లెస్నర్ యీవిధంగా వ్రాశాడు: రూపురేఖా విలాసాల్లో మార్క్సు, ఎంగెల్సులకు విస్తారమైన వ్యత్యాసముంది. ఎంగెల్సు పొడుగ్గా, సన్నగా వుండేవాడు. సాహసంగా, చలాకీగా ముందుకు దూసుకు పోయేరకం. సంభాషణ సూక్ష్మంగా. సూటిగా వుండేది. సైనికునివలె నిటారుగా నడిచేవాడు. అతి మృదువైనవాడు. హాస్యంలో అందెవేసిన చెయ్యి. ఆయనతో పరిచయం కలిగిన ప్రతివానికీ తానొక మహా మేధానిధితో నుంటున్నాననే విషయం వెంటనే స్ఫురించేది.”

లెస్నరు వర్ణన యెంతసరైనదో 1877 జనవరి 21 నాడు మార్క్సు సతీమణి సార్జికి వ్రాసిన యీక్రింది లేఖాభాగాన్ని చూస్తే బోధపడుతుంది. అందులో ఆమె తనకూతుళ్లు సంసారాలు మొదలైన వాటిని గురించిన విశేషాలను వివరించినతర్వాత ఎంగెల్సును గురించి యిట్లా వ్రాసింది. “మా ప్రియతమ మిత్రుడైన ఎంగెల్సు కులాసాగానే వున్నాడు. అతనెప్పటి వలెనే ఆరోగ్యంగా, చలాకీగా, హుషారుగా వున్నాడు. బీర్ అంటే మహా యిష్టం; అందులో వియన్నా బీరంటే ప్రాణపదం”

వ్యక్తుల మంచి చెడ్డలను నిర్ణయించడంలో ఆయన అనేకమార్లు పొరబడ్డాడనీ, సూక్ష్మబుద్ధిగల విజ్ఞానవంతులన్నా, ధార్మిక ప్రవర్తనులైన పండితులన్నా మండిపడేవాడనీ: గౌరవపాత్రులు కానివారని తనకుతోచిన వారిపట్ల ఆయన మర్యాదగానూ, సహనంగానూ యేమాత్రమూ చూసేవాడు కాదనీ అనటంలో అసత్యమేమీ లేదు. కాని అంతమాత్రాన, హైండ్ మన్ తన గ్రంథంలో ఎంగెల్సుపై చేసిన నిందారోపణ లేమాత్రం సత్యం కావని ఘంటాపథంగా చెప్పవచ్చును.

హైండ్ మన్ పట్ల ఎంగెల్సు అభిప్రాయం అతికటువుగా వుండనే సత్యాన్ని మేమూ అంగీకరిస్తున్నాము. కాని సోషల్ డెమాక్రటిక్ ఫెడరేషన్ నాయకులు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని మూఢంగా మాత్రమే అనుసరించి కార్మికుల నెత్తిపై రుద్దుతున్నారని, పార్టీని నిజమైన కార్మికవర్గ పార్టీగా కాక కార్మికోద్యమానికి సంబంధంలేని ఒక ముఠాగా తయారుచేసి వుంచుతున్నారనీ, సిద్ధాంతాలను వల్లిస్తూ, వాటిని ఆచరణలో అన్వయించుకొనే మార్గం

తెలియని అయోమయ అంధకార స్థితిలో పడి ఏమీ చేయలేక "శూన్యం నుండి బయల్దేరి శూన్యంలో పయనించి, శూన్యానికి" చేరుకున్నారని ఆయన చెప్పిన విషయం మటుకు అక్షరాలా నిజం.

హైండ్‌మను, సోషల్ డెమాక్రటిక్ ఫెడరేషన్‌లోని ఆయన అనుచరులే మార్క్సు సిద్ధాంతాన్ని ఇంగ్లండులో కెల్ల అందరికన్న బాగా అర్థం చేసుకున్న వారిలో ప్రథములని ఎంగెల్సు ఒకమారు తనతో చెప్పాడని మెహ్‌రింగ్ చెప్పాడు. ఎంగెల్సు ఖండించినట్లా వారి కార్యాచరణ విధానాన్ని మాత్రమే.

మార్క్సిజమనేది ముఖ్యంగా గతచరిత్రలోని గర్భితవిషయాలను వెలుగులోనికి తెచ్చి, ప్రస్తుత సమస్యలకు అద్యతన భావిలో రాబోయే సమస్యలకు పరిష్కార మార్గాలను సూచే ఒక "విధాన" మనే విషయాన్ని హైండ్‌మను గాని, సోషల్ డెమాక్రటిక్ ఫెడరేషన్ యొక్క యితర నాయకులు చాలమంది గాని గుర్తించలేరు. లెనిన్, స్టాలిన్లు, వారి అనుచరులు యీవిషయాన్ని బాగా అర్థంచేసుకుని మార్క్సిస్టు విధానాల్ని ఆచరణలో పెట్టుటలో ఆరితేరటం వల్లనే అల్లకల్లోలాలకు, ఆర్థిక మాంద్యాలకు నిలయమై, విద్యావిహీనుల కాటపట్టయిన రష్యా సామ్రాజ్యాన్ని యీనాడు అవిద్య, ఆకలి, ఆర్థిక, జాతీయ అసమత్వాలు లేనటువంటి, జాతీయ సంస్కృతిని పెంపొందించుకునేందుకు గాను సమానావకాశాలు కలిగినటువంటి స్వచ్ఛంద సమ్మేళనంగా యేర్పడిన వివిధజాతుల ప్రజారాజ్యాంగా అభివృద్ధిచేసి ఆర్థిక, సైన్యానిక, సైనిక రంగాల్లో తాము సాధించిన మహత్తర విజయాలనుచూచి ఆగర్భశత్రువులు కూడ మెచ్చుకోక గత్యంతరం లేనంతటి ఉచ్ఛస్థితిలోనికి వృద్ధిచేయగలిగారు.

విప్లవాన్ని తలుచుకున్నంత మాత్రానే భయభీతులయ్యే ఫేబియన్లను, ఇండిపెండెంటు లేబరుపార్టీ వారినీ కూడ ఆయన సహేతుకంగానే దుయ్యబట్టాడు. కాని ఆసంస్థలకు చెందిన సాధారణ సభ్యులలోను, మొత్తంమీద కార్మికోద్యమంలోను మాత్రం ఆయన విశేష సమ్మానం కలగయుండేవాడు. తర్వాతి ఘటనలు చూచినట్లయితే ఆయన సమ్మానం వృథాకాలేదనే విషయాన్ని మనకు తెలుస్తుంది మార్క్సు, ఎంగెల్సుల్లో యెవరోగానా కుష్కా వాగాపం

బరం లేదు. ఎంగెల్సు స్నేహితులతో అతి సన్నిహితంగాను, సహాయకుడుగాను సంచరించేవాడు. కాని ఏ స్నేహితుడైనా మోసగాడని తేలినా, లేక తన ఆశయాలకు వ్యతిరేకుడని తెలిసినా అతనిపట్ల నిర్దాక్షిణ్యంగానే కాక అతి నిరసనగాకూడ ప్రవర్తించేవాడు.

మార్క్సు యావజ్జీవిత కాలమూ అతనితో జీవితాంతం వరకూ ఎంగెల్సు ఎంత స్నేహంగా మెలిగాడో వారిద్దరి మధ్యా నడచిన ఉత్తర ప్రత్యుత్తరాలను, మార్క్సు సతీమణి, కూతురు ఎలియనార్ లు వ్రాసిన జాబులలో ఎంగెల్సును గూర్చిన భాగాలను చూస్తే తెలుస్తుంది. మార్క్సు రెండవ కూతురైన లారా, లఫార్గును వివాహం చేసుకొన నిశ్చయించుకొనే ముందు ఎంగెల్సు అంగీకారంకూడ పొందాలని పట్టుపట్టిందనే విషయము, మార్క్సు కడసారి కూతురైన ఎలియనార్ తో లిస్సాగరే వివాహసంబంధం గురించికూడ మార్క్సు, ఎంగెల్సుతో సంప్రదించడము చూచినట్లయితే మార్క్సు కుటుంబంతో ఎంగెల్సుకు గల అతిసన్నిహిత సంబంధము మనకు బోధపడుతుంది. మార్క్సు, ఎంగెల్సుల మధ్య నడచిన జయాపజయాలతోను, కష్టసుఖాలతోను నిండియున్న నలుబది ఏండ్ల సన్నిహిత సహవాస దీర్ఘ కాలాన్ని పరిశీలించినట్లయితే మేము పైన పేర్కొన్న ఒక సందర్భంలో తప్ప వారిమధ్య కలతలే లేవని చెప్పవచ్చును. ఆ ఒక్క పర్యాయం కూడా మనభిప్రాయంతప్ప వేరేదీ కారణం కాదు. దీన్ని బట్టి వారిద్దరి శీలాలూ యెంత స్వచ్ఛమైనదీ, పరిశుద్ధమైనదో మనం సులభంగా గ్రహించవచ్చు.

మార్క్సు పారిస్ నుండి బహిష్కరింప బడగానే, అంటే 1845 నాటికే ఎంగెల్సు "యీ సందర్భంలో అయ్యే అదనపుఖర్చును మనమంతా కమ్యూనిస్టు పద్ధతిలో సమిష్టిగా భరించేందుకుగాను" ఒకనిధిని వసూలుచేయ నారంభించాడు. తరువాత యీవిధంగా వ్రాశాడు; "బ్రెస్సెల్స్ లో నివాసం ఏర్పరచుకొటానికిగాను గాను నీకిది (పోగుచేసినసొమ్ము) సరిపోయేదీ లేనిదీ నాకు తెలియదు గాన, త్వరలో నే ప్రచురించ బోయే నా ప్రథమరచన ('ఆంగ్ల కార్మికవర్గ స్థితిగతులు') పైన వచ్చే సొమ్మునంతను, ప్రస్తుతందానితో నాకంత అవసరం లేదుగాన, నీయుపయోగార్థమై సంతోషంగా పంపేందుకు సర్వసంసిద్ధంగా వున్నాను. ద్రోహులు కనీసం నీకు ఆర్థిక చిక్కు కలిగించ

సంతృప్తి సంతోషాలు పొందటంకూడ సాధ్యంలేదు.'' ఆనాడు ప్రారంభించి మార్క్స్ జీవితాంతం వరకూ ఎంగెల్సు యేవిధంగా ఆయనకు సహాయపడుతూ వచ్చిందీ పైన వివరించాను.

మార్క్స్ సతీమణికి ఆఖరిమారు జబ్బుచేసినప్పుడు, తర్వాత మార్క్స్ కూతురైన జెన్నీకి జబ్బుచేసినప్పుడు కూడ ఎంగెల్సు తన సానుభూతిని తెలుపుటమే కాక తనకు చేతనైన సర్వవిధాలా, ముఖ్యంగా ఆర్థికంగా సహాయంచేశాడు. మార్క్స్ దంపతులు తమ కూతుండ్రను చూచుటకై, మార్క్స్ సతీమణి మరణానికి ముందు ఆఖరి పర్యాయం పారిస్ పోయినప్పుడు ఎంగెల్సు మార్క్స్‌కు జాబు వ్రాస్తూ యేది కావలసి వచ్చినా, ముఖ్యంగా ఎంత సొమ్ము కావలసివచ్చినా మోమాట పడకుండా తనకు తెలియచెయ్యమని వ్రాశాడు. "మీ భార్యకేదీ లోటు రానివ్వకండి. ఆమెకేది కోరికగా వున్నా, ఆమెకేది సంతోషం కలిగిస్తుందని మీకు తోచినా వెంటనే దానిని తప్పక తెచ్చియివ్వండి" అని 1881, జూలై 29 నాడు ఎంగెల్సు వ్రాశాడు.

అవసరంలోను, చిక్కులలోను వుండి తనవద్దకెవరువచ్చినా ఎంగెల్సు ఖాళీచేతులతో తిరిగి పంపించి ఎరుగడని లెస్నర్ వ్రాశాడు. మార్క్స్ జీవితకాలంలోను, ఆ తర్వాత కూడ తమసంయుక్త కృషిలోని తన భాగాన్ని ఎంగెల్సు యేవిధంగా కొంచపరచుకొంటూ ఉత్తమ భాగాలు భావాలన్నీ మార్క్స్‌కు చెందినవేనని చెప్తుండేవాడో చూస్తేనే చాలు ఎంగెల్సు ఔదార్యం వ్యక్తమవుతుంది. ఉదాహరణకు గత ప్రకరణాలలో యిచ్చిన ఎంగెల్సు లేఖాభాగాలే చాలుననుకుంటాను. ఒక్కొక్కమారు ఆయన యిల్లాఅంటూండేవాడు: "మార్క్స్ మాకన్న ఎప్పుడూ ఒక మెట్టుపైనే వుండేవాడు. మా అందరికన్న దూరదృష్టి, విశేషవిషయ పరిజ్ఞానం, సూక్ష్మసులభగ్రాహ్యకత్వం కలవాడాయన.'' తాను కనుగొన్న విషయాలను కూడ తాను లేకపోయినా మార్క్స్ యేలాగూ కనుగొనియుండేవాడని ఎంగెల్సు వాదించేవాడు!

'జరిగిన దానిలోనే' గాని జరిగివుండవలసిన దానితో చరిత్ర నిర్మింపబడదు. అనే మెహ్రింగు ప్రవచనాన్ననుసరించి ఎంగెల్సు వినయంవల్ల ఆగాన ఘనతరమేమీ మనకు పడదు. మార్క్స్ మహామేధావి దాదాపుగా

ఎంగెల్సు కూడ ఆయనతో సమానుడే. కాని ఆయన వినయానికి మాత్రం హద్దుల్లేవు.

ఎంగెల్సు ఎంత వినయశీలుడో తన డెబ్బదవ పుట్టినరోజు సందర్భాన వచ్చిన శుభ సందేశాలకు సమాధానమిస్తూ ఆయన వ్రాసిన యీ క్రింది వాక్యాలు చూస్తేనే తెలుస్తుంది. "యీ హంగామా హడావిడ్లు యెంత త్వరగా సద్దుమణిగితే నా మనస్సంత తేలికగా వుంటుంది.........ఇంతకీ మార్క్సు మహనీయుని కీర్తిప్రపత్తులను కూడ గట్టుకుంటూన్న వారిలో నేనొకణ్ణి మాత్రమే.

1893 లో ఎంగెల్సు జర్మనీ, స్విట్జర్లండు, ఆస్ట్రియా దేశాలలో పర్యటనం చేసినప్పుడు ఆ దేశాల కష్టజీవులు నానాటికీ పెంపొందుతున్న కార్మికోద్యమ నిర్మాత, నాయకుడు, రథికుడు, ఆయన ఎంగెల్సుకు బ్రహ్మాండమైన స్వాగతం అతిరథసంగా సమర్పించారు. దాని విషయమై 1893 అక్టోబరు 7_వ తేదీన ఆయన వ్రాసినదల్లా యిది! "ప్రజలకైతే యీ సంరంభం నచ్చవచ్చు గాని నాకేమాత్రం మనస్కరించలేదు. ఇప్పటికైనా అట్టహాసం, ఆర్భాటాలనుంచి బయటపడ్డందుకు సంతోషిస్తున్నాను. కాని వచ్చే పర్యాయం మాత్రం ప్రజల ముందు ప్రదర్శింప బడకనీ, వ్యక్తిగతంగా, ఏకాంతంగా ప్రయాణం సాగ్యానికి అంగీకరిస్తామని వ్రాతపూర్వకంగా హామీయిస్తేగాని రానని ముందే చెప్తున్నాను. నేను వెళ్ళిన చోటల్లా నాకోసం జరిగిన బ్రహ్మాండమైన సన్మాన, స్వాగత ప్రయత్నాలను చూస్తే నాకాశ్చర్యం కలిగింది. శాసన సభా కార్యకలాపధురంధరులకే గాని యిట్టి అట్టహాస ఆర్భాటాలు నాకు తగవు."

అదే సమయంలో, తాను జర్మనీ, ఆస్ట్రియాలలో లేని సుహాదేండ్ల కాలంలో అక్కడ జరిగిన వుద్యమాభివృద్ధిని చూచి ఎంగెల్సు చాల సంతోషించాడు.

"ఎంగెల్సు జీవితం, ఉపదేశాలు" అనే యీ గ్రంథాన్ని చార్టిస్టు నాయకులలో ఉత్తముడు, 'ఉత్తర తార' అనే చార్టిస్టు పత్రికా సంపాదకుడూ అయిన జూలియన్ హార్నె యొక్క యీ క్రిందిమాటలతో ముగించటం చాల బాగుంటుందనుకుంటాను,

"ఎంగెల్సును నేను బాగా ఎరుగుదును, ఆయన నాస్నేహితుడు. నాపత్రికకు కూడ చాలయోగ్యమైన వ్యాసాలు పంపుతూండేవాడు. 1843 లో ఆయన బ్రాడ్‌ఫర్డునుండి లీడ్సు వచ్చి 'ఉత్తరతార' పత్రికా కార్యాలయం లో నన్ను కలుసుకున్నప్పటి మాట.........ఎత్తుగా, నిటారుగా, బాల్య సౌకుమార్యంతో కూడిన వదనంగల ఒక యువకుడు వచ్చాడు. జన్మతః జర్మన్ వాడైనా అప్పటికే యాసలేకుండా యింగ్లీషు చకచక మాట్లాడాడు. తాను 'ఉత్తరతార'ను విడువక చదువుతున్నాననీ, చార్టిస్టు ఉద్యమాభివృద్ధిని అతిశ్రద్ధతో గమనిస్తున్నాననీ ఆయన చెప్పాడు. ముప్పదిరెండేండ్ల క్రితం ఆనాడు మాయిద్దరి మధ్య స్నేహం ప్రారంభమైనది. ఎంగెల్సు యొక్క విశేష కార్యభారంతోను, కష్టాలలోను మునిగియున్నప్పటికీ తన స్నేహితులను మరువక, అవసరమైనప్పుడల్లా వారికి తనచేతనైన సలహాసహాయాలను చేస్తూండేవాడు. తన అపారమైన అనుభవాన్ని చూచుకునిగాని, విశేషమైన పలుకుబడిని తలుచుకొనిగాని ఆయన యెన్నడూ గర్వించి యెరుగడు. పైగా యిరువది రెండవయేట తానెంత వినయశీలుడుగా వుంటూ యితరుల ఆధిక్యత, గొన్నతనాలను గుర్తిస్తూండేవాడో తన యేబదవయేట కూడ ఆయన అంత వినయశీలుడుగానే వున్నాడు. అతిథులపట్ల విశేష ఆప్యాయత కలిగి వుండేవాడు. హాస్యంలో ఆయన దంటవేసిన చెయ్యి. ఇతరులను తన హాస్యరస పూరిత సంభాషణలలో కడుపుబ్బ నవ్వించేవాడు. విందు సమయాలలో విలాసం కలిగించటంలో విశేషపాత్ర యెప్పుడూ ఆయనదే, అందులో ఆయన అతిథులుగా వచ్చేవారంతా ఓడిపోయిన చార్టిస్టులు, కార్మికోద్యమ కార్యకర్తలు, సోషలిస్టులే."

ప్రపంచ కార్మికులారా ఏకముకండు' విప్లవం వర్ధిల్లాలి!!

శ్రీ వ. సి. ఈశ్వర ముద్రాక్షరశాలయందు ముద్రితము.

# ప్రగతి ప్రచురణలు

★

| | | |
|---|---|---|
| 1. | అన్నా (నిషేధించబడింది) | 1- 8-0 |
| 2. | చైనా యెర్రసైన్యం | 4- 0-0 |
| 3. | కమ్యూనిస్టు సూత్రాలు | 0- 8-0 |
| 4. | ఫాంటమారా | 2- 0-0 |
| 5. | సోవియట్ చైనా రష్యా రాజ్యాంగాలు | 0-12-0 |
| 6. | చైనా విప్లవ చరిత్ర (మొదటి భాగం) | 3- 0-0 |
| 7. | ,, (రెండవ భాగం) | 3- 0-0 |
| 8. | సంసారసుఖం (టాల్‌స్టాయ్) | 1- 0-0 |
| 9. | ఎంగెల్సు జీవితం : ఉపదేశాలు | 1- 0-0 |

★

ప్రాప్తిస్థానం:

## ప్రగతి ప్రచురణాలయం

నిడమర్రు, (వయా) పెంటపాడు,

పశ్చిమగోదావరి జిల్లా.

Wrapper Printed at the Weldun Press, Madras 21